www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉగాది శుభాకాంక్షలు

మంగళవారం | 9-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 355 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 8.30 తదుపరి విదియ; నక్షత్రం: రేవతి ఉ. 7.33 తదుపరి అశ్విని తె. 5.06 వరకు; వర్జ్యం: రా. 1.31-2.57; దుర్ముహూర్తం: ఉ. 8.35-9.25, రా. 10.16-11.01; అమృతఘడియలు: తె. ఉ. 6.50, రా. 10.38-12.05; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రూ.400 లక్షల కోట్లు

సరికొత్త మైలురాయికి స్టాక్ మార్కెట్ సంపద



న్యూఢిల్లీ: మన స్టాక్ మార్కెట్ సంపద సోమవారం సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.400.86 లక్షల కోట్లకు (4.81 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని తాకడం ఇదే తొలిసారి. 2023 జూలై 5న రూ.300 లక్షల కోట్ల స్థాయికి చేరిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్.. దాదాపు 9 నెలల్లోనే మరో రూ.100 లక్షల కోట్లు పెరగడం విశేషం. కాగా, గడిచిన ఏడాది కాలంలో మార్కెట్ సంపద రూ.145 లక్షల కోట్లు (57 శాతం) పుంజుకుంది. 2007లో రూ.50 లక్షల కోట్లకు చేరిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్.. 2014 మార్చిలో తొలిసారిగా రూ.100 లక్షల కోట్ల మైలురాయిని తాకింది. అంటే, రూ.50 లక్షల కోట్ల సంపద వృద్ధికి ఏడేళ్లు పట్టింది. ఆ తర్వాత ఏడేళ్లలో మరో రూ.100 లక్షల కోట్లు పెరిగి 2021 ఫిబ్రవరిలో రూ.200 లక్షల కోట్ల మార్క్‌ను దాటింది. ఆ తర్వాత 30 నెలల్లోనే (రెండున్నరేళ్లు) రూ.200 లక్షల కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) మార్కెట్ విలువ సైతం రూ.400 లక్షల కోట్లకు చేరువలో (రూ.397.76 లక్షల కోట్లు) ఉంది. డాలర్ రూపేణా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని 2023 నవంబరు 29న చేరుకుంది. అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను సాధించిన ఐదో దేశం భారత్. అంతేకాదు, మార్కెట్ క్యాప్ పరంగా భారత్ ఈమధ్యనే హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి నాలుగో అతిపెద్ద దేశంగా అవతరించింది. 2021లోనే స్టాక్ మార్కెట్ సంపద మన జీడీపీ స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్ క్యాప్-జీడీపీ నిష్పత్తి 1.33గా (133 శాతం) ఉంది.

మార్కెట్ క్యాప్ మైలురాళ్లు

సంవత్సరం	రూ.లక్షల కోట్లు
2007	50
2014 మార్చి	100
2021 ఫిబ్రవరి	200
2023 జూలై	300
2024 ఏప్రిల్	400

రికార్డు గరిష్ఠాలకు సూచీలు

22,600 ఎగువకు నిఫ్టీ

స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. అంతర్జాతీయ మార్కెట్ సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులతోపాటు మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు పుంజుకోవడం సూచీల ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్ ఒకదశలో 621.08 పాయింట్లు ఎగబాకి 74,869.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 494.28 పాయింట్ల లాభంతో 74,742.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక దశలో 183.6 పాయింట్ల వృద్ధితో 22,697.30 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 152.60 పాయింట్ల లాభంతో 22,666.30 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడగా.. మారుతి సుజుకీ, ఎం అండ్ ఎం 3 శాతానికి పైగా వృద్ధి చెంది సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 0.26 శాతం లాభపడగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.06 శాతం తగ్గింది. రంగాల వారీ సూచీల్లో ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, కన్స్యూమర్ డిస్క్రెషనరీ, రియల్టీ, మెటల్ సూచీలు 1.65 శాతం వరకు పెరిగాయి. సేవలు, ఐటీ, టెక్ సూచీలు మాత్రం నేలచూపులు చూశాయి.

మే 20న స్టాక్ మార్కెట్‌కు సెలవు

వచ్చేనెల 20న (సోమవారం) ముంబైలో లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ జరగనున్న సందర్భంగా ట్రేడింగ్‌కు సెలవు పాటించనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విభాగాల్లో ఆ రోజు ట్రేడింగ్ జరగదని స్టాక్ ఎక్స్ఛేంజీలు విడిగా విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నాయి. అంతేకాదు, రంజాన్ సందర్భంగా ఈ నెల 11న, శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న, మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 1న కూడా స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు పాటించనున్నాయి.

ఎడెల్‌వీజ్ రూ.200 కోట్ల ఎన్‌సీడీల జారీ

ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.200 కోట్ల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ సోమవారం ప్రారంభమైంది. ఈనెల 23న ఇష్యూ ముగియనుంది. 24, 36, 60, 120 నెలల కాలపరిమితితో కూడిన ఈ ఫిక్స్‌డ్ కూపన్ రేటు ఎన్‌సీడీలపై 9 నుంచి 10.46 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు సెబీ ఓకే

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.5,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్‌కు చెందిన రూ.4,000 కోట్ల విలువైన ఈక్విటీ వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

పసిడి పైపైకే..



ఈ వేసవిలో భానుడితో పాటు బంగారం, వెండీ భగ్గుమంటున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు సోమవారం సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రేటు మరో రూ.350 పెరిగి రూ.71,700కు చేరుకుంది. కిలో వెండి రూ.800 ఎగబాకి రూ.84,000 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరల పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,336 డాలర్లకు పెరగగా.. వెండి 27 డాలర్ల ఎగువన ట్రేడైంది. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతోపాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంక్‌లు భారీగా బంగారం కొనుగోళ్లకు పాల్పడుతుండటం ప్రస్తుత గోల్డెన్ ర్యాలీకి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

25 మంది ఐఎస్‌బీ విద్యార్థులకు విదేశీ ప్లేస్‌మెంట్లు

హైదరాబాద్: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) హైదరాబాద్, మొహాలీ క్యాంపస్‌ల్లో ఈ సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు పూర్తయ్యాయి. పీజీపీ పూర్తి చేసిన విద్యార్థులందరికీ మంచి మంచి కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు వచ్చాయి. యాభై శాతానికిపైగా ప్లేస్‌మెంట్ ఆఫర్లు కన్సల్టెన్సీ, టెక్నాలజీ కంపెనీల నుంచే వచ్చాయి. పది శాతం ఆఫర్లు మాత్రం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీల నుంచి వచ్చినట్టు ఐఎస్‌బీ తెలిపింది. దాదాపు 25 మంది విద్యార్థులకు మాత్రం విదేశీ కంపెనీల నుంచి ఆఫర్లు లభించాయి. ప్లేస్‌మెంట్లలో ఎక్కువ భాగం ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, సేల్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్‌లో (జీసీసీ) లభించాయి. కొన్ని మొబిలిటీ కంపెనీలు కూడా ఈ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో పాల్గొన్నాయి. అక్సెంచర్, డెలాయిట్, నగారో, మెకెన్సీ, నవీ టెక్నాలజీస్ వంటి కంపెనీలు ఒక్కోటి 20 మంది పీజీపీ పూర్తి చేసిన విద్యార్థులను తీసుకున్నాయి. బీసీజీ, ఓలా, మెరిలిటిక్స్, టీవీఎస్ మోటార్ కంపెనీ, నైకా, జెన్‌పాక్ట్, యూనిలీవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా మంచి ఆఫర్లతో ప్లేస్‌మెంట్లు ఇచ్చాయి. మొత్తం 394 కంపెనీలు ఈ సారి ప్లేస్‌మెంట్ల కోసం నమోదు చేసుకుంటే అందులో 70 కంపెనీలు తొలిసారిగా ఐఎస్‌బీకి వచ్చాయి.

బజాజ్ ఫైనాన్స్ ఎఫ్‌డీ రేట్లు పెంపు

న్యూఢిల్లీ: బజాజ్ ఫైనాన్స్ వివిధ కాలపరిమితులు గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీరేట్లను 0.60 శాతం మేరకు పెంచింది. ఈ రేట్లు ఏప్రిల్ 3వ తేదీ నుంచే అమలుపరుస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. సీనియర్ సిటిజెన్లకు 25-35 నెలల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై 0.60 శాతం, 18-24 నెలల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై 0.45 శాతం వడ్డీ పెంచింది. 42 నెలల కాలపరిమితికి డిజిటల్‌గా ఎఫ్‌డీ చేసిన సీనియర్ సిటిజెన్లు 8.85 శాతం, ఇతరులు 8.6 శాతం వడ్డీ యథాతథంగా పొందవచ్చునని కంపెనీ తెలిపింది.

గ్లాండ్ ఫార్మా షేర్లలో భారీ బ్లాక్ డీల్!

హైదరాబాద్: స్థానిక గ్లాండ్ ఫార్మా షేర్లలో భారీ బ్లాక్ డీల్ చోటు చేసుకోనుంది. కంపెనీ మాజీ ప్రమోటర్ డాక్టర్ రవి పెన్మత్స నిర్వహణలోని నికోమాక్ మెషినరీ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్‌పీ అడ్వైజరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో తమ వద్ద ఉన్న షేర్లలో 15 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,249 కోట్లు) విలువైన షేర్లను బ్లాక్ డీల్ ద్వారా అమ్మకానికి పెట్టినట్టు సమాచారం. అవసరమైతే మరో 1.8 కోట్ల డాలర్ల విలువైన షేర్లనూ అమ్మేందుకు ఈ సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఒక్కో షేరును రూ.1,725కు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. సోమవారం నాటి ముగింపు ధరతో పోలిస్తే 7.34 శాతం డిస్కౌంట్‌తోనే డాక్టర్ రవి పెన్మత్స నిర్వహణలోని కంపెనీలు ఈ షేర్ల అమ్మకానికి సిద్ధపడడం విశేషం. ఇది కంపెనీ ఈక్విటీలో 4.4 శాతం నుంచి ఐదు శాతానికి సమానం. ఈ అమ్మకం తర్వాత కూడా డాక్టర్ పెన్మత్స వద్ద ఇంకా కంపెనీ ఈక్విటీలో ఒక శాతం షేర్లు ఉంటాయని భావిస్తున్నారు.

వాతావరణ మార్పులు ద్రవ్య విధానాలకు సవాలే

ఆర్‌బీఐ నివేదిక

ముంబై: వాతావరణంలో తరచుగా ఏర్పడే మార్పులు ఆర్థిక వృద్ధికి, ద్రవ్య విధానాలకూ సవాలుగా పరిణమించనున్నాయని ఆర్‌బీఐ ఆందోళన ప్రకటించింది. వాతావరణ మార్పుల కారణంగా ద్రవ్యోల్బణం పోటెత్తే ప్రమాదం ఉన్నట్టు 'ద్రవ్య విధాన నివేదిక - ఏప్రిల్ 2024' పేరుతో విడుదల చేసిన నివేదికలో తెలిపింది. వాతావరణ మార్పులతో వ్యవసాయ ఉత్పత్తి, సరఫరా దెబ్బతింటాయని పేర్కొంది. సరైన విధానాలు లేకపోతే వాతావరణ మార్పుల ప్రభావం వల్ల 2050 నాటికి వ్యవసాయ ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది శాతం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది

రూపీ డెరివేటివ్స్‌లో పాల్గొనండి: దాస్

దేశ, విదేశాల్లో జరిగే రూపీ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో దేశీయ బ్యాంకులు చురుగ్గా పాల్గొనాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కోరారు. అదే సమయంలో తమ నష్ట భయాలనూ బ్యాంకులు జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని సూచించారు. బార్సిలోనాలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ విషయంలో భారతీయ బ్యాంకుల పాత్ర చాలా పరిమితంగా ఉండడంపై దాస్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. రూపీ డెరివేటివ్స్ వేగంగా వృద్ధి చెందుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దేశీయ బ్యాంకులు మార్కెట్ మేకర్స్‌తో కాకుండా, నేరుగా తుది ఖాతాదారులతోనే డెరివేటివ్స్ ట్రేడింగ్ చేయాలని కోరారు. ఈ ట్రేడింగ్‌లో దేశీయ బ్యాంకుల పాత్రను మరింత పెంపొందించాలన్నదే ఆర్‌బీఐ లక్ష్యమని దాస్ తెలిపారు.

కస్టమర్ల విశ్వాసమే మా విజయం

సంగీతా మొబైల్స్ ఎండీ సుభాష్ చంద్ర



బెంగళూరు: సంగీత మొబైల్స్‌లో కొనుగోళ్ల ప్రతి వినియోగదారుడి నమ్మకమని కంపెనీ ఎండీ సుభాష్ చంద్ర అన్నారు. లక్షలాది కస్టమర్ల విశ్వాసమే పునాదిగా మొబైల్ రిటైల్ రంగంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోగలిగామని అభిప్రాయపడ్డారు. సంగీతలో కొన్న మొబైల్ ఏ కారణంగా డామేజ్ అయినా కేవలం 10 నిమిషాలలో 50 శాతం చెల్లింపుతో కొత్త ఫోన్ సొంతం చేసుకోవచ్చునని సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చెప్పారు. ధరల తగ్గుదల నిరంతర ప్రక్రియ అన్నారు. కస్టమర్ల భద్రత కోసం సైబర్ సొల్యూషన్లు కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. వినియోగదారులకోసం మొబైల్స్‌తో పాటు టెలివిజన్‌లు, ఎయిర్ కండిషనర్లు, అన్ని ప్రధాన కంపెనీల లాప్‌టాప్‌లు; 20 వాట్స్ స్పీకర్, ఎఫ్ఎం రేడియో, కాల్ రికార్డింగ్ సౌకర్యం కల్గిన గాడ్జెట్లు కూడా సంగీత విక్రయిస్తోందని చెప్పారు. సంగీత గోల్డెన్ జుబిలీని పురస్కరించుకుని ఏడాది పాటు ఆఫర్లు అందిస్తున్నామని, కస్టమర్లకు ఉగాది రాయితీలు కూడా ఇస్తున్నామని ఆయన తెలిపారు. తమకు 7 రాష్ట్రాల్లో 800 షోరూంలున్నాయని వెల్లడించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	88,000 ▲
ముంబై	71,280 ▲	65,290 ▲	81,500 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ



హైదరాబాద్	375
చిత్తూరు	458
గోదావరి	390
విజయవాడ	390
విశాఖపట్నం	405
వరంగల్	377

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156
వరంగల్	156
కరీంనగర్	156
మహబూబ్‌నగర్	156
కర్నూలు	156
విశాఖపట్నం	134
గోదావరి	152
విజయవాడ	152
గుంటూరు	152
ఒంగోలు	152
చిత్తూరు	148

స్పోర్ట్స్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
316 పరుగులు	9 వికెట్లు

నేటి మ్యాచ్

పంజాబ్ X హైదరాబాద్

వేదిక: ముల్లాపూర్-రా.7.30 గం.

పట్టాలెక్కిన చెన్నై

- కోల్‌కతాపై ఘనవిజయం
- చెలరేగిన బౌలర్లు
- రుతురాజ్ అర్ధసెంచరీ



3 చెన్నై తరఫున తొలి బంతికే వికెట్ తీసిన మూడో బౌలర్‌గా తుషార్

జడేజా (3/18)

తుషార్ దేశ్‌పాండే (3/33)

చెన్నై: భారీ స్కోర్లతో బెంబేలెత్తిస్తూ.. తాజా సీజన్‌లో ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు ఝలక్. తమ సొంత ఇలాకాలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వారి జోరుకు బ్రేక్ వేసింది. అలాగే చెన్నై రెండు వరుస ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. బౌలింగ్‌లో స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/18), పేసర్లు తుషార్ దేశ్‌పాండే (3/33), ముస్తాఫిజుర్ (2/22) కేకేఆర్ బ్యాటర్లకు ముకుతాడు వేశారు. అటు బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించడంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే 7 వికెట్లతో ఘనవిజయం సాధించింది. చెపాక్‌లో చెన్నైకిది హ్యాట్రిక్ విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు చేసింది. శ్రేయాస్ (34), నరైన్ (27), రఘువంశీ (24) మాత్రమే ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 141 పరుగులు చేసి గెలిచింది. శివమ్ దూబే (28), మిచెల్ (25) సహకరించారు. వైభవ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జడేజా నిలిచాడు.

సునాయాసంగా..: స్వల్ప ఛేదన.. పైగా మంచు ప్రభావం ఉండడంతో సీఎస్‌కే ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్‌ను ముగించింది. స్లో వికెట్‌పై రుతురాజ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో తుదికంటా నిలిచాడు. ఉన్న కాసేపు ఓపెనర్ రచిన్ రవీంద్ర (15) మూడు ఫోర్లతో జోరు చూపి పేసర్ వైభవ్‌కు చిక్కాడు. అయితే కెప్టెన్ రుతురాజ్ ఫామ్‌ను అందుకుంటూ వరుస ఫోర్లతో చెలరేగడంతో పవర్‌ప్లేలో జట్టు 52/1 స్కోరుతో నిలిచింది. అతడికి మిచెల్ అండగా నిలిచి నరైన్ ఓవర్‌లో 6,4తో అలరించాడు. అయితే స్పిన్నర్ వరుణ్ మాత్రం పరుగులను కట్టడి చేశాడు. దీంతో ఇద్దరూ ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారించారు. అటు 12వ ఓవర్‌లో రుతురాజ్ ఈ సీజన్‌లో తొలి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే చక్కగా కుదురుకున్న వేళ మిచెల్ అనవసర షాట్‌కు వెళ్లి నరైన్ ఓవర్‌లో బౌల్డ్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 70 పరుగుల విలువైన భాగస్వామ్యం ముగిసింది. అనంతరం స్పిన్ స్పెషలిస్ట్ శివమ్ దూబే 16వ ఓవర్‌లో రెండు, 17వ ఓవర్‌లో మరో సిక్సర్ బాది అవుటైనా సమీకరణం 19 బంతుల్లో 3 పరుగులకు మార్చాడు. ఇక విజయ లాంఛనాన్ని పూర్తి చేసేందుకు అనూహ్యంగా ఎంఎస్ ధోనీ (1 నాటౌట్) క్రీజులోకి రావడంతో చెపాక్ ఊగిపోయింది. అయితే గైక్వాడ్ విన్నింగ్ షాట్ ఫోర్‌తో మరో 14 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్ల హవా: 85, 88.. తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో కేకేఆర్ పవర్‌ప్లే స్కోర్లివి. చెపాక్‌లో ఆ స్థాయి జోరు చూపలేకపోయినా.. తొలి ఐదు ఓవర్లలో 50 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ స్పిన్నర్ జడేజా బంతి చేపట్టాక అంతా తారుమారైంది. అటు ట్రాక్ కూడా ఒక్కసారిగా టర్న్ కావడంతో బ్యాటర్లకు షాట్లు ఆడేందుకే కష్టమైంది. పేసర్లు తుషార్, ముస్తాఫిజుర్ తమ వంతు సహకారం అందించడంతో కేకేఆర్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఈ జట్టు ఇన్నింగ్స్ తొలి బంతికే జడేజా మెరుపు క్యాచ్‌తో ఓపెనర్ సాల్ట్ వికెట్ కోల్పోయింది. పేసర్ తుషార్ ఈ వికెట్ తీసి ఒక్క పరుగే ఇచ్చాడు. కానీ అతడి రెండో ఓవర్‌లో ఓపెనర్ నరైన్ 4,4,6తో 19 రన్స్ రాబట్టాడు. ఐదో ఓవర్‌లో నరైన్, రఘువంశీ చెరో సిక్సర్ సహాయంతో పవర్‌ప్లేలో 56 పరుగులు చేయగలిగింది. ఇద్దరూ ధాటిగా ఆడుతున్నవేళ.. ఏడో ఓవర్‌లో స్పిన్నర్ జడేజా కేకేఆర్ లయను దెబ్బతీశాడు. రఘువంశీ, నరైన్ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చడంతో రెండో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక బంతిని టచ్ చేసేందుకే కష్టపడిన వెంకటేశ్ అయ్యర్ (3)ను తన తర్వాతి ఓవర్‌లోనే జడ్డూ అవుట్ చేశాడు. మరోవైపు శ్రేయాస్‌తో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన రమణ్‌దీప్ డిఫెన్సివ్ ఆటతీరుతో దాదాపు ఆరు ఓవర్లపాటు ఫోర్ కూడా నమోదు కాలేదు. 12వ ఓవర్‌లో సిక్సర్‌తో ఆకట్టుకున్న రమణ్‌దీప్ (13)ను తర్వాతి బంతికే తీక్షణ బౌల్డ్ చేశాడు. రింకూ సింగ్ (9) బరిలోకి దిగినా షాట్లు ఆడడంలో విఫలమయ్యాడు. డెత్ ఓవర్లలోనూ పరిస్థితి మారలేదు. సీఎస్‌కే పేసర్లు తమ పదునేంటో చూపించారు. 17వ ఓవర్‌లో రింకూను తుషార్ బౌల్డ్ చేశాడు. అలాగే హిట్టర్ రస్సెల్ సైతం 18వ ఓవర్‌లో ఐదు డాట్ బాల్స్ ఆడడం గమనార్హం. అలాగే అతడిచ్చిన క్యాచ్‌ను కీపర్ ధోనీ అందుకోలేకపోయినా.. తర్వాతి ఓవర్‌లోనే రస్సెల్‌ను తుషార్ వెనక్కిపంపాడు. చివరి ఓవర్‌లో ముస్తాఫిజుర్ తన కట్టర్ బంతులతో రెండు పరుగులే ఇచ్చి శ్రేయాస్, స్టార్క్ (0) వికెట్లు తీశాడు.

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) జడేజా (బి) తుషార్ 0, నరైన్ (సి) తీక్షణ (బి) జడేజా 27, రఘువంశీ (ఎల్బీ) జడేజా 24, శ్రేయాస్ (సి) జడేజా (బి) ముస్తాఫిజుర్ 34, వెంకటేష్ (సి) మిచెల్ (బి) జడేజా 3, రమణ్‌దీప్ (బి) తీక్షణ 13, రింకూ సింగ్ (బి) తుషార్ 9, రస్సెల్ (సి) మిచెల్ (బి) తుషార్ 10, అనుకూల్ రాయ్ (నాటౌట్) 3, స్టార్క్ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 0, వైభవ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 20 ఓవర్లలో 137/9; వికెట్ల పతనం:** 1-0, 2-56, 3-60, 4-64, 5-85, 6-112, 7-127, 8-135, 9-135; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-33-3, ముస్తాఫిజుర్ 4-0-22-2, శార్దూల్ 3-0-27-0, తీక్షణ 4-0-28-1, జడేజా 4-0-18-3, రచిన్ 1-0-4-0.

చెన్నై: రచిన్ (సి) వరుణ్ (బి) వైభవ్ 15, రుతురాజ్ (నాటౌట్) 67, మిచెల్ (బి) నరైన్ 25, దూబే (బి) వైభవ్ 28, ధోనీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 17.4 ఓవర్లలో 141/3; వికెట్ల పతనం:** 1-27, 2-97, 3-135; **బౌలింగ్:** స్టార్క్ 3-0-29-0, వైభవ్ అరోరా 4-0-28-2, అనుకూల్ రాయ్ 1.4-0-18-0, నరైన్ 4-0-30-1, వరుణ్ 4-0-26-0, రస్సెల్ 1-0-8-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

సుమిత్ సంచలనం



మాంటే కార్లో: భారత టెన్నిస్ యువ ఆటగాడు సుమిత్ నగాల్ సంచలన విజయం సాధించాడు. మాంటే కార్లో టోర్నమెంట్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మాటెఅర్నాల్డికి షాకిచ్చి వహ్వా అనిపించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో క్వాలిఫయర్, 93వ ర్యాంకరైన సుమిత్ 5-7, 6-2, 6-4తో అర్నాల్డి (ఇటలీ)ని వరుససెట్లలో చిత్తుచేశాడు. ఈ ప్రదర్శనతో 26 ఏళ్ల సుమిత్.. ఏటీపీ మాస్టర్స్ క్లే కోర్టు ఈవెంట్‌లో మెయిన్ డ్రాలో గెలుపు నమోదు చేసిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. టాప్-50లోపు ర్యాంకర్‌ను ఓడించడం నగాల్‌కు ఈ సీజన్‌లో ఇది మూడోసారి. రెండో రౌండ్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూన్ (డెన్మార్క్)తో సుమిత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

సింధుకు కఠిన పరీక్ష

నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



నింగ్‌బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధుకు కఠిన సవాల్ ఎదురుకానుంది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్ పాయింట్లు లభించే ఆఖరి ఈవెంట్ కావడంతో.. మంగళవారం నుంచి జరిగే ఈ టోర్నీలో వరల్డ్ టాప్ ర్యాంక్ ప్లేయర్లు అన్ సి యంగ్, తై జు యింగ్, యమగూచి, ఒకుహరా..తదితరులు బరిలో నిలవనున్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో మెరుగైన ప్రదర్శనతో పారిస్ బెర్త్‌ను సొంతం చేసుకోవడానికి సింధు మరింతగా శ్రమించాల్సి ఉంటుంది. తొలి రౌండ్‌లో జిన్ వి గో (మలేసియా)తో ఆమె తలపడనుంది. థాయ్ షట్లర్ బుసానన్‌తో ఆకర్షి కశ్యప్ ఆడనుంది. పురుషుల్లో లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ బరిలో నిలవనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో, అర్జున్-ధ్రువ్, కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్ జంటలు టైటిల్ కోసం తలపడనున్నాయి. కాగా, డబుల్స్ డిఫెండింగ్ చాంప్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట చివరి నిమిషంలో టోర్నీ నుంచి తప్పుకొంది.

నన్ను పక్కనపెట్టేలా కుట్రలు

- ఈసీ సభ్యులపై ఉష ఆరోపణ
- ఐఓఏలో ముదిరిన అంతర్గత విభేదాలు



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లో అంతర్గత విభేదాలు మరింతగా ముదురుతున్నాయి. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష-కార్యనిర్వాహక వర్గం (ఈసీ) సభ్యుల మధ్య ఏమాత్రం పొసగడం లేదు. ఉష తీసుకొన్న నిర్ణయాలను రెబల్ ఈసీ సభ్యులు బహిరంగంగానే ధిక్కరిస్తున్నారు. కీలక నిర్ణయాల్లో తన ప్రమేయం లేకుండా చేసే విధంగా రెబల్ ఈసీ సభ్యులు వ్యవహరిస్తున్నారని ఉష సోమవారం మిక్కడ ఆరోపించింది. ఐఓఏ హెడ్ క్వార్టర్స్‌లోకి అనధికార వ్యక్తులకు అనుమతిలేదంటూ తొమ్మిది మంది ఈసీ సభ్యుల సంతకాలతో కూడిన నోటీసును ఆఫీసు పరిసరాల్లో అంటించడం వాతావరణాన్ని మరింతగా వేడెక్కించింది. ఇటీవలే తాను చేసిన రెండు నియామకాలే లక్ష్యంగానే ఈ నోటీసులు అని ఉష వాపోయింది. 'మనం ఐక్యంగా పని చేయలేక పోతుండడం బాధ కలిగిస్తోంది. నన్ను పక్కనపెట్టే విధంగా మీ చర్యలుంటున్నాయ'ని ఈసీ సభ్యులకు ఉష చెప్పింది.

హాకీ కోర్ గ్రూప్‌లో జ్యోతి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): టీమిండియా సీనియర్ మహిళల హాకీ కోర్ ప్రాబబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి ఈదుల జ్యోతి రెడ్డి చోటు దక్కించుకుంది. సోమవారం హాకీ ఇండియా ప్రకటించిన 33మంది సభ్యులతో కూడిన కోర్ గ్రూప్‌లో మిడ్ ఫీల్డర్‌గా 21 ఏళ్ల జ్యోతి ఎంపికైంది. వచ్చే నెలలో జరిగే ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌కు ఈ కోర్ గ్రూప్ నుంచే తుది జట్టును ఎంపిక చేస్తారు.

హంపికి షాక్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో కోనేరు హంపికి బల్గేరియా జీఎం సాలిమోవా నుర్గ్యుల్ షాకిచ్చింది. నాలుగో రౌండ్‌లో నల్ల పావులతో బరిలోకి దిగిన హంపికి 62వ ఎత్తులో సాలిమోవా చెక్ చెప్పింది. దీంతో హంపి 3 నుంచి ఆరోస్థానానికి పడిపోయింది. గోరియాచ్కినా (రష్యా)తో తలపడిన వైశాలి 40 ఎత్తుల తర్వాత డ్రా చేసుకుంది. పురుషుల నాలుగో రౌండ్‌లో ప్రజ్ఞానంద, గుకేష్ డ్రాతో సరిపెట్టుకోగా, విదిత్ గుజరాతి ఓటమి పాలయ్యాడు. నకమురాతో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, ఫాబియానో (అమెరికా)తో పోరులో గుకేష్ డ్రాకు అంగీకరించాడు. నాలుగు రౌండ్లు ముగిసేసరికి గుకేష్ 3వ, ప్రజ్ఞానంద 4వ స్థానంలో ఉన్నారు.

బ్రూక్ స్థానంలో లిజాడ్



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్థానంలో దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్‌ను తీసుకున్నారు. లీగ్ ఆరంభానికి ముందే బ్రూక్ వ్యక్తిగత కారణాలతో వైదొలిగాడు. దీంతో లిజాడ్‌ను అతడి కనీస ధర రూ.50 లక్షలకే డీసీ జట్టులోకి తీసుకుంది. మొత్తంగా 83 టీ20ల్లో 103 వికెట్లు తీసిన లిజాడ్ గతేడాది వన్డే వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌పై ఓ మ్యాచ్ ఆడాడు. ప్రస్తుతం డీసీ జట్టు తానాడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో పట్టికలో చివరన కొనసాగుతోంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఉగాది శుభాకాంక్షలు

మంగళవారం | 9-4-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

తగలబెట్టేశారు

ఎన్నికల ముందు సీఐడీ ఘనకార్యం

తాడేపల్లి 'సిట్' ఆవరణలో కీలక పత్రాల దహనం

హెరిటేజ్ డాక్యుమెంట్ల ప్రతులుగా గుర్తింపు



సీఐడీ ప్రాంగణంలో పత్రాలను తగులబెడుతున్న దృశ్యం



నిప్పంటించిన పత్రాల్లో కనిపించిన హెరిటేజ్ కంపెనీ ఫైళ్లు

కేసు తప్పుదారి పట్టించేందుకే: టీడీపీ ఫైర్

ప్రింట్ సరిగాలేక కాల్చేశామన్న సీఐడీ

దానికీ రూల్స్ ఉంటాయని మరిచిన వైనం

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఓ కీలక కేసుకు సంబంధించిన పత్రాలను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)...తగలబెట్టేసింది. తాడేపల్లిలోని తమ కార్యాలయ ప్రాంగణంలోనే పలు డాక్యుమెంట్లను సిబ్బంది దహనం చేశారు. అవి ప్రతిపక్ష నేత చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ డాక్యుమెంట్లు కావడంతో కలకలం రేగింది. సంచిలో బండిల్స్‌గా తీసుకొచ్చిన డాక్యుమెంట్లకు సిట్ సిబ్బంది నిప్పు పెడుతుండగా స్థానికులు గమనించారు. ఏంటని అక్కడికెళ్లి చూడగా వాటిపై సీఐడీ అధికారిక ముద్ర, హెరిటేజ్ లోగో, చంద్రబాబుపై నమోదైన కేసు వివరాలు కనిపించడంతో వీడియో తీశారు. ఆ వీడియోలు వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. సిట్ అధిపతి కొల్లి రఘురామిరెడ్డి ఆదేశాల మేరకే సిబ్బంది కీలక డాక్యుమెంట్లు తగలబెట్టారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. చంద్రబాబు జీవిత భాగస్వామి

మిగతా 2వ పేజీలో...

స్టేట్ నుంచి కొల్లి 'ఔట్'

పోలీసు పరిశీలకుడిగా అసోంలో బాధ్యతలు

జగన్‌కు ఎన్నికల కమిషన్ మరో షాక్

వైసీపీకి 'అస్మదీయ' ఐపీఎస్‌గా రఘురామిరెడ్డి



సిట్ పేరుతో విపక్ష నేతలపై గురి

బాబును అరెస్టు చేసింది ఆయనే

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సారథిగా అపరిమిత అధికారాలు

ఔషధ నియంత్రణ విభాగంపైనా ఆధిపత్యం

మాట వినని అధికారులు, విపక్షాలపైనే గురి

ఎన్నికల వేళ మరిన్ని వేధింపులకు పథకం!?

ఆయనను తప్పించి గట్టి దెబ్బకొట్టిన ఈసీ

ఇది తెలిసే 'సిట్'లో పత్రాలు కాల్చేశారా?

2



పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు!

వారు ఏజెంట్లుగానూ ఉండొద్దన్న ఈసీ

దీంతో రాజీనామా చేయించి మరీ బాధ్యతలు

ఎన్నికల్లో జగన్ తాజా తంత్రం?

పింఛన్ల పంపిణీలో విఫలం

వలంటీర్లు లేనందునే అందలేదని ప్రచారం

నిజాలు బయటపడడంతో గప్‌చుప్

తాజాగా మరో వంకర వ్యూహం

వైసీపీ మరో వక్రమార్గాన్ని అనుసరించబోతోందా? ఎన్నికల కమిషన్ కాదని పక్కనబెట్టిన వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా నియమించాలని నిర్ణయించిందా? అసలు వలంటీర్లు పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోడానికి కూడా వీల్లేదని ఈసీ స్పష్టం చేసిన నేపథ్యంలో వారిని మరెలా రంగంలోకి దించుతోంది?

ప్రత్యేక కథనం 11లో..

అవును.. నేనింతే!

జగన్ అడ్డగోలు మాటలు.. వైసీపీ బరితెగింపు రాతలు.. ఈసీ హెచ్చరించినా బేఖాతర్

వైసీపీ సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్‌పై అనుచిత పోస్టులు.. తొలగించాలన్న ఈసీ

ధిక్కరిస్తూ మరింత రెచ్చిపోతున్న వైసీపీ.. ఈసీ తప్పుబట్టిన అంశాలపైనే మళ్లీ పోస్టులు

11

ముగిసిన టెన్త్ పేపర్ల మూల్యాంకనం

మే మొదటి వారంలో ఫలితాలు?!

2

జగన్‌వి హత్యా రాజకీయాలు

వివేకాను చంపిన అవినాశ్ రెడ్డికే మరోసారి ఎంపీ టికెట్ ఇచ్చారు

మావి నిందలు కావు.. వాస్తవాలు

సీబీఐ చెప్పినవే మేం చెబుతున్నాం

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా శాండ్, ల్యాండ్, లిక్కర్ మాఫియా

జగన్.. వైఎస్ వారసుడు కానేకాదు

నమ్మి నడిస్తే నడిరోడ్డున వదిలేశాడు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్

12



వివేకాను చంపి మమ్మల్ని

రోడ్డపాల్జేశారు

సీఎం జగన్‌పై సునీత ఫైర్

కడపలో షర్మిలను గెలిపించాలని పిలుపు



చిరంజీవికి పాదాభివందనం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, పక్కన నాగబాబు

11

నీ వెనుక నేనున్నా

పవన్‌కు అన్న చిరంజీవి అభయం

పార్టీ కోసం 5 కోట్ల విరాళం

మెగాస్టార్ ఆశీర్వాదం తీసుకున్న జనసేనాని

మెడికల్ రిపోర్టులను మేనేజ్ చేశారు!

వైఎస్ భాస్కర్‌రెడ్డికి మధ్యంతర బెయిల్‌పై సీబీఐ వాదనలు

ఆయనకు, ఉదయ్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇవ్వొద్దు.. వాళ్లు సాక్షులను ప్రభావితం చేస్తారు

అజేయ కల్లంలాంటి పెద్ద అధికారి కూడా ప్రభావానికి గురవుతున్నారు

అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి బెయిళ్లపై సునీతారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లారు

వాటిపై కౌంటర్లు దాఖలు చేస్తాం.. కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడి.. టీ-హైకోర్టు తీర్పు రిజర్వు

2

హవ్వ.. ఇంత అబద్ధమా?

పింఛన్ కింద నెలకు బాబు ఇచ్చింది 400 కోట్లేనట!

దర్శిలో జగన్ అబద్ధాలు.. నాడు నెలకు 1500 కోట్ల ఖర్చు

రూ.200లను ఒకేసారి 1000 చేసిన టీడీపీ ప్రభుత్వం

ఆ తర్వాత రూ.2000 చేసి.. కోతల్లేకుండా అమలు

11

స్టేట్ నుంచి కొల్లి 'ఔట్'

- పోలీసు పరిశీలకుడిగా అసోంలో విధులు
- జగన్‌కు ఎన్నికల కమిషన్ మరో షాక్
- వైసీపీకి 'అస్మదీయ' ఐపీఎస్‌గా రఘురామిరెడ్డి
- సిట్ పేరుతో విపక్ష నేతలపై గురి
- చంద్రబాబును అరెస్టు చేసింది ఆయనే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



సీఎం జగన్‌కి ఎన్నికల కమిషన్ మరో గట్టి 'షాక్' ఇచ్చింది. వైసీపీకి కళ్లూ చెవులుగా వ్యవహరిస్తూ, అపరిమిత అధికారాలతో విపక్షాలను లక్ష్యంగా చేసుకున్న ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డిని స్టేట్ నుంచి బయటికి పంపింది. ఆయనను అసోంలో ఎన్నికల పోలీసు అబ్జర్వర్‌గా నియమించింది. ఇప్పటికే ఆరుగురు 'అస్మదీయ' ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌లను ఈసీ పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా కొల్లిని రాష్ట్రం నుంచి దూరంగా.. ఈశాన్య రాష్ట్రానికి పంపించేయడం గమనార్హం. సోమవారం సాయంత్రం ఈ ఆదేశా లు వెలువడ్డాయి. అదే రోజు ఉదయం కొల్లి రఘురామిరెడ్డి అధిపతిగా ఉన్న 'సిట్' కార్యాలయంలో కీలక పత్రాలను తగలబెట్టడం గమనార్హం. తనను రాష్ట్రం నుంచి బయటికి పం పించనున్నారని ముందే తెలిసిందా? తాను ఇక్కడ లేని స మయంలో ఏం జరుగుతుందోననే ఆందోళనతో 'ముందు జాగ్రత్త'గా ఆయా పత్రాలను దహనం చేయించారా?

అన్నీ ఆయనే...

గత ఎన్నికల దాకా ఎన్నికల్లో సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు మాత్రమే ఉండేవారు. ఈ ఎన్నికల్లో 'పోలీసు అబ్జర్వర్'ను కూడా నియమిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు అధికారులను ఇతర రాష్ట్రాలకు పరిశీలకులుగా పంపించారు. కొల్లి రఘురామిరెడ్డిని అసోంలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలీసు పరిశీలకుడిగా నియమించారు. ఆయన.. గువాహటి కేంద్రంగా ఉండి విధులు నిర్వహిస్తారు. జగన్ అధికారంలోకి రాగానే రఘురామిరెడ్డిని తన 'అంతరంగిక' అధికారుల్లో ఒకరిగా నియమించుకున్నారు. రాజధాని భూములపై వేసిన 'సిట్'కు ఆయనే అధిపతి. 'స్కిల్' కేసులో చంద్రబాబును అరెస్టు చేసిన అధికారి ఈయనే. ఇక.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా కొల్లి చేతుల్లోనే ఉంది. ఆ హోదాలో తాము చెప్పినట్లు వినని అధికారులపై కొల్లి గురి పెట్టారనే ఆరోపణలున్నాయి. ఉన్న అధికారాలు చాలవని... ఆయనను ఔషధ నియంత్రణ మండలి డీజీగా కూడా నియమించారు. ఇటీవల టీడీపీ నేత, మాజీ మంత్రి పి.నారాయణ కళాశాల, నివాసంపై ఆ హోదాలోనే సోదాలు జరిపించారు. ఎన్నికల వేళ కొల్లి ద్వారా అటు తమ మాట వినని అధికారులు, ఇటు విపక్షాలను మరింతగా వేధించేందుకు జగన్ భారీ ప్రణాళిక రచించారనే ఆరోపణలున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో జగన్‌కు ఈసీ గట్టి దెబ్బ కొట్టింది.

తగలబెట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

భువనేశ్వరి, కోడలు బ్రహ్మణికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్లు కూడా తగలబెట్టిన వాటిలో ఉండటంతో టీడీపీ నేతలు మండిపడ్డారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికే కొల్లి రఘురామి రెడ్డి ఇలా చేయించారనే ఆరోపణలు వెల్లివెత్తుతున్నాయి. అయితే అవన్నీ ప్రింట్, జిరాక్స్ సరిగా రాని పేపర్లేనని, కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు న్యాయస్థానం పరిధిలో ఉంటాయని సీఐడీ వివరణ ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపులకు దిగింది. రాయలసీమలో జేసీ కుటుంబం, నెల్లూరులో నారాయణ, పల్నాడులో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, గుంటూరులో ధూళిపాళ్ల నరేంద్ర, విజయవాడలో దేవినేని ఉమ, బందరులో కొల్లు రవీంద్ర, ఏలూరులో చింతమనేని ప్రభాకర్, రాజమండ్రిలో ఆదిరెడ్డి వాసు, విశాఖపట్నంలో అయ్యన్నపాత్రుడు, శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు....ఇలా వరుసబెట్టి కేసులతో వేధించింది. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసే క్రమంలో అక్కడ అవినీతి జరిగిందంటూ జగన్ ప్రభుత్వం చంద్రబాబును టార్గెట్ చేసింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణా రెడ్డితో 2022 ఏప్రిల్ 27న సీఐడీకి చంద్రబాబుపై ఫిర్యాదు చేయించారు. ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసి టీడీపీ అధినేతను ఎలాగైనా జైలుకు పంపాలన్న లక్ష్యంతో ఆ బాధ్యతను సీఐడీకి జగన్ అప్పగించారు. తాను చెప్పినట్లు చేసే అనుంగు అధికారి కొల్లి రఘురామి రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేశారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు మలుపులు తిరగడంలో హెరిటేజ్ సంస్థకు లబ్ధి చేకూరిందని అభియోగం మోపారు. అసలు ఆ రోడ్డే వేయలేదని, అందు కోసం నిధులు ఖర్చు చేయలేదని బాధితులు వివరణ ఇచ్చినా ససేమిరా అంటూ, జగన్ కళ్లల్లో ఆనందం కోసం కొల్లి రఘురామి రెడ్డి మొండిగా ముందుకెళ్లారు. ఆళ్ల రామకృష్ణా రెడ్డి ఫిర్యాదు ఆధారంగా 2022 మే 9న మంగళగిరి సీఐడీ కార్యాలయంలో 15/2022 నంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా చంద్రబాబు కుటుంబసభ్యులకు సంబంధించిన ఆదాయపు పన్ను డాక్యుమెంట్లతోపాటు కుటుంబ వ్యాపారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు సిట్ స్వాధీనం చేసుకుంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను విచారణకు పిలిచి సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ సమయంలోనే డాక్యుమెంట్ల విషయం వెలుగులోకి వచ్చింది. రాజకీయాలతో సంబంధంలేని తన తల్లి భువనేశ్వరి, భార్య బ్రహ్మణికి సంబంధించిన ఆదాయ పన్ను వివరాలు ఇతరత్రా డాక్యుమెంట్లు ఎలా సేకరిస్తారంటూ సిట్ అధికారులను ఆయన అడిగినా స్పందన లేదు. అవే డాక్యుమెంట్లను తాడేపల్లి పాతూరు రోడ్డులోని సంవృద్ధి నెక్సా అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఉన్న సిట్ కార్యాలయం వెనుక భాగంలో సోమవారం ఉదయం పదిగంటల ప్రాంతంలో సిబ్బంది తగలబెట్టారు. దానిని గుర్తించిన స్థానికులు...సిబ్బందిని ప్రశ్నించడంతో తమ బాస్(కొల్లి రఘురామి రెడ్డి)ఆదేశాల మేరకు దహనం చేస్తున్నట్లు చెప్పారు. ఆ డాక్యుమెంట్లపై హెరిటేజ్ లోగో, చంద్రబాబు పేరు ఉండటంతో సెల్‌ఫోన్లో ఆ తతంగాన్ని చిత్రీకరించి టీడీపీ కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మంచౌదరికి పంపారు. సమీపంలోనే ఉన్న అయన వెంటనే అక్కడికి వచ్చి సీఐడీ తీరును తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎలాంటి అనుమతి తీసుకోకుండా హై ప్రొఫైల్ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు తగలబెట్టడం వివాదాస్పదం అయింది. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందన్న సంకేతాలతో కేసును తప్పుదారి పట్టించేందుకు డాక్యుమెంట్లు కాల్చేస్తున్నారని టీడీపీ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే జైలుకు వెళ్లడం ఖాయమనే భయంతోనే కొందరు అధికారులు ఇలాంటి వాటికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించింది.



సీఐడీ కార్యాలయంలో తగులబెట్టిన వాటిలో ఉన్న హెరిటేజ్ కంపెనీ పత్రాలు



అవును... మేమే తగలబెట్టాం: కొల్లి రఘురామి రెడ్డి

మంటల వీడియోలు, టీడీపీ ఆరోపణలతో ఉలిక్కిపడ్డ కొల్లి రఘురామి రెడ్డి, 'అవును...మేమే తగల బెట్టా'మని ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సరైన సాక్ష్యాధారాల కోసం లక్షలాది ఫొటోస్టాట్ కాపీలు తీస్తుంటామని, ఈ క్రమంలో జిరాక్స్ మిషన్లు వేడెక్కి మధ్యలో ఆగిపోవడం, పేపర్లు లోపల చిక్కుకు పోవడం, ఇంకు తగ్గి ప్రింట్ కాపీ నాణ్యత తగ్గి పోవడం జరుగుతుందని వివరించారు. తాజాగా తగలబెట్టినవన్నీ జిరాక్స్ సరిగా రాని పేపర్లని, అసలు డాక్యుమెంట్లు కోర్టుకు సమర్పించామని వివరణ ఇచ్చారు. ఇన్నర్ రింగ్ రోడ్ సహా ఐదు కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేశామని, ప్రతి కేసులోనూ 8వేల నుంచి పది వేల వరకూ కాపీలతో అభియోగ పత్రం తయారు చేశామన్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యుల ఐటీ రిటర్న్లు చట్టబద్ధంగానే తీసుకున్నామని, ఆ విషయాన్ని వారికి కూడా చెప్పామని వివరించారు.

రూల్స్ ఇలా....

కేంద్ర ప్రభుత్వ 'పబ్లిక్ రికార్డ్స్ యాక్ట్ 1993'తోపాటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ రికార్డ్స్ అండ్ ఆర్చివ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ 2003 ప్రకారం....ఏ పబ్లిక్ రికార్డులను అయినా... వాటిని భద్రపరిచేఅధికారితో సమీక్షించి రికార్డు చేసిన తర్వాతే ధ్వంసం చేయాలి. ఏటా జనవరిలో రికార్డ్స్ భద్రపరిచే ఆఫీసర్‌ను సంప్రదించిన తర్వాతే నాశనం చేయాలి. ధ్వంసం చేయడానికి ప్రతిపాదించిన అన్ని డాక్యుమెంట్లను సంబంధిత అధికారి అంచనా వేయకపోతే దహనం చేయరాదు. ఏ రికార్డులు నాశనం చేశామో భవిష్యత్తులో తెలియజేసేలా ఇండెక్స్ రాసిపెట్టి దాన్ని శాశ్వతంగా భద్ర పరచాలి. నిర్ణీత ఫారమ్‌లో రికార్డుల అధికారితో నమోదు చేయించి సంతకం తీసుకున్న తర్వాతే ముక్కలు చేయడం లేదా తగలబెట్టడం చేయాలి. ఇలా చేయకుండా ధ్వంసం చేస్తే అవసరానికి తిరిగి వాటిని పొందడం అసాధ్యమని కేంద్ర, రాష్ట్ర చట్టాల రూల్స్ స్పష్టం చేస్తున్నాయి.

మేం మీకిచ్చిన పత్రాలన్నీ భద్రమేనా?

- సీఐడీ విభాగానికి హెరిటేజ్ సంస్థ లేఖ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేసు విచారణలో భాగంగా తాము సీఐడీ విభాగానికి సమర్పించిన పత్రాలు భద్రంగా ఉన్నాయా లేదా అని హెరిటేజ్ సంస్థ ఆరా తీసింది. హెరిటేజ్‌కు సంబంధించిన కొన్ని పత్రాలను సీఐడీ సిబ్బంది ఇక్కడి తాడేపల్లిలోని సిట్ కార్యాలయం వద్ద సోమవారం తగలబెట్టారని టీవీ చానళ్లలో వార్తలు రావడంతో ఆ సంస్థ.. సీఐడీ అదనపు ఎస్పీకి ఒక లేఖ రాసింది. ఆ సంస్థ తరపున కంపెనీ సెక్రటరీ ఉమాకంత బారిక్ ఈ లేఖ రాశారు. 'మేం మా కంపెనీకి సంబంధించిన అసలు ప్రతులను, బోర్డు తీర్మానాలను నమోదు చేసే మినిట్స్ పుస్తకాలను మీకు అందచేశాం. దర్యాప్తు నివిత్తం కావాలని మీరడగడంతో మీకు పంపాం. వీటి భద్రత మాకు ముఖ్యం. మేం ఈ రోజు కొన్ని టీవీ చానళ్లలో.. హెరిటేజ్‌కు చెందిన పత్రాలు దహనం అవుతున్న దృశ్యాలు చూశాం. నిబంధనల ప్రకారం కంపెనీకి సంబంధించిన కొన్ని పత్రాలను మేం తప్పనిసరిగా భద్రపర్చాల్సి ఉంటుంది. టీవీలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు, దృశ్యాలు ఈ పత్రాల భద్రతపై మాకు చాలా కలవరం కలిగించాయి. సీఐడీ విభాగానికి మేం సమర్పించిన పత్రాలు భద్రంగా ఉంటాయని విశ్వసిస్తూ వచ్చాం. తాజా పరిణామాల నేపథ్యంలో మేం మీకు అందచేసిన పత్రాల స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని మాకు అందచేయాలని కోరుతున్నాం. ఈ పత్రాలు, వాటి దహనానికి సంబంధించి ఏం జరిగిందో మీ నుంచి నిర్దిష్ట వివరణ కూడా కోరుతున్నాం. కేసుల పరిశోధన, న్యాయ విచారణలో పారదర్శకత చాలా ముఖ్యం. కంపెనీ నిర్వహణలో ఈ రికార్డులను మేం అనేక ఏజెన్సీలకు అవసరం అయినప్పుడు అందచేయాల్సి ఉంటుంది. వాటిని భద్రపర్చాల్సి ఉంటుంది. మీ విచారణకు మా నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మీరు కూడా ఈ విషయం లో మాకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని కోరుతు న్నాం'' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

టాప్ ట్రెండింగ్‌లో ఫైళ్ల దహనం

తాడేపల్లిలో ఫైళ్ళ దహనం వ్యవహారం ఎక్స్ వేదికలో ట్రెండింగ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. 'ఫేక్ డాక్యుమెంట్లను జగన్ నాశనం చేస్తున్నాడు' అనే హ్యాష్ ట్యాగ్‌తో ఈ అంశంలో సోమవారం ట్రెండింగ్‌లో టాప్‌లోకి దూసుకొని వెళ్లింది. సీఐడీ తీరుకు నిరసనగా నెటిజన్లు వేలసంఖ్యలో ట్వీట్లు చేశారు. జగన్ తప్పుడు కేసులతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడ్డారని, అవి బయటపడకుండా ఇప్పుడు ఆధారాలను ధ్వంసం చేస్తున్నాడని వారు తమ ట్వీట్లలో ఆరోపించారు.



నేడు, రేపు ఉత్తరాంధ్రలో వడగాడ్పులు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా నుంచి అంతర్గత రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించిన ద్రోణి కారణంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు కాస్త తగ్గాయి. అయితే నంద్యాల జిల్లా గోస్పాడులో 44.4, కడప జిల్లా వెడురూరులో 44.3, కర్నూలు జిల్లా వగరూరులో 43.8, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 43.2, అన్నమయ్య జిల్లా సానిపాయలో 43.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అన్నమయ్య జిల్లా పెద తిప్పసముద్రం మండలంలో తీవ్ర వడగాల్పులు వీయగా, రాష్ట్ర వ్యాప్తంగా 36 మండలాల్లో ఓ మోస్తరు వడగాలులు వీచాయి. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 39 మండలాల్లో వడగాల్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అలాగే మంగళ, బుధవారాల్లో ఉత్తరకోస్తాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుగులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఉత్తరాంధ్రతో పాటు దక్షిణకోస్తా, రాయలసీమలో వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడ వచ్చని తెలిపింది.

రేపు, ఎల్లుండి వర్షసూచన

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తా నుంచి రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీనికితోడు కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో వాతావరణంలో అనిశ్చితి నెలకొంది. ఈ రెండింటి ప్రభావంతో సోమవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల మేఘాలు ఆవరించాయి. అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల జల్లులు కురుస్తాయని, గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా సోమవారం రాష్ట్రంలో అనేకచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. నంద్యాలలో గరిష్ఠంగా 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

తిరుపతి ఉప ఎన్నికలో అక్రమాలు..

గిరీశపై సస్పెన్షన్ ఎత్తివేత

- విచారణను పెండింగ్‌లో పెట్టిన ఈసీ
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా లక్ష్మీశ
- ఈసీ తొలగించిన కలెక్టర్లకు పోస్టింగులు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి గిరీశపై ఉన్న సస్పెన్షన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఎత్తివేసింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో దొంగ ఓటు కార్డులు సృష్టించడం, ఎలక్టొరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో) లాగిన్ నుంచి వాటిని డౌన్‌లోడ్ చేయడం వంటి అవకతవకలపై ఈ ఏడాది జనవరిలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా ఉన్న గిరీశను సస్పెండ్ చేసి జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. 2021లో ఉప ఎన్నిక జరిగినప్పుడు ఆయన రిటర్నింగ్ అధికారి(తిరుపతి కార్పొరేషన్ కమిషనర్)గా ఉన్నారు. మూడు నెలల తర్వాత ఈసీ ఈ వ్యవహారంపై సమీక్ష జరిపింది. దొంగ ఓటర్ కార్డులను ఈఆర్వో చంద్రమౌళీశ్వర్‌రెడ్డే డౌన్‌లోడ్ చేశారని గుర్తించింది. దీంతో గిరీశపై సస్పెన్షన్ ఎత్తివేసింది. కానీ విచారణను పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయ్యేవరకు ఆయన్ను ఎన్నికల విధుల్లో నియమించే అవకాశం లేదు. అందుకే ఆయనకు ఎన్నికల విధులు అప్పగించకుండా, ఇతర శాఖల్లో పోస్టింగ్ ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వాన్ని కమిషన్ ఆదేశించింది. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీగా ఓటర్ కార్డుల స్కామ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు పోలీసు, రెవెన్యూ, ఎన్నికల సంఘం సహా అన్ని వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ఈ అక్రమానికి తెరదీశారు. దీనికి సంబంధించి గిరీశ, ఈఆర్వో చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎంఆర్వో, డిప్యూటీ తహసీల్దార్, ముగ్గురు డీఈవోలు, కొంత మంది పోలీసు అధికారులు సస్పెండయ్యారు.

ఆ ముగ్గురికీ పోస్టింగులు..

ఈసీ ఇటీవల తొలగించిన ముగ్గురు మాజీ కలెక్టర్లు లక్ష్మీశ(తిరుపతి), పి.రాజాబాబు(కృష్ణా), ఎం.గౌతమి(అనంతపురం)లకు రాష్ట్రప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. లక్ష్మీశను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా.. రాజాబాబును నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీగా.. గౌతమిని టీటీడీ జేఈవోగా నియమించింది. కాగా.. మరికొందరు ఐఏఎస్‌లకు వివిధ బాధ్యతలు అప్పగించింది. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న బీఆర్ అంబేడ్కర్‌ను మిడ్ డే మీల్స్, స్కూల్ శానిటేషన్ డైరెక్టర్‌గా నియమించింది. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ కె.వెంకటరమణారెడ్డికి పౌరసరఫరాల సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన ఇప్పటి వరకూ సీసీఎల్ఏలో అదనపు సీసీఎల్ఏ, సెక్రటరీ టూ సీసీఎల్ఏగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీసీఎల్ఏలోని ఈ అదనపు బాధ్యతలను ఇప్పుడు అక్కడే జాయింట్ సెక్రటరీగా ఉన్న ఎన్.ప్రభాకర్‌రెడ్డికి అప్పగించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. గిరీశకు కూడా రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మే మొదటి వారంలో టెన్త్ ఫలితాలు?!

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం సోమవారంతో ముగిసింది. మొత్తం 26 కేంద్రాల్లో మూల్యాంకనం జరిగిందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల విడుదల ప్రక్రియకు కనీసం 12 రోజులకు పైగా సమయం అవసరం అవుతుందని పాఠశాల విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. దాదాపుగా మే తొలివారంలో ఫలితాలు విడుదల కావొచ్చని అంటున్నాయి.

పత్రాల కాల్చివేతపై సమగ్ర విచారణ జరపాలి: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో పత్రాలు తగులబెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ... 'హెరిటేజ్ సంస్థకు సంబంధించిన కీలక పత్రాలను దగ్ధం చేయడం వెనుక ఆంతర్యమేమిటి? జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న సీఐడీ... ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించడం, బెదిరింపులకు గురిచేయడంలో కీలకపాత్ర పోషించింది. ఈ సార్వత్రిక ఎన్నికల తర్వాత నూతన ప్రభుత్వం ఏర్పడితే సీఐడీ అక్రమాలు వెలుగులోకి వస్తాయనే కీలక పత్రాలను దగ్ధం చేశారా? అనే అనుమానం కలుగుతోంది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మాదిరిగా ఏపీలో సిట్ అక్రమ కేసుల వ్యవహారం ఉంది' అని రామకృష్ణ వ్యాఖ్యానించారు.

మెడికల్ రిపోర్టులు మేనేజ్ చేశారు!

- వైఎస్ భాస్కర్‌రెడ్డికి మధ్యంతర బెయిల్‌పై సీబీఐ వాదనలు
- ఆయనకు, ఉదయ్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇవ్వొద్దు
- అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి బెయిళ్లపై సునీతారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లారు
- వాటిపై కౌంటర్లు దాఖలు చేస్తాం
- కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడి




హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ-7)కి మధ్యంతర బెయిల్ వచ్చేందుకు మెడికల్ రిపోర్టులను మేనేజ్ చేశారని సీబీఐ పేర్కొంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న వైఎస్ అవినాశ్‌రెడ్డి(ఏ-8)కి ముందస్తు బెయిల్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ-5)కి రెగ్యులర్ బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని.. వాటిలోనే తాము కౌంటర్లు దాఖలు చేస్తున్నామని.. ప్రత్యేకంగా పిటిషన్లు వేయడం లేదని తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. వివేకా హత్య కేసులో నిందితులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్లపై సోమవారం జస్టిస్ కె.లక్ష్మణ్ సారథ్యంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున న్యాయవాదులు అనిల్ తన్వర్, జగదీశ్ వాదనలు వినిపించారు. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిల బెయిల్ పిటిషన్లను గతంలో ఇదే కోర్టు తిరస్కరించిందని తెలిపారు. కోర్టులో ట్రయల్ ప్రారంభమయ్యే వరకు వారికి బెయిల్ ఇవ్వవద్దని.. ఇస్తే విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. భాస్కర్‌రెడ్డికి మెడికల్ గ్రౌండ్‌పై సీబీఐ కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిందని.. దాని ఆధారంగా రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని పిటిషనర్లు కోరడం సమంజసం కాదని.. మధ్యంతర బెయిల్‌కు, రెగ్యులర్ బెయిల్‌కు సంబంధం లేదని పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి మెడికల్ రిపోర్టులను మేనేజ్ చేయడం ద్వారా మధ్యంతర బెయిల్ పొందారని తెలిపారు. 'నిందితులు రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తులైనందున అదే ప్రాంతానికి చెందిన సాక్షులు ప్రభావితమవుతారు. శివశంకర్‌రెడ్డికి బెయిల్ వచ్చింది కాబట్టి తమకు కూడా బెయిల్ ఇవ్వాలని కోరడం సరికాదు. శివశంకర్‌రెడ్డికి, భాస్కర్‌రెడ్డికి పోలికే లేదు. శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిల చేతిలో కీలుబొమ్మ' అని వ్యాఖ్యానించారు. వివేకా హత్య వెనుక విస్తృత కుట్రను బయటకు తేవడానికే దస్తగిరికి క్షమాభిక్ష లభించిందన్నారు. 'దస్తగిరి ఏపీ ప్రభుత్వంతో పోరాడుతున్నాడు.. అత డు అప్రూవర్‌గా మారిన తర్వాత అక్కడ అతడిపై చాలా కేసులు పెట్టారు. దస్తగిరి ప్రాణాలకు ముప్పు ఉంది కాబట్టే భద్రత కల్పించాం. అతడి కుటుంబ సభ్యులకు సైతం ప్రమాదం ఉంది. సాక్షులను ప్రభావితం చేసేలా ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ఉదయ్‌రెడ్డి సమయం కాని సమయంలో చాలా క్రియాశీలం గా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. హత్యకు ముందురోజు అవినాశ్‌రెడ్డి ఇంట్లోనే ఉన్నాడు. హత్య గురించి ఉదయ్‌రెడ్డికి తెల్లవారుజాము 3 గంటలకే తెలుసు. అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులతో కాంటాక్టులో ఉన్నాడు. హత్య కుట్రలో భాగస్వామి కాబట్టే ఉద్యోగానికి ప్రణాళిక ప్రకారం సెలవు పెట్టాడు. ఆధారాల చెరిపివేతలో కీలకంగా వ్యవహరించాడు. దస్తగిరి ఇచ్చిన సాక్ష్యం విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా అతడికి ఇచ్చిన క్షమాభిక్షపై భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. పెద్ద అధికారిగా పనిచేసిన అజేయ కల్లం లాంటి వ్యక్తులు సైతం నిందితుల ప్రభావానికి గురవుతున్నారు' అని సీబీఐ న్యాయవాదులు తెలిపారు.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

- సీబీఐ సహా ప్రతివాదులందరికీ జారీ
- బెయిల్ రద్దు కోసం సునీత పిటిషన్‌పై ఆదేశం
- తదుపరి విచారణ జూలై 22కి వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఆయనకు ఇటీవలే తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా.. ఆ తీర్పును సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేసు ఏ దశలో ఉందని జస్టిస్ ఖన్నా ప్రశ్నించారు. నేటికీ అభియోగాల నమోదు దశలోనే ఉందని సునీత తరఫు న్యాయవాది జేసల్ వహీ తెలిపారు. ట్రయల్ ముందుకు సాగకుండా నిందితులు ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తున్నారని, అందుకే బెయిల్ రద్దు చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు. 'ఏ-5 బెయిల్ రద్దు చేయాలని కోరుతున్నారు కదా? మరి ఇతర నిందితులూ బెయిల్ పొందారా' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఏ-1 (ఎర్రగంగిరెడ్డి)కి బెయిల్ వచ్చిందని, దీనిపై కూడా ఇటీవలే సుప్రీం కోర్టు స్టే ఇచ్చిందని న్యాయవాది తెలిపారు. ఇదే కేసులో మరికొన్ని పిటిషన్లకు సంబంధించి ఈ నెల మూడోవారంలో ఇదే బెంచ్ ముందు విచారణ ఉందని గుర్తుచేశారు. అదేవిధంగా.. ఏ-8 (వైఎస్ అవినాశ్‌రెడ్డి) ముందస్తు బెయిల్ పొందారని, దీనినీ సుప్రీంకోర్టులో సవాల్ చేశామని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై జూలై 22న విచారిస్తామని కోర్టు తెలిపింది. ఆయనకు నోటీసులు జారీచేస్తూ అప్పటిలోపు సమాధానం చెప్పాలని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ప్రతివాదులందరికీ నోటీసులు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సీబీఐని కూడా సునీత ప్రతివాదిగా చేర్చారు. వివేకా హత్య కేసులో 2021 సెప్టెంబరు 17న శివశంకర్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేసింది. తెలంగాణ హైకోర్టు గత నెల 11న ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కేసు విచారణ జరుగుతున్నంత వరకు ఏపీకి వెళ్లకూడదని, ప్రతి వారం హైదరాబాద్ సీసీఎస్‌లో రిపోర్టు చేయాలని షరతులు విధించింది.

వారికి బెయిల్ ఇవ్వొద్దు: సునీతారెడ్డి



సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నళినీకుమార్ వాదనలు వినిపించారు. భాస్కర్‌రెడ్డి బెయిల్ గతంలో తిరస్కారానికి గురైందని.. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని.. వారికి బెయిల్ ఇస్తే సాక్షులు తీవ్రంగా ప్రభావితమవుతారని తెలిపారు. 'విస్తృత కుట్ర, హత్య అమలు, ఆధారాల చెరిపివేతకు సంబంధించి నిందితుల పాత్రపై ఆధారాలు ఉన్నట్లు గతంలో ఇదే హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. శివశంకర్ రెడ్డి కొడుకు చైతన్యరెడ్డి ఏకంగా జైలుకు వెళ్లి దస్తగిరికి రూ.20 కోట్లు ఇవ్వజూపారు. వాళ్ల రాజకీయ పలుకుబడి అందరికీ తెలిసిందే. ప్రస్తుత ఏపీ సీఎం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ హత్య కేసును సీబీఐకి ఇవ్వాలని ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపసంహరించుకున్నారు. కీలక సాక్షి గంగాధర్‌రెడ్డి అనుమానాస్పద మృతి.. సీఐ శంకరయ్య మేజిస్ట్రేట్ ఎదుట స్టేట్‌మెంట్ ఇవ్వడానికి అంగీకరించకపోవడం.. ఆ తర్వాత శంకరయ్యపై సస్పెన్షన్ ఎత్తివేత వంటి అంశాలను గమనంలోకి తీసుకోవాలి.. నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత విచారణ జరగాలంటే నిందితులకు బెయిల్ ఇవ్వవద్దు' అని కోరారు. మెడికల్ రిపోర్ట్‌లను మేనేజ్ చేశారనడంపై ఉదయ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ డాక్టర్ల బోర్డును, సీబీఐ కోర్టు జడ్జిని తప్పుపడతారా అని ప్రశ్నించారు. 'కిరాయి హంతకుడి(దస్తగిరి)కి జడ్ ప్లస్ భద్రత కల్పిస్తున్నారు. విమానాల్లో తిరుగుతున్నాడు.. విమానం టికెట్లు సీబీఐ ఇస్తోందా? ఎస్కార్ట్ వెహికిల్‌లో జిల్లా పర్యటనకు వెళ్తున్నాడు. రూ.5 కోట్లు తీసుకుని హత్య చేసినవాడు.. రూ.10 కోట్లు తీసుకుని అబద్ధం చెప్పలేడా' అని ప్రశ్నించారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'డ్రైవర్ కాస్తా పాపులర్ అయ్యాడా' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. అన్ని పక్షాల వాదనలు విన్నాక.. రెండు బెయిల్ పిటిషన్లపై తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.



సీఈవో మీనాకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

తప్పు కప్పిపుచ్చుకోవడానికే తగలబెట్టారు

- ఓటమి భయంతోనే టీడీపీ కార్యాలయానికి నిప్పు
- సీఈవో మీనాకు వర్ల, దేవినేని ఉమా ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సిట్ కార్యాలయంలో హెరిటేజ్‌కు సంబంధించిన కీలక పత్రాలు దగ్ధం చేయడం, క్రోసూరు టీడీపీ కార్యాలయానికి నిప్పంటించడం వంటి వ్యవహారాలపై ఆ పార్టీ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేసింది. తప్పులు చేశారు కాబట్టే చంద్రబాబు, లోకేశ్ కేసులకు సంబంధించిన కీలక పత్రాలు సిట్ చీఫ్ తగలబెట్టారని, ఇటువంటి పని ఎందుకు చేశారో సిట్ అధిపతి కొల్లి రఘురామిరెడ్డి సమాధానం చెప్పాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఓటమి భయంతోనే క్రోసూరులో టీడీపీ కార్యాలయానికి నిప్పంటించారని నిందితులను పట్టుకొని తెర వెనుక కుట్రదారులను బయటకు తీయాలని కోరింది. సోమవారం అమరావతి సచివాలయంలో సీఈవో మీనాకు ఫిర్యాదు చేసిన అనంతరం టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో విచిత్ర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే ప్రజల మీద రుబాబు చేస్తున్నారు. తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును అన్యాయంగా జైలుకు పంపించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు వంటి కొన్ని కేసుల్లో మా యువనేత లోకేశ్‌ను విచారణ చేశారు. హెరిటేజ్ సంస్థకు భువనేశ్వరి, బ్రహ్మణీలకు సంబంధించిన గోప్యత పత్రాలు, ఐటీ వ్యవహారాల పత్రాలు కావాలంటే సమర్పించారు. నాడు సమర్పించిన పత్రాలను నేడు తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో తగలబెట్టారు. చంద్రబాబు, లోకేశ్‌లపై తప్పుడు కేసులు పెట్టారు కాబట్టే ఆ కేసులకు సంబంధించిన కీలక పత్రాలను తగలపెట్టారు. తెలంగాణలో ఫైల్స్ మాయం చేసినట్లే ఇక్కడ ఆధారాలను చెరిపేయాలని సిట్ అధిపతి కుట్రపన్నారు. మన రాష్ట్రంలో పోలీసులను ప్రజలు అనుమానిస్తున్న తరుణంలో ఇటువంటి పని ఎందుకు చేశారో సిట్ అధికారి రఘురామిరెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి. ఏ కేసుకు సంబంధించిన పత్రాలైనా బయటికి రాకుండా, వాటిని తగలబెట్టకుండా ఉండే విధంగా సీఎస్‌కు ఆదేశాలు ఇవ్వాలని సీఈవోకు విజ్ఞప్తి చేశాం' అని వర్ల వివరించారు. దేవినేని ఉమ మాట్లాడుతూ.. 'ఎన్ని ప్రయోగాలు చేసిన జగన్‌రెడ్డి గెలవడని అతని తలరాతే చెబుతుంది. క్రోసూరు ప్రజాగళం సభకు మేం ఊహించినదానికంటే అధికంగా జనాలు వచ్చారు. దీనికి ఓర్చుకోలేకే మా పార్టీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. అనుమానితులు ఎవరూ లేరని ఎఫ్ఐఆర్‌లో రాశారు. మా దగ్గరున్న సీసీ ఫుటేజ్‌ను ఇంత వరకు ఏ అధికారీ తీసుకోలేదు. ఇదేమి పోలీసు వ్యవస్థ? దర్యాప్తు తీరు ఇదేనా డీజీపీ గారు? రాష్ట్ర సచివాలయంలో వైసీపీ దొంగలున్నారు. ఇదే విధంగా కీలక ఫైళ్లను తగలబెడతారు' అని ఉమా విమర్శించారు.

ఓటమి భయంతోనే ఫైళ్లకు నిప్పు: పట్టాభి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామన్న విషయం తేటతెల్లం కావడంతో అధికార పక్షానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు ఫైళ్లు తగలబెట్టడం మొదలుపెట్టారని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'వివేకానందరెడ్డిని హత్య చేసిన తర్వాత రక్తం మరకలు తుడిచివేసి సాక్ష్యాలు మాయం చేసినట్లు ఇప్పుడు ఫేక్ డాక్యుమెంట్ల ఫైళ్లు కూడా తగలబెడుతున్నారు. చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, దేవినేని ఉమా వంటి టీడీపీ నేతలపై కేసులు పెట్టడానికి సీఐడీలోని కొందరు పోలీసు అధికారులు అనేక తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. తాము చేస్తున్న నిరాధార ఆరోపణలను సమర్థించుకోవడానికి సిట్ అధికారులు ఫేక్ పత్రాల సృష్టికర్తలుగా మారారు. ప్రభుత్వం మారితే ఫేక్ డాక్యుమెంట్లు బయటపడి, దొరికిపోతామన్న భయంతో అందులో కొన్ని పత్రాలను సిట్ కార్యాలయం వద్ద సోమవారం తగలబెట్టారు. కొల్లి రఘురామిరెడ్డి వంటి కొందరు అధికారులు అధికారంలో ఉన్నవారికి తొత్తులుగా మారి ఇటువంటి తప్పుడు పనులు చేస్తున్నారు. వీటిని తగలబెట్టడంపై అధికారుల వివరణ హాస్యాస్పదంగా ఉంది. కాని తగలబెట్టిన పత్రాలన్నీ స్పష్టమైన ప్రింట్‌తో ఉన్నాయి. కొన్ని ఫైళ్లకు వాటికి కట్టిన ట్యాగులు కూడా తీయకుండానే తగలబెట్టారు' అని పట్టాభి అన్నారు.


సోనోవిజన్ ఉగాది సేల్‌లో కొనుగోలు చేసి, క్రొత్త సంవత్సరం లాభదాయకంగా ప్రారంభించండి
తెలుగు వారి తొలి పండగ ఉగాది శుభాకాంక్షలతో...
HAPPY Ugadi
సోనోవిజన్
ఉగాది సేల్
అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్
Hot Summer Sale
FINSERV Upto 7500/- క్యాష్ బ్యాక్ 1EMI రిఫండ్ సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి
IDFC FIRST Bank Upto 5000/- క్యాష్ బ్యాక్ IDFC EMI ఫైనాన్స్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ కష్టమర్స్‌కు మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి
HDB FINANCIAL SERVICES 10% క్యాష్ బ్యాక్ HDB EMI ఫైనాన్స్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ కష్టమర్స్‌కు మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి
HDFC BANK 0/- డౌన్ పేమెంట్ 1EMI రిఫండ్ సెలెక్టెడ్ మోడల్స్‌పై, షరతులు వర్తిస్తాయి
Upto 15% క్యాష్ బ్యాక్ క్రెడిట్ కార్డ్ మరియు డెబిట్ కార్డ్ EMI కొనుగోలుపై, సెలెక్టెడ్ మోడల్స్‌పై
ICICI Bank SBI citibank one card YES BANK kotak HDFC BANK
అన్ని పెద్ద కంపెనీల నుండి ఎక్కువ కూలింగ్ కెపాసిటి, హై ఎనర్జీ ఎఫిషియన్సీ రేషియోతో 2024 లేటెస్ట్ మోడల్స్ A.C లు అత్యంత విస్తృతశ్రేణి
LG 5Star & 3Star Dual Inverter A.C Flexi EMI : 1999/-
LLOYD 5Star & 3Star Inverter A.C Starting EMI : 2875/-
DAIKIN 5Star & 3Star Inverter A.C Flexi EMI : 1999/-
VOLTAS 5Star & 3Star Inverter A.C Flexi EMI : 2888/-
HITACHI 5Star & 3Star DC Inverter A.C Flexi EMI : 2929/-
SAMSUNG 5Star & 3Star Digital Inverter A.C Flexi EMI : 1990/-
Haier 5Star & 3Star DC Inverter A.C Flexi EMI : 1994/-
BLUE STAR 5Star & 3Star Inverter A.C Flexi EMI : 2080/-
Carrier 5Star & 3Star Hybridjet Inverter A.C Flexi EMI : 2899/-
IFB 5Star & 3Star ECO Inverter A.C Flexi EMI : 1922/-
Conditions Apply
LG Side by Side 694 Litres Refrigerator EMI : 11750/-
SAMSUNG Side by Side 700 Litres Refrigerator EMI : 6416/-
Whirlpool Frost Free Double Door 260 Litres Refrigerator EMI : 1875/-
LG Frost Free Double Door 240 Litres Refrigerator Flexi EMI : 999/-
Haier 256 Litres BMR Refrigerator Flexi EMI : 994/-
Godrej Frost Free Double Door 233 Litres Refrigerator Flexi EMI : 2525/-
VOLTAS Air Cooler 72 Litres EMI : 767/-
BAJAJ Air Cooler 67 Litres EMI : 734/-
Crompton Air Cooler 55 Litres EMI : 667/-
orient electric Air Cooler 50 Litres EMI : 730/-
Symphony Jumbo Air Cooler 56 Litres EMI : 717/-
LG Front Load Automatic Washing Machine 11 KGS EMI : 4000/-
LG 208 Cm (86") 4K OLED Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") LED 4K Ultra UHD Flexi EMI : 3990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart Flexi EMI : 6500/-
Panasonic 108 Cm (43") LED 4K HD EMI : 2959/-
Haier 139 Cm (55") LED 4K HD Smart Flexi EMI : 1994/-
TCL 108 Cm (43") 4K Ultra LED EMI : 2273/-
iPhone15, iPhone15+ 6000/- Cash Back 18/0, 24/0, 30/0 Schemes Available SBI Credit Card & ICICI Credit Cards
iPhone 15Pro, 15 Pro Max 3000/- Cash Back 24/0, 30/0 Schemes, ICICI Bank Card No Cost EMI 24/0 Scheme Available
SAMSUNG S-23 Ultra Mobile 8000/- Cash Back HDFC Bank Card 24/0, 30/0 Scheme Available
vivo X-100 Series & X-100 PRO Series FREE Smart Calling Watch worth 4999/- boAt Upto 9000/- Instant Cash Back 7/1, 6/0 & 24/0 Schemes Available
oppo Reno - 11 & Reno - 11 Pro New Series FREE Smart Calling Watch worth 4999/- boAt 6/0, 7/0, 8/0, 10/2, 12/4 Schemes Available
mi Redmi 13 Pro+ 5G 2000/- Cash Back HDFC & SBI Credit Cards
realme 12 Pro+ 5G Selected Bank Cards 6/0, 10/2 & 12/4 Schemes Available
LAPTOPS 12/0,12/4, 15/4, 24/0 Schemes Available hp DELL ASUS Lenovo MacBook
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
మా నూతన షోరూంలు సందర్శించండి
విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎండలు–ఎన్నికలు

ఎండలు మండిపోతాయి జాగ్రత్త అంటూ భారతవాతావరణశాఖ గట్టిగా హెచ్చరించడం ఇటీవలి సంవత్సరాల్లో మరీ ఎక్కువైంది. పదేళ్ళుగా దేశంలో ఎండల తీవ్రత పెరిగిందట. ఐఎండీ హెచ్చరికలకంటే ముందుగానే సూర్యుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించడం మొదలెట్టేస్తున్నాడు. ఫిబ్రవరి చివర్లోనే వేడి తగలడం మొదలైపోతోంది. ఈ ఏడాది ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలను బట్టి రాబోయే రోజులు ఎలా ఉంటాయన్న భయం కలుగుతోంది. నీటి కొరతసహా వేసవి అనుభవం అప్పుడే పలు రీతుల్లో కనిపిస్తోంది.

గత ఏడాదికంటే ఈ వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని, మరిన్ని వడగాడ్పులు పడాల్సివస్తుందని ఐఎండీ అంటోంది. భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి, జలాశయాలు ఎండిపోతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మీదే కాక, వర్షపాతాన్ని ప్రమాదకరమైన స్థాయిలోకి తగ్గించే శక్తి ఎల్‌నినోకు ఉన్నది. గత ఏడాది రుతుపవనాల ప్రవేశంలో జాప్యం, ఓ మూడునెలలు వర్షాలు మెరుగ్గానే పడినా ఆ తరువాత వాటిజాడలేకుండా పోవడంతో నీటిసమస్యకు అప్పట్లోనే బీజాలుపడ్డాయి. రాబోయే కాలంలో వడగాడ్పులు సంఖ్యరీత్యా, విస్తృతి రీత్యా రెట్టింపవుతాయని ఐఎండీ అంటోంది. చెప్పినట్టుగానే తెలుగురాష్ట్రాలతో సహా దేశంలోని చాలా రాష్ట్రాలు గరిష్ఠ ఉష్ణోగ్రతలతో గడగడలాడిపోతున్నాయి. ఎండలు, వడగాడ్పులకు తోడుగా నీరు కూడా కరువైతే ప్రజలు అల్లాడిపోతారు, పశుపక్ష్యాదులు ప్రాణంవదిలేస్తాయి. ముంచుకొస్తున్న గడ్డుకాలాన్ని దాటడానికి ప్రభుత్వాలు ప్రతీ అడుగూ అతిజాగ్రత్తగా వేయాల్సి ఉంటుంది. నీటి వనరులను సమర్థంగా నిర్వహించడంతోపాటు, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఎండల్లో విధిగా పనిచేయాల్సి వచ్చే ఆయా రంగాల ప్రజలను దృష్టిలో పెట్టుకోవాలి. కార్మికుల శ్రేయస్సును ఖాతరుచేయని సంస్థలు, పరిశ్రమలు మనదగ్గర చాలా ఉన్నాయి. అందువల్ల, తగినంత మంచి నీరు, నీడపట్టున ఎక్కువ సమయం విశ్రాంతి, తక్షణచికిత్స, ఆస్పత్రులకు తరలింపు తదితర విషయాల్లో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించమంటూ ప్రభుత్వం నుంచి విస్పష్టమైన ఆదేశాలు జారీకావాలి. నిర్మాణరంగంలో పనిచేసేవారిపైనా, ఉపాధిహామీ కూలీలపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో తీవ్ర అనారోగ్యాలకు గురికావడం జరుగుతుంది కనుక మందులకు, వైద్యసహాయానికి లోటులేకుండా చూసుకోవాలి.

వడగాడ్పులను ప్రకృతివైపరీత్యాలుగా పరిగణించకపోవడం, వడదెబ్బ మరణాలకు నష్టపరిహారాలు అందకపోవడం సరికాదు. ఈ అమానవీయమైన ధోరణిని మనం సరిదిద్దుకోవాల్సి ఉంది. ఈ ఏడాది తీవ్ర ఎండలకు సార్వత్రిక ఎన్నికలు కూడా తోడవుతున్నాయి. ఎన్నికల ప్రచారం యావత్తూ భయంకరమైన వేడిమిలో సాగాల్సి వస్తున్నది. వేడితో పాటే ప్రచార ఉధృతీ పెరుగుతుంది. లక్షలాదిమంది సామాన్యులు సభలూ సమావేశాల్లో పాల్గొంటారు, అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. ఎండలు భగభగలాడుతూ, వడగాడ్పులు వీచేకాలంలో వరుసబెట్టి జరిగే ఈ రాజకీయ సదస్సులు, ర్యాలీలు అనేకమంది ఆరోగ్యాన్ని దెబ్బతీసి, వారి ప్రాణాలను ప్రమాదంలో పడవేసే అవకాశం ఉంది. మహారాష్ట్రలో గత ఏడాది సరిగ్గా ఇదే కాలంలో జరిగిన ఓ రాజకీయ సదస్సు పదమూడుమంది ప్రాణాలు తీసింది, వందలాదిమందిని ఆస్పత్రిపాల్జేసింది. నావీముంబైలో ఒక సామాజిక కార్యకర్తకు ఏదో పురస్కారాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ సభను మండుటెండలో నిర్వహించడమే కాక, వచ్చినవారంతా ఎండకు ఎదురొడ్డి నిలిచిన ధీరులు, శూరులని మరీ నాయకులు పొగిడారు. అమిత్ షా సహా కొందరు కేంద్రమంత్రులు, రాష్ట్ర ముఖ్య, ఉపముఖ్యమంత్రులు నీడపట్టున, చల్లగాలిలో గద్దెమీద ఉంటే, పదిలక్షల మంది ప్రజలు మండుటెండలో మాడిపోయారు. అందుబాటులో ఉన్న మంచినీరంతా ఎండవేడికి మరిగిపోయింది. జనం అల్లాడిపోతూ, కుప్పకూలిపోతున్న స్థితిలో చల్లని నీళ్ళకోసం పోలీసులు అటూఇటూ పరుగులుతీయాల్సి వచ్చింది. ఏర్పాట్లు ఎంత నాసిగా ఉన్నాయంటే, సొమ్మసిల్లినవారిని ఆస్పత్రులకు తరలించడానికి పోలీసులు మోటార్‌సైకిళ్ళను వినియోగించాల్సి వచ్చింది. ఇది పాలకులు చేజేతులా సృష్టించిన విపత్తు. పేదల ప్రాణాలమీద పాలకులకు ఎంతశ్రద్ధ ఉంటుందో ఈ ఘటన తెలియచెబుతోంది. సార్వత్రిక ఎన్నికలు, మండుటెండలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్న ఈ కాలాన్ని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దాటించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలమీదా ఉంది.

ఓబీసీలే బీజేపీ డీఎన్ఏ!

భారతీయ జనతా పార్టీ హిందూత్వ ప్రాతిపదికగా, భావోద్వేగాల పరంగా మాత్రమే విజయం సాధిస్తుందని, కొన్ని వర్గాల వారే బీజేపీకి మద్దతు నిస్తారని ప్రచారం చేసేవారికి బీజేపీ నిజంగా గెలిచే కారణాలు ఏనాడూ అర్థం కావు. హిందూత్వ బీజేపీకి జనసంఘ్ కాలం నుంచే మూల సిద్ధాంతం. జాతీయ వాదం బీజేపీ కార్యకర్తలకు భావోద్వేగం కల్పించే ప్రధానాంశం. కాని కేవలం హిందూత్వ ఆధారంగానే, ఈ భావోద్వేగాల ఆధారంగానే బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పడం పాక్షిక సత్యమే.

సమాజంలో అత్యధికులుగా ఉన్న అట్టడుగు వర్గాల ప్రజలు ఆదరించినప్పుడే ఏ పార్టీ అయినా వారి మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంటుంది. బీజేపీకి వెనుకబడిన వర్గాల, దళితుల, ఆదివాసీల మద్దతు బలంగా ఉన్నందువల్లే ఆ పార్టీ గెలుపునకు తిరుగు లేకుండా పోయింది. ఇవాళ దేశంలో అత్యధిక ఓబీసీలు బీజేపీకి మద్దతు నిస్తున్నారు. 2019లో బీజేపీ గెలిచిన 303 సీట్లలో 85 మంది ఓబీసీ ఎంపీలే. అంటే 29 శాతం బీజేపీ ఎంపీలు వెనుకబడిన వర్గాల వారు. దేశమంతటా 27 శాతం ఎమ్మెల్యేలు ఓబీసీ వర్గాలకు చెందిన వారు. 40 శాతం శాసనమండలి సభ్యులు కూడా ఓబీసీలే. ఓబీసీలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్పించినంత ప్రాధాన్యం గతంలో ఏ కాంగ్రెస్ ప్రధానమంత్రీ కల్పించలేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

గత ప్రభుత్వాలు ఓబీసీలపై కేవలం పెదాలపై సానుభూతి కురిపించాయి. కాని మోదీ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన మూడు దశాబ్దాల తర్వాత మొట్టమొదటి సారిగా వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీనివల్ల 671 ఓబీసీ వర్గాలకు న్యాయం జరిగింది. ఓబీసీలను గుర్తించి ఉపాధి కల్పనలోనూ, విద్యాసంస్థల్లోనూ రిజర్వేషన్ కల్పించే అధికారం రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకే దక్కింది. ఎంబీబీఎస్, ఎండీ, ఎమ్మెస్, బీడీఎస్, ఎండీఎస్, డిప్లొమా వంటి అనేక వైద్య కోర్సుల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్ కల్పించింది కూడా మోదీ ప్రభుత్వమే. మోదీ సర్కార్ చారిత్రక నిర్ణయం వల్ల వేలాది మంది ఓబీసీ విద్యార్థులు వైద్య రంగానికి చెందిన వివిధ కోర్సులతో విద్యాధికులు కాగలుగుతున్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ఎంబీబీఎస్ సీట్లు కూడా 56 శాతం, పీజీ సీట్లు 80 శాతం పెరిగాయి. మోదీ ముందు ఏడు దశాబ్దాల్లో కేవలం 56వేల ఎంబీబీఎస్ సీట్లు ఉంటే ఇవాళ మోదీ హయాంలో వీటి సంఖ్య లక్షా ఏడు వేలకు పెరిగింది. 70 ఏళ్లలో 387 మెడికల్ కాలేజీలు నిర్మిస్తే గత పదేళ్లలో వీటి సంఖ్య 706కు పెరిగింది. 70 ఏళ్లలో ఏడు ఎయిమ్స్ సంస్థలు ఏర్పడితే పదేళ్లలో మోదీ వాటి సంఖ్యను 23కు పెంచారు. అదే విధంగా యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎంలు, ట్రిబుల్ ఐటీల సంఖ్య కూడా ఎంతో పెరిగింది. నీట్‌తో పాటు సైనిక్ స్కూళ్లలో కూడా మోదీ ప్రభుత్వం ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించింది. ఈ నిర్ణయాల వల్ల ఎంతమంది ఓబీసీలు, అణగారి వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యాధికులు అయ్యారో అర్థం చేసుకోవచ్చు.



గత ప్రభుత్వాలు ఓబీసీలపై కేవలం పెదాలపై సానుభూతి కురిపించాయి. కాని మోదీ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదిక సమర్పించిన మూడు దశాబ్దాల తర్వాత మొట్టమొదటి సారిగా వెనుకబడిన వర్గాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీని వల్ల 671 ఓబీసీ వర్గాలకు న్యాయం జరిగింది.

స్వయంగా ఓబీసీ అయిన నరేంద్రమోదీకి ఈ దేశంలో వెనుకబడిన వర్గాల బాధలు, ఎన్ని ప్రతిభా సామర్థ్యాలు ఉన్నా అడుగడుగునా వారికి కలుగుతున్న ఆటంకాలు తెలుసు. గతంలో కాంగ్రెస్ హయాంలో వెనుకబడిన వర్గాలకు తీరని అన్యాయం జరిగింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌నే పార్లమెంట్‌లో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. సీతారాం కేసరిని గదిలో బంధించి అవమానించి సోనియాగాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ బుట్టదాఖలు చేసింది. రాజీవ్ గాంధీ ఆ నివేదికను ప్రజలకు వెల్లడించేందుకు ఇష్టపడలేదు. ఎదుగుతున్న ఓబీసీ నేతలను ఏనాడూ సహించని కాంగ్రెస్ ఓబీసీలకు సామాజిక న్యాయంకోసం పోరాడిన కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వాన్ని కూడా గద్దె దించాలని చూసింది. కాని మోదీ ప్రభుత్వం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న పురస్కారాన్ని అందజేసింది. కాంగ్రెస్ ఓబీసీల పట్ల చేసిన దుర్మార్గాల వల్లనే పలు ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. కాని కాంగ్రెస్‌ను వ్యతిరేకించి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నామని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన నేతలు తమ వర్గాల ప్రజలకు చేసింది ఏమీ లేదు. ఇప్పుడవే పార్టీలు బీజేపీ ధాటికి తట్టుకోలేక ఒకప్పుడు తాము వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోనే చేతులు కలిపాయి.

ఈ పరిణామాలు గమనించినందువల్లే ఓబీసీలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. గత ఎన్నికల్లో ఓబీసీల్లో అత్యధికులు బీజేపీకే ఓటు వేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా దేశంలో ఓబీసీల్లో అత్యధికులు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నట్లు ఇటీవల ఇండియా టుడే దేశవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వేలో తేలింది. గత ఏడాది మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించేందుకు ఆ రాష్ట్రాల్లో ఉన్న ఓబీసీలే ప్రధాన కారణం. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి 56 శాతం పైగా ఓబీసీలు ఓటు వేశారు. రాజస్థాన్‌లో 55 శాతం మంది ఓబీసీలు బీజేపీకి పెద్ద పీట వేశారు. ఉత్తరప్రదేశ్‌లో 50 శాతం పైగా ఉన్న ఓబీసీలు బీజేపీ వైపు మొగ్గు చూపినందుకే అత్యధిక స్థానాలను గెలుచుకోగలిగింది. బిహార్‌లో కూడా ఓబీసీలు బీజేపీ–జెడి(యు) కూటమి దిశగా సంఘటితమవుతున్నారు. ఇటీవల హర్యానాలో బీజేపీ నాయకత్వం ఓబీసీ నేత నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిగా నియమించింది. గత ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన మోహన్ యాదవ్ వెనుకబడిన వర్గాలకు చెందినవారే. ఎంపీలో నియమించిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రుల్లో ఒకరు దళితుడు. ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీవర్గానికి చెందిన విష్ణుదేవ్ సాయి ముఖ్యమంత్రి కాగా, ఆయన మంత్రివర్గంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఓబీసీలే. బిహార్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న ఓబీసీ వర్గానికి చెందిన సామ్రాట్ చౌదరి, నితీశ్ కుమార్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి. ఇవాళ ఓబీసీల్లో ప్రాబల్యం ఉన్న యాదవులు, కుర్మీలు, సైనీలు, కొయిరీలు, కుశ్వాహులు, లోధీలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ వర్గాలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నాయి.

విషాదకరమేమంటే గత అయిదేళ్లుగా అరాచక పాలన కొనసాగిస్తున్న జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలతో పాటు వెనుకబడిన వర్గాల వారు తీవ్ర నష్టాలకు, వేధింపులకు గురయ్యారు. మోదీ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలను జగన్ సర్కార్ పూర్తిగా అమలు చేయడం లేదు. సామాజిక న్యాయానికి నోచుకోని పలు ఓబీసీ ఉపకులాలను ఓబీసీ జాబితాలో చేర్చమని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సిఫారసులూ చేయలేదు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు కల్పించే 30కి పైగా పథకాలను సైతం రద్దు చేశారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించకపోగా, బీసీల భూములను పెద్ద ఎత్తున ఆక్రమించుకుంటున్నా వారికి రక్షణ లేకుండా పోయింది. బీసీలు తమ కాళ్లపై తాము నిలబడడానికి, ఉపాధి కల్పనకు రుణాలు లభించడం లేదు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడితేనే ఓబీసీలకు మరింత సామాజిక న్యాయం దక్కుతుందనడంలో సందేహం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

అభివృద్ధి పటాటోపం వెనక అసమానతల కూపం!

అంబానీ కుటుంబం వారి కుమారుడు అనంత్ అంబానీ కోసం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగిన విలాసవంతమైన ప్రీ–వెడ్డింగ్ వేడుక వేడుక దృశ్యాలు ప్రధాన స్రవంతి టీవీ చానళ్ళు సోషల్ మీడియా పుణ్యాన దేశం మొత్తం గుడ్లప్పగించి చూసింది. మీడియా కథనాల ప్రకారం ఈ వేడుకకు ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ మాజీ సీఈఓ బిల్ గేట్స్‌తో పాటూ దేశంలో అగ్రశ్రేణి నటులు, క్రికెటర్లు హాజరయ్యారు. అతిథులకు సంపన్నమైన గుడారాలలో విలాసవంతమైన వసతితో పాటూ 2,500 కంటే ఎక్కువ వంటకాలతో అద్భుతమైన ఆహార అనుభవాన్ని అందించారు. అతిథుల కోసం ప్రైవేట్ విమానాలు ఏర్పాటు చేశారు. ఇందు కోసం తాత్కాలికంగా జామ్‌నగర్ రక్షణ ఎయిర్‌పోర్ట్ పౌర విమానాల సేవలు అందించే ఎయిర్‌పోర్ట్‌గా రూపాంతరం చెందింది. ఈ మూడు రోజుల వేడుకకు అంబానీలు రూ.1259 కోట్లు వెచ్చించారని అంచనా. ఈ కార్యక్రమం భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన అత్యంత ఖరీదైన వేడుకలలో ఒకటిగా చెప్పొచ్చు.

దేశం అంతా అంబానీ ఇంట్లో పెళ్లి వేడుక కోసం మాట్లాడుకుంటున్న సమయంలో వ్యాస రచయితకు ఒడిశా రాష్ట్రంలో బలంగీర్, కలహంది తదితర జిల్లాలలో జరుగుతున్న పెళ్లిళ్ల కథలు, అవి వెట్టికి దారితీస్తున్న పరిస్థితుల గూర్చి తెలుసుకునే ప్రత్యక్ష అవకాశం చిక్కింది. బలంగీర్ జిల్లా వాసి అయిన 56 ఏళ్ళ ఆదివాసీ మహిళ కుంతి.. తన కొడుకు సదానందకు ఆరేళ్ళ క్రితం 3 లక్షల రూపాయల ఖర్చుతో పెళ్లి చేసింది. ఐతే పెళ్ళికి అయిన ఖర్చులో రూ.1.5లక్షలు అప్పు చేయాల్సి వచ్చింది. వడ్డీ 10శాతం, అంటే నెలకు రూ.15వేలు. కుంతి మాటల్లో చెప్పాలంటే "ఇప్పుడు ఐదేళ్ళ వయస్సు ఉన్న నా మనుమడి పెళ్లి సమయానికైనా కూడా ఈ అప్పు తీరుతుందన్న ఆశ లేదు."

ఈ పెళ్లి అప్పు తీర్చడానికి కుంతి కుటుంబం మొత్తం కలిసి గత ఏడాది ఆరు నెలల పాటు ఆంధ్ర లోని విజయనగరం జిల్లాకు ఇటుక బట్టీ కార్మికులుగా వలసకు వెళ్ళింది. అలా వలసకు వెళ్లినందుకు వారికి మనిషికి రూ.45వేల చొప్పున మొత్తం ముగ్గురికి కలిపి రూ.1.35లక్షలు ముట్టాయి. అంటే దాదాపు మనిషికి రోజుకు సగటున భోజన ఖర్చులు పోగా రూ.300 వేతనం లభించింది. కానీ కుటుంబం ఆరు నెలల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన సొమ్ము పేరుకుపోయిన వడ్డీకి మాత్రం సరిపోయింది, అసలు అలానే ఉంది. కానీ ఆ ఇటుక బట్టీలలో పడిన కష్టాల చేదు జ్ఞాపకాలు మాత్రం ఆ కుటుంబంతో మిగిలిపోయాయి. పెళ్లిళ్ల కోసమే కాదు అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగు చేయించడానికి డబ్బు కావాలి కాబట్టి వలస మార్గాన్ని ఆశ్రయిస్తున్న వారి సంఖ్యా తక్కువేమీ కాదు.

నిజానికి పైన మనం మాట్లాడుకున్న రెండు పెళ్ళిళ్ళూ దేశంలో ఉన్న రెండు భిన్న ప్రపంచాలను మనకు అద్దంలో చూపుతున్నాయి. నేడు మన దేశంలో వేడుకల కోసం వేల కోట్లు ఖర్చు చేయగలిగే కుటుంబాలు ఒక వైపు – ఇంట్లో చిన్న చిన్న అవసరాల కోసం దాదాపు వెట్టి చాకిరీ కూపంలోకి తోయబడుతున్న కుటుంబాలు మరొక వైపు కనిపిస్తున్నాయి. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో మునుపు ఎప్పుడూ లేనంతగా అసమానతలు పెరిగిపోయాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ ల్యాబ్ పరిశోధకులు ఇటీవల వెలువరించిన పరిశోధనా పత్రం 'Income and wealth inequality in India'లో స్వాతంత్ర్యం ముందు దేశంలో కంటే పేదలు – ధనికుల మధ్య ఆర్థిక అంతరాలు మరింత పెరిగాయని నిర్ధారించారు. ఈ అంతరాలు దేశ సగటు ఆదాయంలో వాటా, సంపద విషయంలో వాటాలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నట్లు ఆ పరిశోధనా పత్రం తేల్చింది.



మన దేశంలో వేడుకల కోసం వేల కోట్లు ఖర్చు చేయగలిగే కుటుంబాలు ఒక వైపు – ఇంట్లో చిన్న చిన్న అవసరాల కోసం దాదాపు వెట్టిచాకిరీ కూపంలోకి తోయబడుతున్న కుటుంబాలు మరొక వైపు కనిపిస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అరకొరగా అయినా అమలు చేసిన సోషలిస్టు ఆర్థిక విధానాలు దాదాపు 1982 వరకూ పేద–ధనిక అంతరాలు కొంతమేరకైనా తగ్గడానికి కారణం అయ్యాయి. ఆ తరువాత పరిస్థితి తారుమారు అయ్యింది.

దేశ జాతీయ ఆదాయం 100 రూపాయలు అనుకుంటే అందులో సుమారుగా 60 రూపాయలు జనాభాలోని అగ్రశ్రేణి 10శాతం ప్రజల ఆదాయం కాగా, దీనికి విరుద్ధంగా దిగువన ఉన్న 50శాతం జనాభా ఆదాయం కేవలం రూ.15 మాత్రమే. అలానే దేశ పౌరుల సగటు ఆదాయం 100 రూపాయలు అనుకుంటే, భారతదేశంలో అగ్రశ్రేణి ఒక శాతం జనాభా ఆదాయం మాత్రం రూ.2,300 (అంటే జాతీయ సగటు ఆదాయం కంటే 23 రెట్లు ఎక్కువ). ఈ అంకెనే ఘోరం అనుకుంటే దేశంలో గల 10 వేల మంది ధనవంతుల సగటు ఆదాయం మాత్రం రూ.2,06,900. అంటే సగటు భారతీయుల కంటే వీరు 2,069 రెట్లు ఆదాయాన్ని సంపాదిస్తారు.

ఐతే ఈ ఆందోళన కలిగించే ధోరణలు కేవలం ఆదాయానికి పరిమితం కాదు, సంపద విషయంలో కూడా అవే పరిస్థితులు ఉన్నాయి. సంవత్సరాలుగా దేశంలో సంపద కేంద్రీకరణ గణనీయంగా పెరిగింది. ఉదాహరణకు, 1961లో దేశ సంపద రూ.100 అనుకుంటే, టాప్ 10శాతం జనాభా దగ్గర రూ.45 ఉండగా, 2023 నాటికి ఈ సంపద 65 రూపాయలకు పెరిగింది. అలానే ప్రస్తుతం భారతదేశంలో అగ్రశ్రేణి ఒక శాతం జనాభా సగటు సంపద జాతీయ సగటు కంటే 40 రెట్లు ఎక్కువ. అంటే సగటు భారతీయుడి వద్ద రూ.100 ఉంటే, అగ్రశ్రేణి ఒక శాతం జనాభా దగ్గర రూ.4000 ఉన్నాయి. అలానే అగ్రశ్రేణి ఒక శాతం జనాభా సంపద వాటా 1961 నుండి 2023 నాటికి మూడు రెట్లు పెరిగింది. ఇక 40శాతం గల మధ్యతరగతి ఆర్థిక సరళీకరణ తర్వాత గణనీయంగా నష్టపోయింది, దశాబ్దాలుగా వారి సంపద వాటా స్థిరంగా పడిపోతూ వచ్చింది.

దేశ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ అరకొరగా అయినా అమలు చేసిన సోషలిస్టు ఆర్థిక విధానాలు దాదాపు 1982 వరకూ పేద–ధనిక అంతరాలు కొంతమేరకైనా తగ్గడానికి కారణం అయ్యాయి. ఆ తరువాత పరిస్థితి తారుమారు అయ్యింది. ముఖ్యంగా 1990ల దశకం నుండీ దేశం అవలంబించిన ఆర్థిక సరళీకరణ విధానాలు అంతరాలను పెంచుతూ పోయాయని ఆర్థిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అలానే ఉన్నత వర్గాలకి మాత్రమే నాణ్యమైన విద్య పరిమితం కావడం భారతదేశంలో ఆదాయ అసమానతలకు గణనీయంగా దోహదం చేస్తుంది. నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో అధిక జనాభా మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను పొందలేకపోతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు ఆర్థిక వృద్ధికి గణనీయంగా దోహదపడినప్పటికీ అవి అణగారిన వర్గాలు తమ వ్యక్తిగత సామర్థ్యాలతో సామాజిక–ఆర్థిక నిచ్చెన పైకి ఎగబాకడానికి అవకాశాలను పరిమితం చేస్తున్నాయి.

అలానే భారతదేశ ఆర్థిక వృద్ధి చాలా మటుకు సేవా రంగంలో సాధించినదే. ఐతే ఈ రంగం ఆదాయ అసమానతలను కూడా తీవ్రతరం చేసింది. ఎందుకంటే, శ్రామికశక్తిలో గణనీయమైన భాగానికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం, నిర్మాణం, తయారీ వంటి రంగాలలో వేతనాలు సేవల రంగంతో పోలిస్తే చాలా తక్కువ. అందువలన పేద–ధనికుల మధ్య అంతరం మరింత పెరుగుతూ వస్తుంది.

అసమానతలు తగ్గించడానికి చేపట్టాల్సిన, చేపట్టగలిగే చర్యలు ఎన్నో ఉన్నాయి. సంపన్నులపై అధిక పన్నులు విధించే ప్రగతిశీల పన్ను విధానాలను అమలు చేయడం వల్ల సంపద, ఆదాయాన్ని మరింత సమానంగా పునఃపంపిణీ చేయవచ్చు. దేశంలో కేవలం అత్యంత 162 సంపన్న భారతీయ కుటుంబాల నికర సంపదపై కేవలం 2శాతం పన్ను విధిస్తే ప్రభుత్వాలు గణనీయమైన ఆదాయాన్ని పొందవచ్చని ఆర్థికవేత్తలు సెలవిస్తున్నారు.

అధిక నాణ్యత గల విద్య నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడం వలన వ్యక్తులు, ప్రత్యేకించి అట్టడుగు వర్గాలకు చెందిన వారు మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందేందుకు, సంపాదన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. నిరుద్యోగ భృతి, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత వంటి సామాజిక భద్రతా కార్యక్రమాలను బలోపేతం చేయడం వల్ల పేదలకు ఆర్థిక పరిపుష్టి లభించడమే కాక, ఆర్థిక మాంద్యం సమయంలో వారు పేదరికంలో లోతుగా పడిపోకుండా కాపాడుకుంటారు. తగిన కనీస వేతన ప్రమాణాలను అమలు చేయడం వల్ల కార్మికులు వారి శ్రమకు న్యాయమైన పరిహారం పొందడం జరిగి తద్వారా ఆదాయ అసమానతలు తగ్గుతాయి.

కులం, జాతి, లింగం, ఆర్థిక స్థితి ఆధారిత వివక్షను రూపుమాపడం కోసం కార్యక్రమాల రూపకల్పన, అమలు సమ సమాజాన్ని సృష్టించడానికి, వ్యక్తులందరికీ ఆర్థిక అవకాశాలకు సమాన ప్రాప్యతను నిర్ధారించడానికి కీలకమైనది. ఆదాయం–సంపదలలో తీవ్ర అసమానతలను రూపుమాపకపోతే అవి ఆర్థిక అస్థిరతకు దారి తీసి, సామాజిక ఐక్యతను నాశనం చేసే అవకాశం ఉంది, సామాజిక చలనశీలతకు ఆటంకం కలిగిస్తాయి. అంతేకాకుండా, సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలకు, సామాజిక అశాంతికి, సంఘర్షణలకు దారితీస్తాయి. పౌరులందరికీ అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలు కలిగిన సమ సమాజ కల్పన మన రాజ్యాంగ ఆదర్శం. ఇప్పుడు మనం చేయాల్సిన పని ఆర్థిక సమానత్వం కోసం కార్యక్రమాలు రూపొందించాలని పాలకులను నిలదీయడమే.

● చక్రధర్ బుద్ధ
సీనియర్ పరిశోధకుడు, లిబ్‌టెక్ ఇండియా



మళ్ళీ ఓ కోకిల గానం కోసం

బహుశా ఊహలు ఊపిరి పోసుకుంటున్నప్పుడు
దేహానికి ఓ కొత్త రెక్కలు మొలుస్తున్న భావనలోనో
రేపటి గురించి దిగులు మేఘాలు దరిచేరని కాలంలోనో
ఆశల చిగుర్లకు వేలాడుతూ
తూనీగల్ని తుమ్మెదల్ని తేనెటీగల్ని కోకిలల్ని
మనసు వసంతం మీదకు ఆహ్వానించి
విచ్చుకుంటూ వికసిస్తూ ఉంటాను
రుచులు ఆరేనని తెలియని చైత్రాన వేపపువ్వులేరుకుంటూ
కొమ్మలమాటున దాగిన మామిడి పుల్లదనాన్ని
అంతెత్తు పెరిగిన చేరుకుచేలలోని తీపివాసనల్ని
కలగాపులగం చేసుకుంటూ ఆస్వాదిస్తూ ఉంటాను



చెవుల్లో తేనె పోస్తున్న కోకిల అరుపులకు
రెట్టించిన గొంతు వంత పాడుతూ ఉంటుంది
నీరెండకు అభిముఖంగా కొండపై ఎగురుతోన్న
తేనెటీగలు దాచుకున్న వేపతేనె
లొట్టలేస్తున్న నాలుక చివర్లను తడుపుతూ ఉంటుంది
ఎటు చూసినా చెట్లు కొత్త ఆకుల్ని ముస్తాబించుకుని
లేలేత కిరణాలకెదురుగా
బంగారు వర్ణాన్ని తాపడం చేసుకుంటుంటాయి



యిగిరిపోతున్న మంచు బిందువుల వెనుక
గడ్డిపూల శబ్దం మెల్లగా చెవుల్ని సోకుతుంది
ఆరుబయట పారబోసిన వెన్నెల్లో
రాత్రి చుక్కల్ని లెక్కపెడుతూ
రాని నిద్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు
రాలిపోయిన మల్లెల్లోంచి ఏవో గుసగుసల వాసనలు
గమ్యం తెలియని మార్గంవైపు ఈడ్చుకెళ్తుంటాయి
కాలం మజిలీల మధ్య కరిగిపోయిన కొమ్మలకు వేలాడుతూ
కొత్తచిగుళ్ల దేహాలను నాలోకి నింపుకొంటున్నాను
విప్పేసిన పొరల్లోంచి మళ్ళీ కొత్తగా విస్తరిస్తున్నాను.

– బండ్ల మాధవరావు

పుణ్యపు రాశుల ప్రోది



కోపం తాపం శాపం
దరి రానీయకు క్రోధీ!
అందరి మంచిని కోరే
అగణిత ప్రేమాంబుధీ!

నామవాచకమై నిలువుము
క్రోధీ 'నామ్ కే' వాస్తే!
ప్రేమలు పొంగగ పరువుము
దోస్తానీకే రాస్తే!

అజ్ఞానం అలసత్వం
అసమానత ఆక్రోశం

అననుకూల దృక్పథాల
అక్షర సత్యపు క్రోధి!

సామర్థ్యం సహృదయం
సహనం సంయమనంతో
సానుకూల భావనలకు
పుణ్యపు రాశుల ప్రోది!

ఆద్యంతములు ఎరుగని

అఖండ కాలవాహిని
సమస్త జీవజాలానికి
జీవనకాంక్షా మోహిని!

ఆకులన్ని రాలినా
చెట్టు చిగురు వేస్తుంది
నిరీక్షించి వసంతాన
కోయిలమ్మ కూస్తుంది

రాత్రి చీకటిని భరిస్తు
తొలి కిరణం మెరుస్తుంది
మండుటెండలను దాటి
వాన మబ్బు కురుస్తుంది

అవనిలోని అణువణువూ
ఆశావహ సందేశం
కృషితో ఋషి కావాలని
ఈ ఉగాది ఆదేశం

– మడిపల్లి దక్షిణామూర్తి

క్రోధివి నీవు!



క్రోధివి నీవు! నాయకులలోగల దౌష్ట్యముపట్ల నెంతయున్
క్రోధివి నీవు! స్వార్థమునకున్ తలపాగను చుట్టువారికిన్
క్రోధివి నీవు! మానవతకున్ చిగురన్నదిలేదు నేడు; వ
ర్షాధిపతీ! కుహూకుహూల ఆమెతలిమ్ము! శుభాభినందనల్ !

క్రోధివి నీవు! చెడ్డకు విరోధివి! ఒక్కొక కిన్క మంచిదే
గా! ధవుడైన కృష్ణునెడ నల్కలమంట రగుల్చు 'భామ' కా
దే! ధిషణాకవిత్వమున తిమ్మనగారికి నాయికాయె! ఆ
గాథ రసాత్మకమ్ము! చలికాలపు మంటయుకూడా మంచిదే!

నోటునకోటువేసెడి మనుష్యుని నుండి జనించు రాజ్యమె
చ్చోట ప్రజాప్రభుత్వరుచి జూపగలేదు – స్థిరత్వమెన్నడున్
గీటుకురాదు సంకుచిత నేతలు నెగ్గిన – కోటగోడయే
బీటలు తీసినన్ బ్రతుకువీధికి చీకటిపాట దిక్కగున్!

న్యాయంబెక్కడ లేదు – నిన్ననొక పంథా – నేడు వేరొక్క పంథా! యాధర్మచరిత్ర దేవుడెరుగున్, లంచాలతో నాయకుల్
మాయోపాయములెన్ని పన్నినను నాత్మశ్రీ ప్రబోధమ్ముతో
శ్రేయోరాజ్యము నెన్నుకోవలెసుమీ! సిద్ధింపగన్ స్వప్నముల్!

ప్రేమలు నేతిబీరలనిపించెడి వేళ నిజాయితీకి చో
టేమియులేదు! గాంధి రచియించిన రాజ్యము కానిపింపబో
దేమి? ఇకేవియభ్యుదయ దృశ్యము? లూసరవెల్లి పోకడల్
క్షేమముకాదు! వ్యక్తిగత శీలమునుండి ఉగాదులేర్పడున్!

– రసరాజు

సమస్యల స్వగతాలు!



అయినా గానీ వసంతం
సామాన్యుని ఆశలు కావా నీ కవగతం?
ఆమని ఆగామిగా వస్తోందని
నిలదీస్తున్నారుగా జనావళి!
అడుగడుగునా ఎదురుచూస్తున్న ప్రశ్నావళి?

అంతరాల మధ్య మాత్సర్యాల
అంకురాలు నింపుతున్న
సంకుచిత స్వరాలకు ఉరులు
బిగించగలనని
మాట ఇవ్వగలవా?
కలాలగళాలలో గరళాలు నింపి
నరాల ప్రకంపనల ఊపిరి తీసే
కులాల కుత్సితాలకు గుణపాఠం
చెప్పగలవా?
మానవేతిహాసంలో మలుపుల పోకడలను
గమనించావా?
మానవీయ కోణంలో కుదుపుల
అవరోధాలను ఆపగలవా?

క్రోధినామమంటేనే క్రోధాగ్నుల
సెగలు, పొగలు
కక్షలు కార్పణ్యాలు, కుత్సకలుత్తరించు
మదోన్మత్తులు
ఎలా నిలువరించగలవు?
ఏ భరోసా ఇవ్వగలవు?

కలతలతో, కాలసర్ప పరిష్వంగ పీడితులకు
విధ్వంసక శక్తుల దాడుల దగాపడిన
ప్రజావళికి,
సాంత్వన నందించగలవా?
ప్రశాంతత ప్రసాదింపగలవా?

మావితోరణాలతో నీకు
స్వాగతమివ్వాలని వున్నా
గుండెదిటవు చేసుకుని ప్రశ్నిస్తూనే వున్నా.
యుగాలు దాటి నవ ఉగాదివై వస్తావా?
తెలుగునేల పరువు నిలుపు ఘనకీర్తిగా
నిలుస్తావా?
మా ఆశల ఆశయాల
అమృతమందింపగలవా?

– బి.యస్. నారాయణ భట్టు

శాంతి కోసం కోపం



అవును కొంచమంత కోపమూ ఉండాల్సిందే
కొంతలో కొంతనైనా క్రోధమూ ఉండి తీరాల్సిందే
కోపగొండి తనం లేకుంటే పురాగ ఏం లేదన్నట్టు

కోపమంటే ధిక్కరించే చర్యకు పూర్వ రంగం
కోపమంటే అపసవ్యతపై కన్నెర్ర రూపం
కోపం ప్రశాంతత కోసం ఎదురుచూసే సన్నాహం

క్రోధి నామ సంవత్సరంలోనైనా
క్రూరత్వంపై కత్తి దులపకపోతే ఎలా

బహుళత్వాన్ని ఇవ్వగొడుతున్న చేతుల మీద
దేశీయతను గాయం చేస్తున్న ఖడ్గం మీద
పచ్చని చెట్లను తొలుస్తున్న చెద పురుగుల మీద
మనసుల్లోకి వ్యాపిస్తున్న విష వలయాల మీద
ఉక్కు పిడికిళ్లతో నినదించి ఎదిరించి తీరాలి

అన్యాయం న్యాయమై అన్యాయంగా చలాయిస్తే
అవినీతి నీతివంతమై నిర్విఘ్నంగా ఊరేగుతుంటే
అచ్చంగా అధర్మమే ప్రవచనమై ప్రవహిస్తుంటే
రాజ్యాలే రాజ్యాంగాన్ని అప్రజాస్వామిక పరిస్తే
నిజాలు కెలికెందుకు నిప్పురవ్వగనైన నిలవాలి

చూసి చూడనట్టు మౌనంగా ఉండటం నేరం
నిశ్శబ్దాన్ని ఛేదించేట్టు శబ్దం చేయడమే కర్తవ్యం

పోరాటం పొటమరించి శాంతి జనిస్తుంది
క్రోధాగ్ని రగిలితేనే క్రూరత్వం పారిపోతుంది
నికార్సైన పొగరే రెపరెపలాడే ఆత్మగౌరవం

సమన్యాయ సామరస్యం కుదిరే దాకా
కోపతాపాల దాహ దుఃఖాలు కురవాల్సిందే
క్రోధిలోనూ ఆ ఆనందాలు పంచుకోవాల్సిందే.

– అన్నవరం దేవేందర్

అనితర సాధ్యుడు సాంకృత్యాయన్

భారతదేశంలో యాత్రా సాహిత్యానికి పితామహుడు రాహుల్ సాంకృత్యాయన్. భారత జాతీయోద్యమంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసి మూడేళ్ల కారాగార శిక్ష అనుభవించారు. 1940 నుండి జీవితాంతం కమ్యూనిస్టుగానే ఉన్నారు. రైతుల పక్షాన నిలిచి అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. 1893 ఏప్రిల్ 9న ఉత్తరప్రదేశ్‌లోని పందహా గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఈయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కేదార్‌నాథ్ పాండే. బౌద్ధం అధ్యయనంలో ప్రవేశించాక రాహుల్ సాంకృత్యాయన్‌గా తన పేరు మార్చుకున్నారు.

బౌద్ధం మీద అపరిమితమైన పరిశోధనలు చేసారు. బౌద్ధమతానికి చేకూర్చిన సేవలను బౌద్ధులు ఎంతో విలువైనవిగా భావిస్తారు. యాత్రా సాహిత్యం, ఆత్మకథ, చారిత్రాత్మక నవలలు, చరిత్ర గ్రంథాలు, నిఘంటువులు, వ్యాకరణాలలో తనదైన ముద్ర వేశారు. సోషియాలజీ, మతం, తత్వం, భాష, సైన్సు వంటి అంశాల మీద 150 పుస్తకాలు రాసారు. రుగ్వేద ఆర్యులు, లోకసంచారి, దివోదాసు, విస్మృత యాత్రికుడు, సింహసేనాపతి, జయ మౌధేయ, మధురస్వప్నం వంటి రచనలు దేనికదే ప్రత్యేకమైనది. 'ఓల్గా సే గంగ (ఓల్గా నుంచి గంగకు)లో క్రీ.పూ ఆరువేల సంవత్సరాల నుంచి క్రీ.శ 1942 వరకు ఇండో యూరోపియన్ మానవ సమాజ వికాసాన్ని సాంకృత్యాయన్ కథల ద్వారా వివరించారు.

మనదేశంలోని అన్ని ప్రాంతాలతో పాటు, నేపాల్, టిబెట్ , మంగోలియా, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, ఇరాన్, చైనా, సోవియట్ యూనియన్ తదితర దేశాలలో విస్తృతంగా పర్యటించారు. సంస్కృతం, పాళీ భాషల శాసనాలను, రాతిఫలకాలనూ కనుగొన్నారు. సుమారు 130 వర్ణ చిత్రాలను, 1600కు పైగా వ్రాత ప్రతులను ప్రయాసతో సేకరించారు. ముప్పైకి పైగా దేశవిదేశీభాషలు నేర్చుకున్నారు. టిబెటన్ భాషకు వ్యాకరణం రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు రూపొందించారు. భారతీయ సాహిత్యానికి, చరిత్రకు ఆయన అందించిన సేవలు ఎనలేనివి.

– ర్యాలి ప్రసాద్

(నేడు రాహుల్ సాంకృత్యాయన్ జయంతి)

ఎన్డీయే విజయంతోనే మాదిగల సంక్షేమం

▸▸ గ్రామ, గ్రామాన

ప్రచారం చేయండి: మంద కృష్ణ మాదిగ



మాదిగల, అనుబంధ కులాల ఆత్మీయ సమావేశంలో మంద కృష్ణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ గెలుపునకు ప్రతి మాదిగ పనిచేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. గుంటూరులో సోమవారం మాదిగ, అనుబంధ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మోదీ, చంద్రబాబు అనుకూలంగా ఉన్నారని, ఈ కారణంగా వారితోనే నడవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం గ్రామ, గ్రామాన ప్రచారం నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు ఉన్న 29 సీట్లలో పొత్తులో 25 సీట్లు తీసుకున్న టీడీపీ 14 స్థానాలు మాదిగలకు కేటాయించి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు.

బాబుకు బేషరతుగా మాదిగ సంఘాల మద్దతు

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాదిగ సంఘాలన్నీ బేషరతుగా చంద్రబాబునాయుడికి మద్దతు తెలుపుతున్నట్టు ఆ సంఘాల నాయకులు ప్రకటించారు. ఇప్పటికే చంద్రబాబును కలిసి, మద్దతు తెలిపిన మాదిగ సంఘాల నాయకులు.. టీడీపీకి మద్దతుగా పని చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. సోమవారం మరోసారి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సమావేశమైన వారు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ముఖ్య అతిథులుగా పార్టీ నేతలు వర్ల రామయ్య, టీడీ జనార్దన్ పాల్గొని, రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు మాదిగ సమాజానికి చేరవేయాల్సిన ప్రచారాంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల నేతలు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు మాదిగల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మాదిగలకు జరిగిన మేలును ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

తిరుమలలో నేడు ఉగాది ఆస్థానం

తిరుమల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని టీటీడీ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. తెల్లవారుజామున మూడు గంటలకు సుప్రభాతం నిర్వహించాక శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం ఆరు గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాగ శ్రవణం చేస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కాగా, శ్రీవారి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

ఆదిదంపతులకు ప్రభోత్సవం

▸▸ శ్రీశైలంలో కొనసాగుతున్న ఉగాది ఉత్సవాలు



శ్రీశైలం క్షేత్రవీధుల్లో ప్రభోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 8: ఉగాది మహోత్సవాలు శ్రీగిరిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూ డో రోజు సోమవారం క్షేత్రంలోని రథవీధిలో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం జరిపారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు నందివాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వగా, మహాసరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

ఏపీఈఏపీసెట్‌కు 3,05,754 దరఖాస్తులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 8: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2024కు ఇప్పటివరకూ 3,05,754 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏపీఈఏపీసెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,35,417 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు 69,445 మంది, రెండు విభాగాలకు 892 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సందేహాలుంటే 0884 2359599, 2342499 నంబర్లలో సంప్రదించాలని వెంకటరెడ్డి సూచించారు.

సాగర్ కుడి కాల్వకు కృష్ణా జలాలు

అమరావతి, నాగార్జునసాగర్, ఏప్రిల్ 8: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో కుడికాల్వ కింద ఉన్న గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలకు సోమవారం కృష్ణా జలాలను కేఆర్ఎంబీ విడుదల చేసింది. కేఆర్ఎంబీ ఈఈ శివశంకరయ్య పర్యవేక్షణలో కుడికాల్వ 5, 7 గేట్ల ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని సాగర్ ప్రాజెక్ట్ ఈఈ (ఏపీ) శ్రీహరి హెడ్ రెగ్యులేటర్ వద్ద స్విచ్చాన్ చేసి విడుదల చేశారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ, తాగునీటి అవసరాల నిమిత్తం రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 10 రోజులు మొత్తం 5 టీఎంసీల నీటిని కుడికాల్వకు విడుదల చేస్తామన్నారు.


సాంకేతిక సమస్యతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సాంకేతికతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సర్వర్లు పని చేయలేదు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో సోమవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు భారీగా క్రయ విక్రయదారులు తరలివచ్చారు. సర్వర్లు గంట సేపు మాత్రమే పని చేశాయి. మంగళవారం ఉగాది కావడం, ఆ తర్వాత రంజాన్ సెలవు కూడా ఉండడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ ఎక్కువగా ఉంది. వివిధ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలతో గత నెల రోజులుగా ఇటువంటి పరిస్థితి నెలకొందని క్రయ, విక్రయదారులు చెబుతున్నారు.

మతి స్థిమితంలేని మహిళనూ వదల్లేదు!

▸▸ అత్యాచారయత్నం చేసిన వైసీపీ నాయకుడు

ఆస్పరి, ఏప్రిల్ 8: మతిస్థిమితం లేని మహిళపై వైసీపీ నాయకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన కర్నూలు జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ హనుమంతప్ప తెలిపిన వివరాల ప్రకా రం.. నగరూరు గ్రామ వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలి సోదరుడైన రాము డు వైసీపీ నాయకుడిగా చెలామణీ అవుతున్నాడు. అతడు సోమవారం రాత్రి బిణిగేరి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు రాముడి వెంట పడటంతో.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై బాధితురాలి సోదరుడు ఆస్పరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



NBK'S HAT-TRICK DIRECT JUBILEE
FIRST TIME IN HISTORY
SHINE SCREENS
175
DAYS
చిలకలూరిపేట: రామకృష్ణ
(రోజు 4 ఆటలు)
NBK106
అఖండ
SILVER JUBILEE
CELEBRATED IN 2022
NBK108
భగవంత్ కేసరి
I DON'T CARE
NBK107
వీరసింహారెడ్డి
SILVER JUBILEE
CELEBRATED IN 2023
AN ANIL RAVIPUDI FILM
SAHU GARAPATI HARISH PEDDI
THAMAN S
CELEBRATING SILVER JUBILEE IN 2024



SMT PADMA PRESENTS
HAPPY UGADI
APR 19TH 2024 WORLDWIDE
పారిజాత పర్వం
WRITTEN AND DIRECTED BY SANTOSH KAMBHAMPATI
PRODUCED BY MAHIDHAR REDDY, DEVESH
SC
RELEASE
Junglee



ఉగాది శుభాకాంక్షలు
KFC
ANJALI
KONA VENKAT PRESENTS
గీతాంజలి మళ్ళీ వచ్చింది
APRIL 11TH
WORLDWIDE RELEASE
MVV SATYANARAYANA G.V
SHIVA TURLAPATI PRAVIN LAKKARAJU SUJATHA SIDDHARTH
UA



SRIMANI ENTERTAINMENTS
BABY VAISHNAVI PRESENTS
ఉగాది శుభాకాంక్షలతో...
ఏప్రిల్ 19 విడుదల
తెప్ప సముద్రం
STORY - SCREENPLAY - DIRECTION SATEESH RAPOLU
PRODUCER NIRUKANTI MANJULA RAGHAVENDAR GOUD
MRT music




RADHAVI ENTERTAINMENTS
RELEASE BY DHEERAJ MOGILINENI ENTERTAINMENT
ఉగాది శుభాకాంక్షలతో
ఏప్రిల్ 11న విడుదల
శ్రీరంగనీతులు
PRODUCER VENKATESHWAR RAO BALMURI WRITER & DIRECTOR PRAVEEN KUMAR VSS



RK
విక్రమ్ ప్రొడక్షన్స్
IGNORANCE OF THE LAW IS CRIME
COMING SOON
ఉగాది శుభాకాంక్షలు
DIRECTOR K.S.RAVIKUMAR PRESENTS
R.SARATH KUMAR
VIJAY KANISHKA
హిట్ లిస్ట్



STONE BENCH FILMS
sree siri sai CINEMAS
ZEE STUDIOS
ఉగాది శుభాకాంక్షలు
PURATCHI THALAPATHY VISHAL IN
రత్నం
STORY - SCREENPLAY - DIALOGUE - DIRECTION
HARI
DEVI SRI PRASAD
WORLDWIDE APRIL 26 RELEASE
M.SUKUMAR P.V.BALAJI T.S.JAY VIVEKA
CO PRODUCERS ALANKAR PANDIAN - KALYAN SUBRAMANIAM
PRODUCED BY KAARTHEKEYEN SANTHANAM - ZEE STUDIOS
AP & TELANGANA THEATRICAL RELEASED BY SREE SIRI SAI CINEMAS
amazon prime
ADITYA MUSIC



ADVENTUROUS BLOCKBUSTER
మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మెల్ BOYS
ఉగాది శుభాకాంక్షలు
WRITER & DIRECTOR CHIDAMBARAM
PRODUCED BY BABU SHAHIR, SOUBIN SHAHIR, SHAWN ANTONY
MYTHRI





ఉగాది కళ! వసంత రుతువు రానే వచ్చింది. షడ్రుచుల పండుగను తెచ్చింది. గుమ్మాలకు తోరణాలు కట్టి.. యువతులు పట్టు పరికిణీలు ధరించి.. యువకులు తెల్లంచు పంచెకట్టి.. కుటుంబమంతా కళకళలాడే తెలుగు పండుగ ఉగాది వచ్చేసింది. మంగళవారం క్రోధి నామ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సోమవారం సాయంత్రం నుంచే పూల మార్కెట్ కిటకిటలాడింది. మామిడి కాయలు, ఆకులు విక్రయాలు జోరుగా సాగాయి.



గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల దాడి

- ఉల్లిపాలెం జాతరలో ఘర్షణ • తిరగబడిన టీడీపీ కార్యకర్తలు
- వైసీపీ వాళ్లకు అనుకూలంగా వ్యవహరించిన పోలీసులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 : బందరు మండలం పోతేపల్లి శివారు ఉల్లిపాలెంలో శుక్రవారం రాత్రి నూకాలమ్మ అమ్మవారి జాతరలో ఘర్షణ జరిగింది. టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య మాటమాట పెరిగి కొట్లాటకు దారితీసింది. వైసీపీ కార్యకర్త భాను, టీడీపీ కార్యకర్త కేసన ధర్మతేజ ఒకరినొకరు తోశారనే పేరుతో మొదలై తీవ్ర వాగ్వివాదానికి దారితీసింది. ఈ క్రమంలో ఉల్లిపాలెం యువకుడు కేసన ధర్మతేజపై వైసీపీ కార్యకర్తలు దాడికి దిగడంతో ఊరంతా అండగా నిలిచింది. వైసీపీ కార్యకర్తలు ముందస్తు ప్రణాళికతో కర్రలతో దాడులకు దిగారు. ప్రతిగా టీడీపీ కార్యకర్తలు ఎదురుదాడికి దిగారు. కేసన ధర్మతేజ, యశ్వంత్, మహేష్, పవన్, శ్రావణ్‌లపై వైసీపీ కార్యకర్తలు జి.భాను, మణికంఠ, పాండురంగారావు, ఉదయ్, వెంకటేశ్వరరావు దాడి చేశారు. భాను వెనుక ఉన్న పేర్ని కిట్టు అనుచరులు, వైసీపీ కార్యకర్తలు యథేచ్ఛగా దాడులకు దిగారు. ధర్మతేజ, మహేష్‌లకు తలపై బలమైన గాయాల య్యాయి. పోలీసులకు గ్రామస్తులు ఫోన్ చేసినా తెల్లవారుజాము వరకు రాలేదు. ఈలోగా గాయపడిన టీడీపీ కార్యకర్తలు ధర్మతేజ, మహేష్, యశ్వంత్, పవన్, శ్రావణ్‌లను ఆసుపత్రిలో చేర్చారు. వీరితోపాటు గాయపడిన జి.భాను, మణికంఠ, పాండురంగారావు, ఉదయ్, వెంకటేశ్వరరావులను కూడా ఆసుపత్రిలో చేర్చారు. వైసీపీ కార్యకర్తలపై పోలీసులు ఆలస్యంగా కేసులు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన ధర్మతేజ, మహేష్, యశ్వంత్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని మచిలీపట్నం టీడీపీ కూటమి అభ్యర్థి కొల్లు రవీంద్ర పరామర్శించారు.

దుర్గగుడిలో నేటి నుంచి పుష్పార్చనలు

- 8లో..

భారీగా గట్టు కోతలతో, ఒకదాని తరువాత ఒకటి టిప్పర్ల పరుగులతో కనిపిస్తున్న ఈ దృశ్యం అక్రమ మైనింగ్‌కు నిదర్శనం. గన్నవరం మండలం కొండపావులూరు సర్వే నెంబర్ 34లో 100 మీటర్ల లోతున జరిగిన మట్టి తవ్వకాలకు సాక్షీభూతం. సాగర్ కాల్వకు గండి కొట్టి మైనింగ్ చేపడుతున్న అక్రమానికి నిలువుటద్దం. అక్రమార్కులు వ్యవస్థలను చెప్పుచేతల్లోకి తీసుకుని భారీస్థాయిలో మట్టి తవ్వి తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్లను పెట్టి రోజుకు రెండు వేలకుపైగా టిప్పర్లలో తరలించేస్తున్నారు. అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో జరుగుతున్న ఈ అక్రమాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖలకు తెలిసినా చర్యలు తీసుకోవటం లేదు.



కొండపావులూరులో మట్టిని తోడేస్తున్న ఎక్స్‌కవేటర్

తోడేస్తున్నారు!

సాగర్ కాల్వకు గండి కొట్టి మైనింగ్

- కొండపావులూరు సర్వే నెంబర్ 34లో అక్రమం
- 100 మీటర్ల లోతున తవ్వి టిప్పర్లలో తరలింపు
- ఇప్పటికే 30 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం
- అక్రమ మైనింగ్‌లో వైసీపీ కీలక నేత అనుచరుడికి భారీగా వాటాలు
- కోర్టును ఆశ్రయించిన మామిడి రైతులు..
- అయినా లెక్కలేకుండా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కొండపావులూరులోని సర్వే నెంబర్ 34లో గతంలో పేద దళితులకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి కొందరికి సాగు పట్టాలు ఇచ్చారు. మరికొందరు ఆక్రమించుకుని సాగు చేపట్టారు. కొండవాలు ప్రాంతమైన ఈ భూముల్లో భారీగా ఎర్రమట్టి, తెల్లచట్టు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన అధికార పార్టీ అక్రమార్కులు ఈ భూములపై కన్నేశారు. స్థానికంగా పేద దళితులు, పట్టాలు కలిగిన వారి నుంచి ఈ భూములను కొనుగోలు చేసి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. మూడు మీటర్లు అని చెప్పి ప్రస్తుతం 100 అడుగుల వరకు తవ్వేశారు. మైనింగ్ మాఫియా కొనుగోలు చేసిన భూముల మధ్యన సాగర్ కాల్వ ఉండటం వల్ల దానికి కూడా గండి కొట్టి 50 అడుగుల లోతున తవ్వి దారి ఏర్పాటు చేసుకుని ఆవల ఉన్న భూముల్లో వంద అడుగుల లోతున ఇప్పటి వరకు తవ్వేశారు. వంద అడుగులకుపైగా తవ్వేసినా.. ఇంకా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూనే ఉన్నారు. గండికోట తరహాలో భారీలోతున జరుగుతున్న అక్రమ తవ్వకాల కారణంగా సమీపంలోని మామిడితోటల భూములు కూడా కోతకు గురవుతున్నాయి.

అక్రమార్కులు సరిహద్దు పొలాలను కూడా దాటి తవ్వేయడంతో తనకు జరిగిన అన్యాయంపై ఓ రైతు హైకోర్టును ఆశ్రయించాడు.


ప్రమాదకరంగా గోతులు

సాగర్ కాలువ అనేది సాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ కాలువలో నీరు లేకపోయినా.. అక్రమ మైనింగ్ కోసం దానికి గండి పెట్టడం వల్ల నీరంతా 100 అడుగుల లోతున తవ్వేసిన గోతుల్లోకే వెళతాయి. వంద అడుగులకుపైగా తవ్వేసిన గోతులు చూస్తే అత్యంత భయంకరంగా కనిపిస్తున్నాయి. వర్షాలు పడితే ఇవి మునిగిపోయే ప్రమాదం ఉంది. 100 అడుగుల లోతున నీరు నిల్వ ఉంటే.. గట్టు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. సరిహద్దును అనుకుని ఉన్న మామిడితోటలన్నీ కోతకు గురై, కొంత విస్తీర్ణం మేర కుంగిపోయి.. రైతులు నష్టపోయే అవకాశం ఉంటుంది. అన్నింటికీ మించి మృత్యుకుహరాలుగా ఉంటాయి.

ఎర్రమట్టి, తెల్లచట్టుకు భారీ గిరాకీ

సర్వే నెంబర్ 34లో జరుగుతున్న అక్రమ తవ్వకాలకు సంబంధించి మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. రెవెన్యూ అధికారులతో డీల్ కుదుర్చుకుని తవ్వకాలకు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తోంది. ఇప్పటికే 30 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా మట్టిని తవ్వేసినట్టు తెలుస్తోంది. ఎర్రమట్టికి ఎంతో డిమాండ్ ఉంది. కొండవాలు కాబట్టి మెత్తటి మట్టి నిక్షేపాలు ఉన్నాయి. ఈ మట్టికి ఎంతో డిమాండ్ ఉంది. ఉద్యానవనాల అభివృద్ధికి, గ్రీన్‌బెల్టుల విస్తరణ, ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు ఈ మట్టి అంటే ఎంతో డిమాండ్. దీంతో హాట్‌కేకులా అమ్ముడౌతోంది. ఈ మట్టి ద్వారా ఇప్పటికే రూ.వందల కోట్లు పిండుకున్నట్టు తెలుస్తోంది. వంద అడుగుల లోతుకుపైగా ఈ మట్టిని తవ్విన తర్వాత.. తెల్లచట్టు బయట పడింది. మార్కెట్లో తెల్లచట్టుకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. తెల్లచట్టు అనేది రోడ్లకు ఉపయోగిస్తారు. తెల్లచట్టు వేస్తే బిగుసుకుని గట్టిపడుతుంది. దీంతో ఈ తెల్లచట్టు పెద్ద ఎత్తున రియల్ వెంచర్లకు తరలిపోతోంది.

అడ్డగోలుగా తవ్వేస్తున్నారు : గోనేపల్లి సురేష్



పొలాలు కొనుగోలు చేసి వంద మీటర్లకుపైగా తవ్వేస్తున్నారు. ఈ మట్టి అంతా బయటకు తరలించి అమ్మేసుకుంటున్నారు. ప్రతిరోజూ కనీసం వెయ్యికి పైగా లారీల్లో మట్టి తరలిపోతోంది. దుమ్ము బీభత్సంగా లెగుస్తోంది. కాలుష్యంతో అల్లాడిపోతున్నాం. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవటం లేదు.

మామిడి తోటలు నాశనమవుతున్నాయి : చిట్టేటి శ్రీనివాస్



దారుణంగా తవ్వేస్తున్నారు. వంద అడుగులకుపైగా తవ్వేశారు. ఇంకా తవ్వుతున్నారు. సాగర్ కాలువకు కూడా గండి కొట్టి మరీ తవ్వేస్తున్నారు. భారీ తవ్వకాల వల్ల దుమ్ము లేచి మామిడి చెట్ల మీద పడుతోంది. మావిడిచెట్లన్నీ ఎర్రగా మారిపోయాయి. మావిడిచెట్ల పూత కూడా క్వారీ వల్ల రాలిపోయింది. ఎన్నిసార్లు చెప్పినా వినటం లేదు. చివరకు రైతులు కొందరు కోర్టుకు వెళ్లినా పట్టించుకోలేదు.

అక్రమం వెనుక వైసీపీ నేత హస్తం

అక్రమ మైనింగ్ వెనుక గన్నవరం నియోజవర్గ కీలక వైసీపీ నేత ముఖ్య అనుచరుల హస్తం ఉందన్న తెలుస్తోంది. వీరెక్కడా బయట పడకుండా ఉండటానికి ముదిరాజుపాలెం గ్రామ మాజీ సర్పంచ్ గోనె వెంకయ్య పేరును తెరపైకి తెచ్చారు. స్థానికంగా ఉన్న రైతులంతా గోనె వెంకయ్య ఈ అక్రమ తవ్వకాలను మేనేజ్ చేస్తున్నాడని అతనిపైన వైసీపీ నేతలు ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల మాటున వైసీపీ కీలక నేత ముఖ్య అనుచరుడి భారీగా వాటాలు ముట్టినట్టు తెలుస్తోంది.



తనపై దాడికి నిరసనగా డూండీ రాకేశ్ నిరసన దీక్ష, పక్కన కేశినేని చిన్ని

వెలంపల్లి సేవలో అధికారగణం!

ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారంలో పోలీసుల ఓవరాక్షన్

- ఆర్యవైశ్య సమావేశంలో వెలంపల్లి రాజకీయ ప్రసంగం
- ఓట్లేయకుంటే ఇబ్బందులు తప్పవని వేదికపై నుంచే బెదిరింపులు
- ఆయన ప్రసంగానికి అడ్డుచెప్పని పోలీసులు
- బొండా ఉమను మాత్రం బలవంతంగా బయటకు పంపేసిన వైనం
- డూండీ రాకేశ్ చొక్కా పట్టుకుని ఈడ్చుకుంటూ లాక్కెళ్లిన పోలీసులు
- పోలీసులతోపాటు వీఎంసీ సిబ్బందీ వెలంపల్లి సేవలోనే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఆర్యవైశ్య సంఘం సమావేశం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వెలంపల్లి, ఆయన అనుచరుడు కొండపల్లి బుజ్జి కలిసి రాజకీయ సమావేశంగా మార్చేశారు. విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం అమ్మ కల్యాణ మండపంలో జరిగింది. వేదికపై నుంచే వైసీపీకి ఓట్లేయాలంటూ వెలంపల్లి సమావేశానికి వచ్చిన వారికి విజ్ఞప్తి చేశారు. తనకు ఓట్లేయకపోతే మున్ముందు ఇబ్బందులు పడతారని బెదిరింపులకూ దిగారు.

బొండా ఉమా రాకతో పోలీసులు ప్రత్యక్షం

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండి రాకేశ్, విజయవాడ సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా కూడా ఈ సమావేశానికి వచ్చారు. బొండా ఉమా వేదికపైకి ఎక్కే సమయానికి అప్పటి వరకు అక్కడ కనిపించని పోలీసులు ఆకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యారు. డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా, సెంట్రల్ ఏసీపీ భాస్కర్‌రావు, గుణదల సీఐ గుణరాము రావడం రావడంతోనే టీడీపీ వారిపై విరుచుకుపడ్డారు. ఉమాను సమావేశ మందిరం నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. డూండి రాకేశ్‌ను చొక్కా పట్టుకుని ఈడ్చుకుంటూ బయటకు లాక్కెళ్లారు. పోలీసులు తనపై దాడి చేసి కొట్టారని కూడా రాకేశ్ ఆరోపిస్తున్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పోలీసులు అధికార వైసీపీకి ఎలా కొమ్ముకాస్తున్నారో చెప్పేందుకు ఈ ఉదాహరణే నిదర్శనం.

పోలీసుల ఓవరాక్షన్

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో గవర్నర్‌పేట, సత్యనారాయణపురం, గుణదల, అజిత్‌సింగ్‌నగర్, నున్న ఐదు పోలీసుస్టేషన్లు ఉన్నాయి. వీరందరినీ పర్యవేక్షిస్తూ సెంట్రల్ ఏసీపీ కార్యాలయం ఉంది. వీరందరితోనూ వెలంపల్లి శ్రీనివాసరావు తరచూ మంతనాలు జరుపుతుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి.

- ఇటీవల బొండా ఉమాపై ఎన్నికల ఉల్లంఘన కేసు నమోదు చేశారు. వెలంపల్లిపై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసినందుకు ఈ కేసు నమోదు చేశారు. అయితే ఉమాను సైతం వెలంపల్లి తీవ్రస్థాయిలో దుర్భాషలాడారు. కానీ వెలంపల్లిపై మాత్రం కేసు నమోదు చేయలేదు. ఈ విషయంపై టీడీపీ శ్రేణులు ఆందోళన చేయగా ఎట్టకేలకు ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు.
- ఈ నెల 6న వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌తో కలిసి 36వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. వందలాది మందితో అట్టహాసంగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్నికల నిబంధనలను ఏ మాత్రం ఖాతరు చేయలేదు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. బాణసంచా కాల్చడానికి, భారీ ర్యాలీ నిర్వహించడానికి ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులూ లేకుండానే దీన్ని నిర్వహించినా పోలీసులు, ఎన్నికల అధికారులు చూసీచూడనట్లు ఉండిపోయారు.
- వివిధ విభాగాలకు చెందిన వీఎంసీ సిబ్బంది వెలంపల్లి సేవలో తరిస్తున్నారు. వెలంపల్లి ఏయే డివిజన్లలో పర్యటిస్తున్నారో ముందుగా వీరికి సమాచారం ఇస్తున్నారు. ఆయా డివిజన్లలో ఎంత మందికి ఏయే పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరింది. వీఎంసీ తరఫున చేసిన అభివృద్ధి పనులు వంటి వివరాలను వెలంపల్లి కార్యాలయానికి వెళ్లి మరీ అందించి వస్తున్నారు. కొందరు సచివాలయ సిబ్బంది సైతం వెలంపల్లి కార్యాలయ సిబ్బంది మాదిరి పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి వద్ద పనిచేసే సిబ్బందిని ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత వెనక్కి పిలిపించి వారికి వేరే విధులు కేటాయించారు. కానీ ఇదంతా పేపర్‌పైన మాత్రమే. వారంతా అనధికారికంగా మేయర్ వద్ద, వెలంపల్లి కార్యాలయం వద్ద సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు వెలంపల్లి ఆత్మీయ సమావేశాల పేరుతో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున తాయిలాలు, డబ్బులు అందజేశారు. ఆ కృతజ్ఞతతో పలువురు వలంటీర్లు డివిజన్లలో తిరుగుతూ వెలంపల్లి తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు.



ఎ.కొండూరులో స్థలాన్ని పరిలిస్తున్న నేతలు

నిజం గెలవాలి ముగింపు సభ చీమలపాడులో..

- 13న నిర్వహణకు స్థల పరిశీలన
- సభకు రానున్న భువనేశ్వరి, చంద్రబాబు

ఎ.కొండూరు, ఏప్రిల్ 8 : టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' ముగింపు (203వ) సభ ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించనున్నారు. ఈనెల 13న ఎ.కొండూరు మండలంలో చీమలపాడులో 24 ఎకరాల్లో సభ నిర్వహించడానికి అనువైన స్థలాన్ని టీడీపీ నేతలు పరిశీలించారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు భువనేశ్వరి కార్యక్రమాల ఇన్‌చార్జి భరణి, ఏఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి ఆధ్వర్యం మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీపంలో అనువైన స్థలాన్ని పరిశీలించారు. చివరకు చీమలపాడులోని 24 ఎకరాల్లో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సభకు చంద్రబాబు, భువనేశ్వరి హాజరవు తారని భరణి తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (మంగళ)
సహర్ (ఉదయం) : 4-43 (బుధ)

వివాదాల ప్రాంగణం

వాయిదాలకు వచ్చి బెదిరింపులు

- కోర్టు ప్రాంగణాల్లో హెచ్చరికలు
- తాజాగా జరిగిన ఘటన
- కొన్నిరోజుల క్రితం వంశీ బెదిరింపులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : కోర్టు వాయిదాలకు వచ్చినవారు ప్రత్యర్థులకు బెదిరింపులు జారీ చేస్తున్నారు. అనుచరులతో వచ్చి హంగామ సృష్టిస్తున్నారు. కేసులు ట్రయల్‌కు వచ్చిన దశలో ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయి. తమకు ప్రాణ భయం ఉందంటే తమకు ప్రాణభయం ఉందని నిందితులు, సాక్షులు కేసులకు సంబంధం లేని వ్యక్తులను వెనుకేసుకు వస్తున్నారు. ఒకవిధంగా న్యాయస్థానాల ప్రాంగణంలో బలప్రదర్శనలు చేసుకుంటున్నారు. ఇటీవల ఈ తరహా ఘటనలు విజయవాడలోని కోర్టు ప్రాంగణంలో జరుగుతున్నాయి.

తాజాగా...

నిడమానురుకు చెందిన వడ్లమూడి మోహన్‌కృష్ణను వల్లభనేని నాగరాజు కుమార్ తన ఇంట్లో 2011 జూలై 15న హత్య చేశాడు. మోహన్‌కృష్ణ.. వల్లభనేని వంశీకి ముఖ్య అనుచరుడు. హత్య చేసిన తర్వాత దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి నిడమానూరు జాతీయ రహదారికి పక్కన పడేశారు. ఈ ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు కుమార్‌తోపాటు 15 మందిపై చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ట్రయల్ ఎనిమిదో ఏసీఎంఎం కోర్టులో నడుస్తోంది. ఈ విచారణకు నాగరాజుకుమార్‌తోపాటు 14 మంది నిందితులు హాజరవుతున్నారు. బాధితుడు మోహన్‌కృష్ణ తరుపున ఆయన సోదరుడు హరికృష్ణ హాజరవుతున్నాడు. హరికృష్ణ హైదరాబాద్ కొండాపూర్‌లోని వైట్‌ఫీల్డ్ కాలనీలో ఉంటున్నాడు. అక్కడే ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నాడు. కోర్టులో సోమవారం ఈ కేసు విచారణ జరిగింది. నాగరాజుకుమార్ కేసుతో సంబంధంలేని ఆరుగురిని వెంటబెట్టుకుని కోర్టుకు వచ్చాడు. మోహన్‌కృష్ణను చంపినట్టుగానే తనను చంపుతామని బెదిరించారని హరికృష్ణ సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కోర్టు ప్రాంగణానికి నాగరాజుకుమార్ వెంట ఉన్న వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని నాగరాజుకుమార్ తరపున న్యాయవాది కిలారు బెనర్జీ న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉన్నందున కొంతమందిని వెంట పెట్టుకుంటున్నాడని ఆయన చెబుతున్నారు. వాళ్లే తనను చంపుతానని బెదిరిస్తున్నారని హరికృష్ణ ఆరోపిస్తున్నాడు.

కొద్దిరోజుల క్రితం

సరిగ్గా కొద్దిరోజుల క్రితం ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద ఇలాంటి ఘటనే జరిగింది. గన్నవరంలో టీడీపీ కార్యాలయం ధ్వంసానికి సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు టీడీపీ వారిపైనా కేసులు నమోదు చేశారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తనపై ఉన్న కేసుల విచారణకు సంబంధించి ఈ కోర్టుకు హాజరయ్యారు. టీడీపీ నేతలు తమపై నమోదు చేసిన కేసుల విచారణకు వచ్చారు. నరసింహారావు అనే నాయకుడు తన డ్రైవర్‌తో కారులో నుంచి మంచినీళ్లు రప్పించుకున్నాడు. అతడు రెండు, మూడుసార్లు తిరిగేసరికి వంశీ అనుచరులు అతడ్ని పట్టుకుని ఈడ్చుకెళ్లారు. ఫోన్ లాక్కుకున్నారు. దీనిపై నరసింహారావు సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.

మహిళ హత్య కేసులో కొత్త కోణం!

- 8లో..



దుర్గగుడిలో ఉగాది కార్యక్రమాల ఏర్పాట్లపై ఈవోతో మాట్లాడుతున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ

నేటి నుంచి దుర్గగుడిలో పుష్పార్చనలు

వన్‌టౌన్, ఏప్రిల్ 8 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఉగాది వేడుకలకు సిద్ధమైంది. చైత్రమాసం సందర్భంగా వసంత నవరాత్రోత్సవాలు, ప్రత్యేక పుష్పార్చనలు, వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేసింది. కొండపైన చిన్న రాజగోపురం వద్ద, లక్ష్మీగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పుష్పార్చనలు నిర్వహించనున్నారు. అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పుష్పార్చన నిర్వహించనున్నారు. పుష్పార్చనలో పాల్గొనే భక్తులు రూ.2,500 రుసుం చెల్లించి పాల్గొనాల్సి ఉంది. వసంత నవరాత్రుల అనంతరం వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సమయంలో గంగా, పార్వతి, మల్లేశ్వరస్వామివార్లను రోజుకొక వాహనంపై ఊరేగించనున్నారు. ఈనెల 16వ తేదీ క్షేత్రపాలక ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు జరగనున్నాయి. 17వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. 18వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతితో వసంత నవరాత్రోత్సవాలు ముగియనున్నాయి. ఉగాది సందర్భంగా దేవస్థానం బస్సుల్లో భక్తులు ఉచితంగా ఈ ఒక్కరోజు ప్రయాణించేందుకు అనుమతించారు. రైల్వేస్టేషన్, బస్సుస్టేషన్, దుర్గాఘాట్, పున్నమి ఘాట్‌ల నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉండనున్నాయి.

నేడు ఉగాది కవి సమ్మేళనం

క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు ఈవో రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపథం వేదికపై కవి పండితులు ప్రకృతి, పరమేశ్వరి, వసంతం, రుతువుల గమనం తదితరాలను వివరిస్తారన్నారు. కవి సమ్మేళనం తెలుగువారి సొత్తు అని, కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

● క్రోధినామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో ప్రత్యేక పుష్పార్చనలు, కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం తదితరాలు జరుగుతాయి. వేకువజామున అమ్మవారి స్నపన కార్యక్రమం, 9 గంటలనుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనపై ఈవోతో దేవదాయ కమిషనర్ చర్చించారు. చినరాజగోపురం ఎదురుగా చైత్రమాస వసంతనవరాత్రులలో ప్రత్యేక పుష్పార్చనలు జరగనున్న దృష్ట్యా చలువపందిర్లు వేశారు. మామిడి ఆకులు, అరటి పిలకలతో అలంకరించారు.

● క్రోధి నామ సంవత్సర ఉగాది, వసంత నవరాత్రులపై ధర్మపథం వేదికపై సోమవారం ఒంగోలుకు చెందిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు క్రోధి నామ సంవత్సర ఉగాది, వసంత నవరాత్రులపై ప్రసంగం చేశారు.

● ఆలయంలో విశేష చండీహోమం

పాల్గుణ బహుళ అమావాస్య (శోభకృత్ నామ సంవత్సర చివరిరోజు) సందర్భంగా ఆలయంలో విశేష చండీహోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం మల్లేశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ చక్రనవవారణార్చన, లక్ష కుంకుమార్చన తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి కిరణ్మయిని సత్కరిస్తున్న హెచ్‌ఎం శేషసాయి కుమార్

కూచిపూడి జడ్పీ పాఠశాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

కూచిపూడి, ఏప్రిల్ 8 : ఏపీ హైకోర్టు న్యాయమూర్తి మండవ కిరణ్మయి సోమవారం సాయంత్రం కూచిపూడిలో తాను విద్యనభ్యసించిన శ్రీ సిద్దేంద్ర జడ్పీ పాఠశాలను సందర్శించారు. ఆమె స్వగ్రామమైన బార్లపూడి గ్రామానికి వెళుతూ మార్గమధ్యలో పాఠశాలను, పక్కనే ఉన్న సిద్దేంద్ర కళాపీఠాన్ని సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శేషసాయికుమార్ న్యాయమూర్తిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కళాపీఠం ప్రిన్సిపాల్ వేదాంతం రామలింగశాస్త్రిని కూచిపూడి నాట్యానికి సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కూచిపూడి కళాకారుల చిత్రపటాలను పరిశీలించారు. పలువురు నాట్య అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

మచిలీపట్నం టౌన్ : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్మలా, లేడీయాంప్థిల్ పాఠశాలల్లో జరుగుతున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా 40 ఏళ్లుగా జవాబుపత్రాలను మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయురాలు అడ్డాల నాగమణిని డీఈవో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు, లలితామోహన్, మోమిన్, రాణి తదితరులు పాల్గొన్నారు. కాగా గత ఏడాది టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌లో గణితం, సైన్సు, సోషల్ జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు ఇంకా పారితోషికాలు అందలేదు.



సక్కుబాయి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నెట్టెం, వసంత కృష్ణప్రసాద్‌లు

శ్రీరాం తాతయ్యకు మాతృవియోగం

» నెట్టెం, కేశినేని చిన్ని, వసంత తదితరుల నివాళి

జగ్గయ్యపేట, ఏప్రిల్ 5 : జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే, జాతీయ తెలుగు దేశం కోశాధికారి శ్రీరాం తాతయ్య మాతృమూర్తి సక్కుబాయి (90) ఆదివారం రాత్రి విష్ణుసాయిజ్యం పొందారు. ఆమె గతకొద్ది రోజులగా విజయవాడలోని రమేశ్ హస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఆరుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. శ్రీరాం సక్కుబాయి పార్థివదేహానికి సోమవారం స్థానికులతో పాటు నియోజక వర్గంలోని పలు గ్రామాల టీడీపీ కార్యకర్తలు, నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు భారీగా తరలివచ్చి నివాళి అర్పించారు. విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), మైలవరం, నందిగామ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థులు వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, పారిశ్రామిక వేత్త కోగంటిబాబు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్ దంపతులు, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, జైభారత్ భీంరావ్ పార్టీ జగ్గయ్యపేట అభ్యర్థి కరిశె మధు తదితరులు నివాళులు అర్పించారు. శ్రీరాం తాతయ్యను నారా లోకేశ్ ఫోన్‌లో పరామర్శించారు. సక్కుబాయి మృతికి ప్రగాఢ సానుభూతిని తెల్పిపారు.

ప్రత్తిపాటి శరత్ కేసు సీఐడీ కోర్టుకు..

విజయవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ కేసును విజయవాడ ఒకటో సీఎంఎం కోర్టు నుంచి మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు (సీఐడీ కోర్టు)కు బదిలీ చేస్తూ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు సోమవారం ఆదేశాలిచ్చింది. జీఎస్టీ ఎగవేతతో పాటు నకిలీ ఇన్వాయిస్‌లు, బిల్లులతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కాజేశారని మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ ఒకటో సీఎంఎం కోర్టులో జరుగుతుండగా, సీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు ఇచ్చారు. కేసును సీఐడీ కోర్టుకు బదిలీ చేయాలని ప్రభుత్వం తరఫున న్యాయవాదులు పిటిషన్ వేయగా, సీఐడీ కోర్టుకు సంబంధం లేదని శరత్ తరఫున న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఒకటో సీఎంఎం కోర్టు ఈ పిటిషన్లను మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేసింది. వాటిని విచారించిన కోర్టు మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు కేసును బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది.

ఓటుహక్కు వినియోగించుకోండి

» స్వీప్ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు

» ఆధార్, గుర్తింపు కార్డులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

» పోస్టల్ బ్యాలెట్‌కు ప్రతిపాదనలు పంపండి



ట్రాన్స్‌జెండర్ ఓటర్లను జాగృతం చేసే కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

కృష్ణలంక, ఏప్రిల్ 8 : ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. మే 13న ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండర్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఐవీ ప్యాలెస్‌లో సోమవారం డీఆర్‌డీఏ, విజయవాడ నగరపాలక సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఓటు వివరాలు తెలుసుకొనేందుకు, ఓటు లేకుంటే ఫారం-6 ద్వారా వెంటనే ఓటు నమోదు చేసుకొనేందుకు, వేరే చోట ఉంటే ఫారం-8 ద్వారా బదిలీ చేసుకొనేందుకు, వయసు, కుల ధృవీకరణ, ఆధార్, ట్రాన్స్‌జెండర్ గుర్తింపు కార్డు తదితరాల సేవలు పొందేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, విజయవాడ ఆర్డీవో బీహెచ్.భవానీశంకర్, డీసీపీ అధిరాజ్ సింగ్‌రాణా, అదనపు డీసీపీ, ఇన్‌చార్జి డీసీపీ (అడ్మిన్) ఎం.కృష్ణమూర్తినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా జిల్లాలో ప్రత్యేకంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, డీఆర్‌డీఏ, విజయవాడ నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఓటు వుందా, లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడంతో పాటు ఓటు లేకుంటే కొత్తగా నమోదుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా ట్రాన్స్‌జెండర్‌లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్డీవో బీహెచ్.భవానీశంకర్ మాట్లాడుతూ, ఓటు హక్కును గొప్ప బాధ్యతగా గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మోహన్‌బాబు, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కార్యకలాపాలు సజావుగా..

కృష్ణలంక : ఎన్నికలు స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమని, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కార్యకలాపాలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు సమాచార, పౌరసంబంధాలశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోషల్ మీడియా సెల్ కార్యకలాపాలను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. రాజకీయ ప్రకటనలకు ఇచ్చే సర్టిఫికేషన్, వివిధ మాధ్యమాల్లో ప్రచురితమైన, ప్రసారమైన వార్తలు, కథనాలపై వచ్చే ఫిర్యాదుల పరిశీలన, పరిష్కారం తదితరాలకు సంబంధించి కమిటీ చేపడుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. సమాచార, పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్ తదితరులున్నారు.

22వ తేదీలోగా పోస్టల్ బ్యాలెట్‌కు ప్రతిపాదనలు పంపాలి

కృష్ణలంక : సాధారణ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణపై నోడల్ అధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పెషల్ ఓటర్లు, సర్వీస్ ఓటర్లు, ఓటర్స్ ఆన్ ఎలక్షన్ డ్యూటీ, ఎలక్టోర్స్ సబ్జెక్టు టూ ప్రివెంటివ్ డిటెన్షన్, నోటిఫైడ్ ఓటర్స్ ఇంక్లూడింగ్ అబ్సెంటీస్ ఓటర్స్ ఎక్స్‌ఎన్షియల్ సర్వీసెస్ (ఏవీఈఎస్), ఐదు కేటగిరీలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఈనెల 22వ తేదీలోగా సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్ అవసరాల ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లాలో వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకొన్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్, డ్వామా పీడీ జె.సునీత తదితరులతో కలిసి హాజరయ్యారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఉపాధి పనులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహరరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తిరువూరు, గంపలగూడెం ప్రాంతాలతో పాటు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకొన్నట్టు తెలిపారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకొన్నామన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

» ఎన్నికల అధికారుల శిక్షణా కార్యక్రమంలో

కృష్ణా కలెక్టర్ బాలాజీ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలులో సోమవారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సాంకేతికంగా ఎలా పనిచేస్తాయనే అంశంపై అధికారులకు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులంతా పారదర్శకంగా పనిచేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులకు, ప్రిసైడింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని సెక్టోరల్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాల్సి ఉందన్నారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కే చంద్రశేఖరరావు, నియోజకవర్గాల ఆర్వోలు,సెక్టోరల్ అధికారులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీ కలెక్టర్ పరిశీలన

కృష్ణా వర్సిటీలో స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాటు చేయాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం జేసీ గీతాంజలి శర్మ, ఇతర అధికారులతో కలిసి ఆయన అసెంబ్లీసెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలించారు. ఈవీఎంల తరలింపుకోసం వాహనాల ఏర్పాటు, యూనివర్సిటీ వద్ద వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ ప్రాంగణంలో అవసరమైన విద్యుత్‌లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. కనీస వసతులు కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పూర్తిస్థాయిలో తాగునీటి చెరువులను నింపుతాం



కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని కృత్తివెన్ను బంటుమిల్లి, పెడన మండలాల్లోని శివారు ప్రాంతాల్లోని అన్ని తాగునీటి చెరువులను నింపేందుకు ప్రత్యేక ప్రణాళికను తయారు చేశామన్నారు. రైవస్‌కాలువకు ప్రకాశంబ్యారేజీ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, అవి 72 కిలోమీటర్ల దూరంలోని శివారు ప్రాంతాలకు మంగళవారం ఉదయానికి చేరతాయన్నారు. కాలువలకు విడుదల చేసిన నీరు వేరే అవసరాలకు వినియోగించకుండా నీటిపారుదల, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిఘా పెట్టామని తెలిపారు. చేపలచెరువులకు ఈ నీటిని తరలించకుండా అన్నిజాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రైవేటు బోర్లనుంచి నీటిని వాటర్‌ట్యాంకర్లలో నింపి ప్రజలకు తాగునీటిని అందించేందుకు తగు ఏర్పాట్లుచేసినట్లు వివరించారు.

నమ్ముకున్న వారిని అమ్ముకునే వ్యక్తి కేశినేని నాని

» ఎన్నికల పర్యటనలో కేశినేని శివనాథ్ ఎద్దేవా



పూర్ణానందంపేట టిఫిన్ సెంటర్‌లో దోసె వేస్తున్న పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 8 : కేశినేని నాని అంటే నమ్మకం కాదని అమ్మకం అని, నమ్ముకున్న వారిని అమ్ముకునే వ్యక్తి నాని అని విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 35వ డివిజన్‌లో సోమవారం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ఇంటింటి ప్రచార, పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. ముందుగా పూర్ణానందం పేట, ఏలూరు లాకుల వద్ద దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచార పాదయాత్రలో స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ, స్థానికుల సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సుజనాచౌదరి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెజ్జోనిపేట ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో కొత్త కోణం!



» తొమ్మిది రోజులుగా జాడలేని బూసి పాప?

తోట్లవల్లూరు, ఏప్రిల్ 8 : తోట్లవల్లూరు శివారు కలాస్‌మాలపల్లి(అంబేడ్కర్ నగర్) వద్ద ఈ నెల 5న చెరకు తోటలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బూసి పాప(65) అదృశ్యమైనట్టు కుమార్తె నాగలక్ష్మి ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు కావటంతో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. కలాస్‌మాలపల్లిలో బూసి పాప అదృశ్యం చర్చకు దారితీస్తోంది. గ్రామంలోని వ్యక్తి తనను పలుమార్లు కొట్టినట్టు సుమారు మూడు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదుతో పాటు మచిలీపట్నం స్పందనలో కలెక్టర్‌కు కూడా బూసి పాప ఫిర్యాదు చేయటం జరిగింది. దాంతో ఈమెకు ఆ వ్యక్తితో శతృత్వం ఏర్పడిందని చర్చ నడుస్తోంది. రూ 2 లక్షల నగదు ఓ బంధువుకి ఇవ్వగా డబ్బు కోసం వత్తిడి తెస్తున్నట్టు సమాచారం. పాపకు కుమార్తె నాగలక్ష్మి ఉండగా ఆమె కులాంతర వివాహం చేసుకుని తోట్లవల్లూరులో నివసిస్తోంది. తల్లితో పెద్దగా సంబంధాలు లేకపోవటంతో పాప భిక్షాటన చేసుకుని జీవిస్తున్నదని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఏప్రిల్‌లో పింఛన్ తీసుకోకపోవటంతో సచివాలయ సిబ్బంది ద్వారా బూసి పాప అదశ్యం వెలుగు చూసింది. ఇదిలా ఉండగా చెరకు తోటలో గుర్తు తెలియని మహిళ మృతిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఐదు రోజులు కావస్తున్నా జిల్లాలో ఎవ్వరు పోలీసుల వద్దకు రాకపోవటం గమనార్హం. దీంతో బూసి పాప అదృశ్యం విష్టరీని చేధించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రమేశ్

వైసీపీ శవ రాజకీయాలకు బుద్ధి చెప్పండి

» కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ పిలుపు



వైసీపీ కార్యకర్తలను పార్టీలో చేర్చుకుంటున్న రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 8 : శవ రాజకీయాలు చేస్తున్న వైసీపీ నేతలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని మాజీమంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం బందరుకోట, వైఎఆర్‌కాలనీల్లో రవీంద్ర, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణలు ఇంటింటికీ పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు 'సూపర్‌సిక్స్' పథకాలను వివరించారు. బందరుకోటలో పలువురు వైసీపీ కార్యకర్తలకు రవీంద్ర టీడీపీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, అనారోగ్యం వల్ల మృతి చెందిన పెన్షనర్లు పింఛన్ కోసం ఎండలో వచ్చి వడదెబ్బతో మృతి చెందారని, అందుకు టీడీపీ నేతలు బాధ్యులని పేర్ని కిట్టు శవరాజకీయాలు చేస్తున్నారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, అంజి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీకి పోతిన మహేశ్ గుడ్‌బై

» పవన్ అన్యాయం చేశారంటూ ధ్వజం



వన్‌టౌన్, ఏప్రిల్ 8 : జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేశ్ సోమవారం పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్టు అధినేత పవన్ కల్యాణ్‌కు లేఖ పంపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పవన్‌ను నమ్మి అద్భుతం జరుగుతుందని ఆశించి భంగపడినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ లాంటి వ్యక్తితో నడిచినందుకు అసహ్యం వేస్తోందంటూ మండిపడ్డారు. వీరమహిళలు, క్యాడర్, పార్టీ నిర్మాణం గురించి పవన్ ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో ఆయనే చెప్పాలన్నారు. కార్యకర్తల కన్నీటి కష్టాల పునాదులపైన పార్టీ పెట్టి, అందమైన భవంతులు నిర్మించుకున్నారని ఆరోపించారు. తెనాలిలో విలేకరుల సమావేశం పెట్టి వివరాలు వెల్లడిస్తానన్నారు. ఇప్పటి వరకు మూడు జెండాలు మోసానని, తన ఇష్టమొచ్చిన జెండా పట్టుకుంటానని తేల్చిచెప్పారు. పోతిన వెంట పలు డివిజన్ల బాధ్యులు రాజీనామాలు చేశారు.

కూటమికి మద్దతు ఇచ్చి ఆశీర్వదించండి

» గుడ్లవల్లేరులో పర్యటించిన రాము, రావి



గుడ్లవల్లేరు, ఏప్రిల్ 8 : ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని, తమ ప్రభుత్వం ఏర్పడగానే నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరులో ఎన్టీఆర్ బృందావన్ కాలనీ నుంచి 'బాబు ష్యూరిటీ, భవిషత్ గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా టీచర్స్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, చంద్రన్న కాలనీ, జగనన్న కాలనీ, నీలకంఠేశ్వర పురంలలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం రాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, జంగం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అసంతృప్త నేతలతో మండలి భేటీ

అవనిగడ్డ, ఏప్రిల్ 8 : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పార్టీలోని అసంతృప్త నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన న్యాయవాది రాయపూడి వేణుగోపాలరావు తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సోమవారం బుద్ధప్రసాద్ రాయపూడి వేణుగోపాలరావును కలిసి తాను జనసేన పార్టీలోకి రావటానికి దారి తీసిన పరిస్థితులు వివరించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్‌తో కలిసి వేణుగోపాల్‌ను కలిసిన బుద్ధప్రసాద్ ఆయన మద్దతు కూడగట్టారు. టిక్కెట్ ఆశించి, దక్కని పలువురు నేతలతోనూ బుద్ధప్రసాద్ ఫోన్‌లో మాట్లాడి రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తనకు మద్దతునివ్వాలని కోరారు.

బ్యాంకులో ఘరానా మోసం!

» వృద్ధురాలి నుంచి రూ.50 వేలు తస్కరణ

అవనిగడ్డ, ఏప్రిల్ 8 : బ్యాంక్‌లో తీసుకున్న గోల్డ్ లోన్ రద్దయిందని, నగదు జమ చేయాలని ఘరానా మోసగాడు వృద్ధ మహిళ నుంచి రూ.50 వేలు తస్కరించి ఉడాయించిన ఘటన స్థానికంగా కలకలం రేకెత్తించింది. రామచంద్రపురం శివారు వలందపాలెం గ్రామానికి చెందిన వాకా కృష్ణకుమారి మనుమరాలితో కలిసి గోల్డ్‌లోన్‌కు సంబంధించిన మొత్తాన్ని జమ చేసేందుకు సోమవారం బ్యాంక్‌కు వచ్చింది. అదే సమయంలో బ్యాంక్‌కి వచ్చిన అగంతకుడు తాను బ్యాంక్ ఉద్యోగినని నమ్మబలికి, వారు తీసుకున్న 70 వేల రుణం రద్దయిందని, ముందుగా రూ.50 వేలు చెల్లిస్తే రెండు నెలల్లో ఖాతాకు జమ అవుతుందని నమ్మబలికాడు. రూ.50 వేలకు ఓచర్ రాసి, సంతకం చేసి స్టాంప్ వేసి మహిళకు స్లిప్ ఇచ్చి ఉడాయించాడు. మహిళను మోసగించిన అగంతకుని కదలికలు సీసీ కెమెరాలో రికార్డు కావటంతో బ్యాంక్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ ఎస్ఐ రమేష్ అగంతకుడు కారులో వచ్చి వెళ్లినట్టు గుర్తించి వాహనాన్ని కనిపెట్టే నిమగ్నమయ్యారు. భర్త, మనుమరాలితో కలిసి వలందపాలెంలో ఉంటూ ఉపాధి పనులు, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ కూడబెట్టిన రూ.50 వేల మొత్తం మోసానికి గురికావటంతో కృష్ణకుమారి, లక్ష్మిలు కన్నీరు మున్నీరయ్యారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ఫార్మసీ కళాశాల విద్యార్థి ప్రతిభ



మొగల్రాజపురం, ఏప్రిల్ 8: ఫార్మసీ విద్యార్థులు పరిశోధన రంగంపై దృష్టి పెట్టాలని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. నరసరావు పేట ఎంఎం రెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాలలో నూతన ఔషధ ఆవిష్కరణ అనే అంశంపై జరిగిన రాష్ట్ర సాయి సదస్సులో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల నాల్గవ సంవత్సరం ఫార్మా డి విద్యార్థిని ఆలపర్తి భావన ద్వితీయ స్థానం సాధించినందుకు సోమవారం కళాశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. సదస్సులో పాల్గొన్న విద్యార్థితో పాటు పర్యవేక్షకురాలు డాక్టర్ ఎన్. కనకదుర్గాదేవిని అభినందించారు.

వైసీపీ అభూత కల్పనలను తిప్పికొట్టాలి

టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీల సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 8 : వైసీపీ నాయకుల అభూత కల్పనలను సమర్థవంతంగా కూటమి శ్రేణులు తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. అశోక్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయ కమిటీల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారని, వారి కుయుక్తులను విచ్ఛిన్నం చేస్తామన్నారు. ఈ సమావేశం ద్వారా వైసీపీ తెలియపరుస్తున్నామన్నారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ తూర్పులో వైసీపీ ఎటువంటి కుట్రలు పన్నినా గద్దె రామ్మోహన్ విజయం నల్లేరుపై నడకేనన్నారు. బీజేపీ నాయకుడు పోత ంశెట్టి



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన వేల కోట్ల రూపాయల నిధులను జగన్ తన సొంతానికి వాడేసుకున్నారని ఆరోపించారు. పలువురు కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రంజాన్ మాసాన్ని ఉత్సాహంగా జరుపుకోవాలి

గుణదల: స్థానిక సున్నపు బట్టీల సెంటర్‌లోని ఏ ఉమర్ మసీద్‌లో మైనార్టీ నాయకులు షేక్ షరీఫ్ సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 700మందికి ఇఫ్తార్ విందును పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లలో గద్దె, బొప్పన భవకుమార్లు పాల్గొన్నారు. సలామ్, నవాబ్ జాని, ఎస్.ఫిరోజ్, మహ్మద్ రిజ్వాన్, యూనిష్, మహ్మద్ షకీలా, నందిపాటి దేవానంద్, బషీర్, షేక్ కరీమ్, ఎండి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

జనశిక్షణా సంస్థాన్‌లో 14 నుంచి శిక్షణా తరగతులు

మొగల్రాజపురం, ఏప్రిల్ 8: జనశిక్షణా సంస్థాన్‌లో నిరుద్యోగులకు స్వయం ఉపాధికి సంబంధించి పలు రకాల శిక్షణా తరగతులను ఈ నెల 14 నుంచి మే 2 వరకు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా చెప్పారు. సోమవారం కార్యాలయంలో శిక్షణా తరగతులకు సంబంధించి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి గ్రూపులో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్ మెహందీ, డెకరేటివ్ ఆర్టికల్స్, రెండో గ్రూపులో వాషింగ్ మెషిన్ లిక్విడ్ డిటర్జెంట్స్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటం మేకింగ్, చాక్లెట్ మేకింగ్, నాచురల్ హెయిర్ ఆయిల్ షాంపూ మేకింగ్ కోర్సులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థాన్ కార్యాలయంలో ఈ నెల 14లోగా పేర్లు నమోదు చేసుకోవాలని, 0866- 2470420 నెంబరులో సంప్రదించవచ్చని,



కరపత్రాలను విడుదల చేస్తున్న నాగళ్ల విద్యాఖన్నా తదితరులు

రిజిస్ట్రేషన్ ఫీజు వంద రూపాయలు చెల్లించాలని చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్ డి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధిపై కార్పొరేటర్ మాట్లాడడం హాస్యాస్పదం

రాణిగారితోట, ఏప్రిల్ 8: రెండు సార్లు గెలిచి మూడోసారి హ్యాట్రిక్ కొట్టబోతున్న గద్దె రామ్మోహన్‌పై కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి స్థాయి మరచి విమర్శలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అని 17,18 డివిజన్ల టీడీపీ అధ్యక్షులు రాయిరంగమ్మ, వేముల దుర్గారావులు అన్నారు. 17వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై కార్పొరేటర్ మాట్లాడడం హాస్యాస్పదం అని, అయన కార్పొరేటర్‌గా గెలిచి కేవలం మూడ సంవత్సరాలు మాత్రమేనని ఆయనకేం తెలుసని స్థాయి మరిచి మాట్లాడుతున్నాడని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రామిరెడ్డి సిద్ధమైతే తాము సిద్ధం అని అన్నారు. స్థాయి మరచి విమర్శలు చేస్తే తగిన విధంగా సమాధానం చెబుతామని అన్నారు. మునిపోలిపల్లి, ఆదిబాబు, పీరుబాబు, వెంకటరమణ, కుమారి పాలొన్నారు.



శ్రీనగర్‌కాలనీలో బాబూరావు పర్యటన

సత్యనారాయణపురం, ఏప్రిల్ 8 : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజల ఉసురు పోసుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 31వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో సోమవారం ఆ పార్టీ నేతలు పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

‘గద్దె’ చేసిన అభివృద్ధి కనబడుతుంది

పటమట, ఏప్రిల్ 8 : టీడీపీ ప్రభుత్వ హయాంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి పనులు చేశారని, ఆయన చేసిన ప్రతి అభివృద్ధి పని కళ్లకు కనబడుతుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ ఆమె సోమవారం రాత్రి 9వ డివిజన్‌లో పర్యటించారు. తూర్పులో రూ.2356 కోట్లతో అనేక పనులను గద్దె చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, వై. దేవేంద్ర, ఏ.శ్రీదేవి, ఓంకార్, రామకృష్ణలు పాల్గొన్నారు. ● ప్రజా శ్రేయస్సు కోసం జరిగే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను,ఎంపీగా కేశినేని శివనాథ్‌లను అఖండ మెజారిటీతో గెలిపించాలని గద్దె క్రాంతికుమార్ కోరారు. 11వ డివిజన్‌లో పటమట హైస్కూల్ రోడ్డులోని నారాయణస్వామి టీస్టాల్ వద్ద నుంచి ప్రారంభించి రామినేని నగర్ ఏరియాల్లో గద్దె క్రాంతి కుమార్ ప్రచారం చేశారు. కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, పాలడుగు దుర్గాప్రసాద్, నాగమణి, రాఘవేంద్రాలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ

గద్దె అనురాధ

రాణిగారితోట: జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ 17వ డివిజన్ పరిధిలో కేశినేని శ్రీదేవితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు ఇస్తామని సంతకాలు తీసుకున్న జగన్ ఆ ఇళ్లను తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు ఓట్లు వేసి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను కూడా అత్యధిక మోజారిటీతో గెలిపించాలని కోరారు. రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, కుమారి పాల్గొన్నారు.

గుణదల: ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దె క్రాంతి కుమార్ స్థానిక 2వ డివిజన్ మసీదు రోడ్డులో కొండపైగాన సోమవారం పర్యటించారు. గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని చెప్పారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణ ప్రసాద్, దోమకొండ రవి, పడాల గంగాధర్, తాడి బాబూరావు, రమణ బ్రదర్స్, పేరేపి ఈశ్వర్, ఎలిశల సురేష్ బాబు, ఎం.నాగేషు, వై.రాజా, నాగుల్‌మీరా, జి.జేమ్స్, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పటమటలో క్లస్టర్-5 బీసీ సదస్సు

పటమట, ఏప్రిల్ 8 : స్థానిక పటమటలోని మాజీ కార్పొరేటర్ వీరంకి డాంగే కుమారి ఇంటి వద్ద సోమవారం సాయంత్రం క్లస్టర్ -5 బీసీ సదస్సు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీశ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు గురించి చర్చించారు. బీసీ సెల్ నాయకులు వీరంకి గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, యల్లబాబులు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ పాదయాత్ర

గవర్నర్‌పేట, ఏప్రిల్ 8: 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ పరిధిలోని బకింగ్‌హాంపేట పోస్టాఫీసు సెంటర్ నుంచి రాజగోపాలాచారి వీధి మీదుగా టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బోండా ఉమామహేశ్వరరావు తనయుడు బోండా రవితేజ కార్యక్రమంలో పాల్గొని వ్యాపారస్తులను, స్థానికులను కలుస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగారావు, టీడీపీ, జనసేన నేతలు శ్రీనివాస్, ప్రవీణ్, హేమంత్ జైన్, భరత్ జైన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సంపద సృష్టించడమే తెలుసు : బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 8 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్రంలో సంపద సృష్టించి ఆదాయాన్ని ప్రజలకు అందజేయడమే తెలుసు అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ● 64వ డివిజన్ కండ్రికలో తూర్పు కాపు ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు.

గుణదల: స్థానిక 26వ డివిజన్ పరిధిలోని పోతినేని వారి వీధిలో బొండా సుజాత సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), బొండా ఉమాలకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకోవాలని కోరారు. 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, మాజీ కార్పొరేటర్ కంచర్ల నాగేషారాణి, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, కారంపూడి సత్య, కడియం ప్రకాష్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కినేని అఖిల్ జన్మదిన వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న సర్వేశ్వరరావు తదితరులు

ధర్నాచౌక్, ఏప్రిల్ 8: ప్రముఖ తెలుగు సినీనటుడు అక్కినేని అఖిల్ 30వ పుట్టినరోజు వేడుకలు సోమవారం నగరంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని శ్రీ కామాక్షి కార్యాలయంలో ఎన్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక నిర్మల్‌భవన్ అనాథ ఆశ్రమంలో వృద్ధులు, పేదలకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆయన అభిమానులు టి.శేఖర్, కే.ప్రభాకర్, ఎస్‌కే బాషా, ఏ.చిన్ని, శివమణి, జి.గణేష్, కే.ప్రకాష్, భాస్కర్, నాగరాజు, ఈడి.రాజు, వై.నాగరాజు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం, ఏప్రిల్ 8: సిద్ధార్థ నగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల వార్షికోత్సవం సోమవారం సున్నబట్టీల సెంటర్‌లో ఉన్న అమ్మ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపాల్ సుధాప్రవీణ ముక్తేవి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ఆధునిక సంప్రదాయ నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

లబ్బీపేట, ఏప్రిల్ 8: సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా విద్యార్థి కవి సమ్మేళనం, సంస్కృతి, సంప్రదాయం, సంస్కారం అనే అంశంగా పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ, అసెంబ్లీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గవర్నమెంట్ చీఫ్ విప్ డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ సనాతన ధర్మంపై వచ్చే విమర్శలను హిందువులు ఎందుకు తిప్పికొట్టలేక పోతున్నారని, జర్మన్, జపాన్, చైనా దేశాల్లో ప్రాచీన భారతీయ వ్రాతప్రతులను దాచుకుంటున్నారని, అది హిందూధర్మంలో ఉన్న గొప్పతనం అని అన్నారు. అనంతరం పుసకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ళ నారాయణ, గుమ్మా సాంబశివరావు తదితరులు పాలొన్నారు.



ఇండియా కూటమిని గెలిపించండి

● సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

భవానీపురం, ఏప్రిల్ 8 : వైసీపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు కోరారు. స్థానిక 41వ డివిజన్ దర్గా ప్రాంతంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కోటేశ్వరరావు వివరించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యుడు మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావులు పాల్గొన్నారు.

దూండీపై దాడిని ఖండించిన చిన్ని

వన్‌టౌన్, ఏప్రిల్ 8: విజయవాడలో ఆదివారం టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాకేష్‌పై జరిగిన దాడిని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్రంగా ఖండించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. ఆర్యవైశ్య నాయకులపై దాడులు చేయడం తగదన్నారు. మరో 30 రోజుల్లో ప్రజలు తమ ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని నేలమట్టం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

నీతి, నిజాయితీలకు నిలువుటద్దం తమ్మిన పోతరాజు

వన్‌టౌన్, ఏప్రిల్ 8: తమ్మిన పోతరాజు నీతి, నిజాయితీలకు నిలువుటద్దమని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. వన్‌టౌన్‌లోని లెనిన్ భవన్‌లో కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతలలో ఒకరైన తమ్మిన పోతరాజు 42వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోతరాజు చేసిన సేవలను కొనియాడారు. పోతరాజు స్ఫూర్తితో పనిచేసే కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి జి.కోటేశ్వరరావును రానున్న ఎన్నికలలో పశ్చిమ నుంచి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు ఇంకా పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు



తమ్మిన పోతరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు తదితరులు

ఉగాది పచ్చడిలోని షడ్రుచుల్లో ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వేసవి నుంచి రక్షణ కల్పించే ఆ ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

ఉగాది స్పెషల్

పచ్చడిలో ప్రయోజనాలు





ఆధునిక వైద్య శాస్త్రం విటమిన్లు, ఖనిజ లవణాలు మొదలైన పోషకాల తూకాన్ని బట్టి ఆహార పదార్థాల పోషక విలువను లెక్క కడుతుంది. ఆరు రుచుల సిద్ధాంతాన్ని అనుసరించే ఆయుర్వేద శాస్త్రం, షడ్రసోపేతమైన ఆహారాన్నే పోషకాహారంగా పరిగణిస్తుంది. ఈ వైద్య రహస్యాన్ని ఉగాది పచ్చడి గుర్తు చేస్తుంది. ఉగాది పచ్చడి శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాలను తొలగిస్తుందని కూడా ఆయుర్వేదం చెప్తోంది. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు శరీరాన్ని రాబోయే కాలానికి తగ్గట్టు సిద్ధం చేస్తాయి. వగరు, తీపి, చేదు, పులుపు, కారం, ఉప్పు.. ఈ ఆరు రుచులు రక్త దోషాలతో సంబంధమున్న దద్దుర్లు, అలర్జీలు, జ్వరం, ఇతర చర్మ సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి.

చేదు చేసే మేలు

ఉగాది పచ్చడిలో ఉపయోగించే వేప పూలు క్రిమిసంహారకాలు. రోగనిరోధకశక్తిని పెంచడంతో పాటు, రక్తదోషాలను కూడా హరిస్తాయి. ఉగాది పచ్చడిలో కలుపుకోవడమే కాకుండా వేప పూలతో పచ్చడి, కారప్పొడి చేసుకుని అన్నంతో పాటు తినవచ్చు. వేప పూలు 35 రకాల వ్యాధులను అరికడతాయి. వేప ఆకులు, పూలు, పండ్లు, విత్తనాలు, వేర్లు, బెరడు, జిగురుల్లో కూడా ఔషధ గుణాలుంటాయి.

తీపి లాభం

ఉగాది పచ్చడిలో ఉపయోగించే బెల్లం వల్ల కాలేయం శరీరంలోని విషాలను బయటకు నెడుతుంది. సెలీనియం, జింక్ లాంటి ఆక్సిడెంట్స్ కలిగిన బెల్లం తినడం వల్ల ఫ్రీ ర్యాడికల్ డ్యామేజ్ ఆగిపోయి, ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం ఇమ్యూనిటీని పొందుతుంది.

వగరు అవసరం

వగరుగా ఉండే మామిడి ముక్కలు పేగుల్లోని పుండ్లు, రక్తస్రావాలను అరికడతాయి. వేసవిలో వేధించే ఎండదెబ్బ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. వీటిలోని సి విటమిన్ ఎండ వేడి నుంచి చర్మాన్ని రక్షిస్తుంది.

పులుపు ప్రయోజనం

చింతపండులోని పులుపు డీహైడ్రేషన్ నుంచి కాపాడి, రక్తప్రసరణను మెరుగు పరుస్తుంది. ఛాతీలో మంట తగ్గుతుంది. పేగులను శుభ్రపరిచి, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది. రక్తనాళాలు సాగే గుణాన్ని పెంచుతుంది.

ఉప్పు ఉపయోగం

వేసవిలో లవణాలు కోల్పోవడం మూలంగా ఆవరించే నిస్సత్తువ తగ్గడం కోసం ఉప్పు ఉపయోగపడుతుంది. కీళ్ల నొప్పులను తగ్గించి, చెమటతో తగ్గిన శరీరంలోని సోడియం మోతాదులను సమం చేస్తుంది.

కారం లాభం

కారంతో స్వల్పకాలిక రుగ్మతలు, చర్మ సమస్యలు తగ్గుతాయి. కారం తినడం వల్ల శరీరం వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుకుంటుంది.

డాక్టర్ జి.వి పూర్ణచందు
ఆయుర్వేద నిపుణులు

అవగాహన

ఊబకాయ గర్భిణులు ఎంత బరువు పెరగవచ్చు?

గర్భం దాల్చిన మహిళలు బరువు పెరగక తప్పదు. గర్భిణి పెరిగే బరువును బట్టి కడుపులో పెరిగే బిడ్డ ఆరోగ్యాన్ని వైద్యులు అంచనా వేయగలుగుతారు. అయితే ముందు నుంచే ఒబేసిటీతో బాధపడే గర్భిణుల పరిస్థితి ఏంటి? వాళ్లు ఏ మేరకు బరువు పెరగవచ్చు? పెరిగే బరువుతో వాళ్ల ఆరోగ్యం మీద పడే ప్రభావమెంత?

ఒబేసిటీతో బాధపడే గర్భిణులు 5 నుంచి 9 కిలోల వరకూ, ఎత్తుకు తగిన బరువున్న గర్భిణులు 11 నుంచి 16 కిలోల వరకూ బరువు పెరగవచ్చనే ప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. అయితే 25 - 30 బిఎమ్ఐను కలిగి ఉన్న క్లాస్ 1, 2 ఒబేసిటీ కోవకు చెందిన మహిళలు ప్రస్తుత ప్రభుత్వ ప్రమాణాల కంటే తక్కువ బరువు పెరగడం వల్ల, తల్లికీ, బిడ్డకూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అలాగే క్లాస్ 3 ఒబేసిటీకి చెందిన మహిళలు సిఫార్సు చేసిన బరువు కంటే తక్కువ బరువు పెరగడం ప్రయోజనకరంగా ఉండవచ్చు. జెస్టేషనల్ డయాబెటిస్ (గర్భంతో ఉన్నప్పుడు మధుమేహం బారిన పడడం), ప్రసవం తర్వాత కూడా పెరిగిన బరువు తగ్గకపోవడం (ఎక్సెసివ్ పోస్ట్‌పార్టమ్ వెయిట్ రిటెన్షన్), మేటర్నల్ కార్డియో మెటబాలిక్ డిసీజ్, పిల్లలు నెలలు నిండకుండా పుట్టడం, పుట్టిన వెంటనే పసికందులు చనిపోవడం మొదలైన సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, గర్భంతో ఉన్నప్పుడు అవసరానికి మించి బరువు పెరగకుండా చూసుకోవాలి. ఊబకాయులైన మహిళలు గర్భం దాల్చడానికంటే ముందే వైద్యులను కలిసి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. వైద్యులు సూచించిన ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రమాణాలకు మించి బరువు పెరగకుండా చూసుకోవాలి.



మీకు తెలుసా?

ఈ బ్యాండ్ ఎయిడ్ వద్దు

బ్యాండ్ ఎయిడ్ లేని ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉండవు. అయితే మనందరం వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లనే కొంటూ ఉంటాం. కానీ వీటిలో విషపూరిత 'ఫరెవర్ రసాయనాలు' ఉంటాయి.

వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్స్‌లో అనే ఫరెవర్ కెమికల్స్ ఉంటాయి. ఇవి గాయం ద్వారా రక్తప్రవాహంలో కలిసి, పలు రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ రసాయనాలు పిల్లల ఎదుగుదల, పునరుత్పత్తులను ప్రభావితం చేయడంతో పాటు ఒబేసిటీ, పలు రకాల కేన్సర్లను కూడా కలిగిస్తాయి. మరి ఇంతటి దుష్ప్రభావాలను కలిగి ఉన్న ఫరెవర్ కెమికల్స్‌ను గాయాలను మాన్పే బ్యాండ్ ఎయిడ్ తయారీలో ఎందుకు ఉపయోగిస్తున్నారు? పిఎఫ్ఎఎస్ (పాలీఫ్లోరో ఆల్కైల్ సబ్‌స్టెన్సెస్) ఇది సింథటిక్ కెమికల్. నీటికి తడవవు, వేడికి చెక్కుచెదరవు, నూనె, జిడ్డుల్లాంటివి వీటికి అంటుకోవు. కాబట్టే ఈ రసాయనాన్ని బ్యాండ్ ఎయిడ్స్‌తో పాటు జిగురును కలిగి ఉండే అథెసివ్స్, నాన్‌స్టిక్ వంట పాత్రలు, ఫుడ్ ప్యాకేజింగ్స్‌లో విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఫరెవర్ కెమికల్స్ (శాశ్వత రసాయనాలు)కు ఆ పేరు రావడానికి కారణం, ఇవి ఎప్పటికీ క్షీణించకపోవడమే! కాబట్టే ఇవి శరీరంలోకి చేరుకున్న తర్వాత ఎన్నో ఏళ్ల పాటు అక్కడే ఉండిపోతాయి. ఇవి గాయాల ద్వారా, స్పర్శ ద్వారా శరీరంలోకి చేరుకుని ఆరోగ్యకరమైన కణజాలాల్లో తిష్ట వేసుకుని అంతర్గత అవయవాలకు హాని కలిగిస్తాయి. కాబట్టి వాటర్ ప్రూఫ్ బ్యాండ్ ఎయిడ్‌లు, నాన్‌స్టిక్ కుక్‌వేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్ వాడకం మానేయాలి.





డయాబెటిస్

మధుమేహులు తీపి తినొచ్చా?

బొబ్బట్లు, పూర్ణాలు, పొంగలి, పాయసం... ఉగాది పిండివంటలు నోరూరిస్తుంటే మనసు చంపుకుని, నోరు కట్టేసుకోవడం ఎవరికైనా కష్టమే! మరి మధుమేహుల సంగతేంటి? తీపి జోలికి వెళ్లకుండా ఉండవలసిందేనా? అవసరం లేదంటున్నారు వైద్యులు. స్వీట్స్ తిన్నా, షుగర్ పెరగకుండా ఉండడం కోసం ఏం చేయాలో, 'డయాబెటిక్ నర్వ్ డ్యామేజ్'కు గురి కాకుండా ఉండాలంటే ఎలా నడుచుకోవాలో వైద్యులు చెప్తున్నారు.

మధుమేహులు పండుగలు, వేడుకల్లాంటి సందర్భాల్లో పరిమితంగా తీపి తినొచ్చు. అయితే ఏం తిన్నాం అనే దాని కంటే ఎంత తిన్నాం? అనేది గమనించుకోవాలి. తినే తీపి విషయంలో పరిమితి పాటించాలి. ఒక స్వీటుతో సరిపెట్టేసుకుంటే ఫర్వాలేదు. ఒక స్వీటుతో తినడం ఆపలేని వాళ్లు స్వీట్లకు దూరంగా ఉండడమే మేలు. అలాగే కొందరు మధుమేహులు 'నచ్చినన్ని స్వీట్లు తినేసి, ఒకటికి రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే సరిపోతుందిలే!' అనుకుంటూ ఉంటారు. కానీ ఇది సరి కాదు. చక్కెర మాత్రలు దీర్ఘ సమయం పాటు ప్రభావాన్ని చూపుతాయి. మధ్యాహ్నం భోజనంలో స్వీట్లు తినేసి, రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే రాత్రికి లేదా మరుసటి రోజు ఉదయానికీ శరీరంలో చక్కెర మోతాదులు పడిపోవచ్చు. కాబట్టి ఒకటికి రెండు మాత్రలు తీసుకోవడం సరి కాదు. ఎప్పటి మాదిరిగానే మందులు వేసుకోవాలి. అలాగే స్వీట్ తిన్నా చక్కెర నియంత్రణలో ఉండడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. స్వీటు తిన్నప్పుడు మిగతా ఆహారంలో కోత విధించడం, అదనంగా మరొక 15 నిమిషాలు నడవడం లేదా వ్యాయామం చేయడం చేయాలి.



పిల్లల ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇలా...

టైప్1 డయాబెటిస్ పిల్లల విషయంలో వాళ్లు స్వీటు తినేటప్పుడు, తిన్న గంటన్నర తర్వాత చక్కెరను పరీక్షించాలి. ఒకవేళ రక్తంలో చక్కెర పెరిగినట్టు కనిపిస్తే, అవసరాన్ని బట్టి ర్యాపిడ్ ఇన్సులిన్ రెండు నుంచి నాలుగు యూనిట్లు ఇవ్వాలి. అయితే ఇలా ఇన్సులిన్ కరెక్షన్ చేసే సమయంలో, అప్పటివరకూ పిల్లలు తిన్న పిండిపదార్థాల మోతాదును అంచనా వేయవలసి ఉంటుంది. ఇలా పిల్లల ఆహారపుటలవాట్లను కచ్చితంగా లెక్కించే తల్లితండ్రులు, వాళ్ల కార్బోహైడ్రేట్ల మోతాదును అంచనా వేసి, తిన్న స్వీటు ఆధారంగా పిల్లలకు ఇవ్వవలసిన ఇన్సులిన్ మోతాదును లెక్కించి ఇంజెక్షన్ ఇవ్వవచ్చు. అయితే అలాగని పిల్లలు తరచూ స్వీట్లు తినడానికి వీల్లేదు. అరుదుగా మాత్రమే ఇలా ర్యాపిడ్ ఇన్సులిన్ ఇంజెక్షన్ మీద ఆధారపడాలి.

వ్యాయామం అవసరం!

- అరగంట తగ్గకుండా, ఆపకుండా నడవాలి.
- యోగా, ఏరోబిక్స్, స్కిప్పింగ్, స్ట్రెచెస్, యాబ్స్, పుషప్స్, క్రంచెస్, లైట్ వెయిట్స్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- గదులు శుభ్రం చేయడం, తోట పని, పుస్తకాల అల్మారా సర్దడం లాంటి ఇంటిని శుభ్రపరిచే పనులు కూడా వ్యాయామ ఫలాన్నే అందిస్తాయి.
- శరీర బరువు అదుపులో ఉంచుకోవడం కోసం తాజా పళ్లు, కూరగాయలతో పక్కా ఆహార ప్రణాళిక తయారుచేసుకుని, అనుసరించాలి.
- గ్లైసెమిక్ ఇండెక్స్, క్యాలరీలు, పిండిపదార్థాలు, ఆహార పరిమాణాలు సరిచూసుకుంటూ పోషకాల లోపం ఏర్పడకుండా చూసుకోవాలి.
- ఇంట్లో చిరుతిళ్లు లేకుండా చూసుకోవాలి.

నాడులు దెబ్బతింటే...

దీర్ఘకాలంగా మధుమేహం కలిగి ఉన్న వాళ్లు, క్రమం తప్పకుండా షుగర్ మందులు వాడుకుంటున్నప్పటికీ, వాళ్లలో ఎంతో కొంత నాడీ నష్టం జరుగుతూ ఉంటుంది. పాదాలు, అర చేతుల్లో సూదులతో గుచ్చినట్టు, మండుతున్నట్టు అనిపిస్తే, డయాబెటిక్ నర్వ్ పెయిన్‌గా అనుమానించాలి. దెబ్బతిన్న నాడులకు రక్త సరఫరా మందగించడం మూలంగా ఆయా అవయవాల్లో నొప్పి వేధించడం మొదలుపెడుతుంది. దాంతో చిన్నపాటి పనులు కూడా చేయలేని దుస్థితి నెలకొంటుంది. ఆ పరిస్థితే... న్యూరోపతీ లేదా పెరిఫెరల్ నర్వ్ డ్యామేజ్. 60 నుంచి 70 శాతం మధుమేహుల్లో న్యూరోపతీ ఉంటున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజ్ గణాంకాలు చెప్తున్నాయి. దీర్ఘకాలం పాటు అత్యధిక చక్కెర మోతాదులను కలిగి ఉన్న మధుమేహుల్లో న్యూరోపతీ, నాడి నొప్పితో మొదలవుతుంది. కొందర్లో అంతర్గతంగా న్యూరోపతీ ఉన్నప్పటికీ లక్షణాలు కనిపించకపోవచ్చు. మరికొందర్లో నొప్పి మూలంగా కదల్లేని పరిస్థితి కూడా కనిపించవచ్చు.

ఈ లక్షణాల మీద కన్నేసి...

న్యూరోపతీ లక్షణాలు మధుమేహులందర్లో ఒకేలా ఉంటాయి. కానీ ఎక్కువ శాతం మంది ప్రారంభంలో ఆ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ సమస్య ముదిరి, అవయవం పాడైపోకుండా ఉండాలంటే లక్షణాలను మొదట్లోనే కనిపెట్టాలి.

- **మొద్దుబారడం:** నాడీ నొప్పి మొదలయ్యే ముందు ఆ ప్రదేశం మొద్దుబారుతుంది. నడిచేటప్పుడు పాదాల స్పర్శను కోల్పోతారు. పాదాలకు సాక్సు వేసుకుని నడుస్తున్నట్టు అనిపించవచ్చు. పాదాల్లో, అరచేతుల్లో తిమ్మిర్లు, మంట ఉండవచ్చు.
- **నొప్పి:** అకస్మాత్తుగా కరెంటు షాకు తగిలినట్టు అనిపించడం, తీవ్రమైన నొప్పి వేధించడం కూడా న్యూరోపతీ లక్షణాలే! కొన్నిసార్లు చేతుల్లోని వస్తువులు తెలియకుండా కింద పడిపోతూ ఉంటాయి. ఇలా పట్టు కోల్పోవడం కూడా న్యూరోపతీ లక్షణమే!
- **బ్యాలెన్స్ తప్పడం:** నేరుగా నడవలేకపోవడం, నడిచేటప్పుడు అడుగులు తడబడి, బ్యాలెన్స్ తప్పడం నర్వ్ డ్యామేజీ లక్షణాలు.
- **వేడి, చల్లదనం:** అతి వేడి, అతి చల్లదనాలను తట్టుకోలేకపోవడం. కాఫీ కప్పు నొప్పి కలిగించేటంత వేడిగా అనిపించవచ్చు. చల్లని చేతులతో ఎవరైనా తాకితే, ఆ చల్లదనం బాధను కలిగించవచ్చు.
- **పుండ్లు:** పాదాల్లో పుండ్లు ఏర్పడవచ్చు. లేదా దెబ్బ తగిలినప్పుడు ఆ ప్రదేశంలో నాడీ నష్టం వల్ల స్పర్శ తగ్గడం మూలంగా గాయం తీవ్రతను కనిపెట్టలేకపోవచ్చు.

నాడులు ఎందుకు దెబ్బతింటాయి?

అత్యధిక చక్కెర మోతాదులు నాడులను దెబ్బతీస్తాయి. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, నాడుల ఇన్‌ఫ్లమేషన్.. వీటి వల్ల కూడా నాడులు దెబ్బతినవచ్చు. ఈ సమస్యలకు తోడు మందుల వాడకం క్రమం తప్పడం, సరిపడా మోతాదు మందులను వాడుకోకపోవడం, అస్తవ్యస్త జీవనశైలి, దురలవాట్లు నర్వ్ డ్యామేజ్‌ను రెట్టింపు చేస్తాయి.

నియంత్రణ ఇలా...

మధుమేహులు క్రమం తప్పకుండా చక్కెరను పరీక్షించుకుంటూ, మందుల మోతాదుపరంగా వైద్యుల సూచనలను అనుసరిస్తూ ఉండాలి. ఆహార నియమాలను తప్పక అనుసరించాలి. వ్యాయామం చేయడంతో పాటు, పాదాలకు ఆర్థోపెడిక్ షూస్ లేదా చెప్పులు ధరించాలి. విటమిన్ బి12 సరిపడా అందేలా చూసుకోవాలి. పాదాల్లో ఏర్పడే గాయాలు, పుండ్ల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

ఆహార నియమాలు!

మధుమేహులు అపరిమిత ఆహారం తీసుకోవడానికి వీలు లేదు. కాబట్టి ఈ కోవకు చెందిన వారు తక్కువ పరిమాణంలోనే అన్ని పోషకాలు అందే సంపూర్ణ, సమతులాహారం తీసుకోవాలి. ఇందుకోసం...

- రోజుకు మూడు పూటలూ, మూడు భారీ భోజనాలకు బదులుగా తక్కువ పరిమాణాల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి.
- తాజా పళ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండే పదార్థాలు (కూరగాయలు, గోధుమలు, చిరుధాన్యాలు) తీసుకోవాలి.
- వేపుళ్లు వీలైనంత తగ్గించాలి.
- చక్కెర, శీతలపానీయాలు, తేనె, బెల్లం తీసుకోవడం తగ్గించాలి.
- ఆహారంలో మాంసకృత్తుల పరిమాణం పెంచాలి. పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వాడకం పెంచాలి. మాంసాహారం పూర్తిగా ఉడకనివ్వాలి.

డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్
అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్
ఎండోక్రైన్ క్లినిక్,
టోలిచౌకి, హైదరాబాద్.



కృత్రిమ రంగులు

మంచూరియా తింటున్నారా?

కృత్రిమ రంగులు ఆరోగ్యానికి హానికరం అనే విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టే కృత్రిమ రంగు 'రోడమైన్ బి' వాడకాన్ని కర్నాటక ప్రభుత్వం నిషేధించింది. కాటన్ క్యాండీలు, గోబీ, చికెన్ మంచూరియాల్లో ఉపయోగించే ఈ హానికారక రంగు గురించిన మరిన్ని వివరాలివి.

రసాయనిక పదార్థం రోడమైన్ బి అనే సింథటిక్ రంగును సిల్క్, జూట్, లెదర్, కాటన్, ఊలు, చిల్లీ పౌడర్ (కారం), చిల్లీ ఆయిల్, సౌందర్యసాధనాలకు రంగును జోడించడం కోసం ఉపయోగిస్తారు. ప్లాస్టిక్ పరిశ్రమల్లో కూడా దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తూ ఉంటారు. దీని ధర కూడా తక్కువ కాబట్టి పదార్థాలకు ఆకర్షణీయమైన రంగును తెప్పించడం కోసం కలరింగ్ ఏజెంట్‌గా దీన్ని ఉంటారు.

ఎంత హానికరం?

ఈ కృత్రిమ రంగుతో కళ్లు, చర్మ సమస్యలు, శ్వాసకోస సమస్యలు కలుగుతాయి. దీన్లో కేన్సర్ కారకాలు కూడా ఉన్నాయి. 2011 ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) ప్రమాణాలను అందుకున్న కృత్రిమ రంగులనే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అలా అనుమతి పొందిన కృత్రిమ రంగులు ఏవంటే...

ఎరుపు: పాంకో 4ఆర్ (కార్మోసీన్, ఎరిత్రోసిన్)
పసుపు: టార్ట్రాజీన్, సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సిఎఫ్
నీలం: ఇండిగో కార్మిన్, బ్రిలియంట్ బ్లూ ఎఫ్‌సిఎఫ్
ఆకుపచ్చ: ఫాస్ట్ గ్రీన్ ఎఫ్‌సిఎఫ్

కల్తీ ఇలా కనిపెట్టాలి

ప్రభుత్వ అనుమతి పొందిన సురక్షిత రంగులకు బదులుగా, నిషేధం విధించిన హానికారక రోడమీన్ బితో కల్తీ చేసిన పదార్థాలను కొన్ని చిట్కాల ద్వారా గుర్తుపట్టవచ్చు. అదెలాగంటే...



కారం: రెండు గ్రాముల కారాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో వేసి, 5 మి.లీ ఎసిటోన్ (ఇది మెడికల్ షాపుల్లో కూడా దొరుకుతుంది. నెయిల్ పాలిష్ రిమూవర్ కూడా వాడుకోవచ్చు) కలపాలి. తర్వాత ఎసిటోన్ లేయర్ ఎరుపు రంగులోకి మారితే, కారంలో రోడమీన్ బి ఉందని అర్థం.

చిలకడదుంపలు: దూదిని నీళ్లలో లేదా వంట నూనెలో ముంచి, చిలకడదుంపల మీద రుద్దాలి. దూది ఎరుపు లేదా వంకాయ రంగులోకి మారితే దుంపలకు రోడమీన్ బి కలిపారని అర్థం.

కూల్ ఫుడ్స్

చల్లబడదాం!



వేసవి వేడి ప్రభావం ఆరోగ్యాన్ని దెబ్బ తీయకుండా ఉండాలంటే ఈ కాలంలో కొన్ని పదార్థాలను ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. అవేంటంటే...

పుచ్చ: నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చ పళ్లలో వేసవి వేడిమి నుంచి శరీరానికి రక్షణ కల్పించే సూక్ష్మ పోషకాలుంటాయి. కాబట్టి వేసవిలో ఈ పండు తరచూ తింటూ ఉండాలి.

నెయ్యి: నెయ్యి కీళ్లను ల్యూబ్రికేట్ చేసి, నొప్పులను అరికడుతుంది. వేసవిలో హైడ్రేషన్ మూలంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండడం కోసం, చర్మం పొడిబారిపోకుండా ఉండడం కోసం నెయ్యిని ఆహారంలో చేర్చుకోవాలి.

నిమ్మ: నిమ్మకాయల్లోని సి విటమిన్ శరీరం అలసటకు గురి కాకుండా నియంత్రించి శరీరాన్ని చల్లబరుస్తుంది. కాబట్టి వంటల్లో నిమ్మరసం ఎక్కువగా వాడుకోవాలి. తాగే నీళ్లలో కూడా నిమ్మరసం కలుపుకుంటూ ఉండాలి.

కొత్తిమీర: జీర్ణశక్తిని మెరుగుపరిచి శరీరాన్ని చల్లబరిచే శక్తి కొత్తిమీరకు ఉంటుంది. కాబట్టి వేసవిలో కొత్తిమీర ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి.

కొబ్బరి: కొబ్బరి నీళ్లకూ, లేత కొబ్బరికీ శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది. కాబట్టి వేసవిలో లేత కొబ్బరి తినాలి. కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hMxfSPZలో చదవండి.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి

మూడు తరాలకు సరిపడా అప్పు!

- ఒక్కొక్క తలపై రూ.2 లక్షల భారం
- దుర్మార్గపు జగన్‌ను గద్దె దించడానికే కూటమి: పురందేశ్వరి

కొవ్వూరు, ఏప్రిల్ 8: రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా దుర్మార్గుడైన ముఖ్యమంత్రి జగన్‌ను గద్దె దింపడానికే మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై దృష్టిపెడితే రూ.12.5 లక్షల కోట్లు అప్పు ఉంది. మూడు తరాలకు సరిపడా అప్పు ఇది. ప్రతి ఒక్కరి తల మీద రూ.2 లక్షలు అప్పు భారం ఉంది. దీనిని ఎవరు భరించాలి? ఏది కనబడితే అది తనఖా పెట్టి అప్పు తీసుకువచ్చి ఆ భారాన్ని ఈ దుర్మార్గపు ముఖ్యమంత్రి జగన్ మనపై పెడతున్నారు. చివరకు సచివాలయం కూడా తనఖా పెట్టి రూ.350 కోట్లు అప్పు తెచ్చారంటే దీనిని మనం క్షమించగలమా? అంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా? తలలేని మొండెం లాగా రాజధాని లేని రాష్ట్రంలా చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిది కదా? దుర్మార్గుడైన జగన్‌ను గద్దె దించాలంటే ఈ కూటమి అనివార్యం అని భావించి ఒక్కటయ్యాం" అని పురందేశ్వరి అన్నారు.

శవరాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి: అచ్చెన్న

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి శవ రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కోరారు. పింఛన్‌దారుల పట్ల జగన్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తూ, దర్శిలో పింఛన్‌దారులతో డ్రామా ఆడి, అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. రాబోయే చంద్రబాబు ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచే రూ.4 వేల పింఛన్ ఇంటి వద్దే ఇస్తుందని సోమవారం స్పష్టం చేశారు. 'ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం చెప్పినా, జగన్ సర్కార్ వృద్ధుల్ని, దివ్యాంగుల్ని సచివాలయాల చుట్టూ తిప్పింది. ఎన్నికల లబ్ధి కోసం జగన్‌రెడ్డే శవ రాజకీయాలు చేస్తున్నాడు. వైసీపీ ప్రభుత్వం ఇక రాదని తెలిసి, వలంటీర్లతో రాజీనామా చేయించడం, ర్యాలీలు చేయించడం, వృద్ధులను తిప్పడం వంటివి చేస్తున్నారు' అని మండిపడ్డారు.

షర్మిల ఏ నొప్పితో అలా మాట్లాడుతున్నారో: బొత్స

విశాఖపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'షర్మిల ఏ నొప్పితో అలా మాట్లాడుతున్నారో ఎవరికి తెలుసు. ఏ నొప్పీ లేకుండా ఎవరూ అమ్మా... అని అనరుగా' అని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. జగన్‌పై షర్మిల విమర్శల గురించి కొంతమంది విలేకరులు ప్రస్తావించగా ఆయన పైవిధంగా స్పందించారు. విశాఖలోని వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో కేవలం ప్రొవైడర్‌గానే ఉండిపోయారని, అందుకే తిరిగి అధికారంలోకి రారంటూ ప్రశాంత్‌కిశోర్ చెప్పడంపై మంత్రి బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'అసలు ఏం మాట్లాడుతున్నారో ప్రశాంత్ కిశోర్‌కు అర్థమవుతోందా?, ఆ భాష ఏమిటి?' అని మంత్రి మండిపడ్డారు.

చంద్రబాబును కలిసిన జగన్నాథం ప్రవీణ్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో పని చేస్తున్న మెప్మా, సెర్ప్, జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేయాలని కోరగా, చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

వైసీపీకి శమంతకమణి రాజీనామా

శింగనమల, ఏప్రిల్ 8: మాజీ మంత్రి శమంతకమణి వైసీపీకి సోమవారం రాజీనామా చేశారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ టికెట్‌ను శమంతకమణి కుమారుడు అశోక్ ఆశించారు. కానీ ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు టికెట్ దక్కింది. దీంతో శమంతకమణి కుటుంబం.. పార్టీని వీడాలని నిర్ణయించుకుంది.

పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు!!

ప్రజలను బెదిరించి ఓట్లు వేయించుకునే ఎత్తుగడ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎలాగైనా మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు సీఎం జగన్ రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఎన్నికల కమిషన్ కాదని పక్కనబెట్టిన వలంటీర్లనే అస్త్రాలుగా మలుచుకునేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీకి అనుకూలంగా లేకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామంటూ ఇన్నాళ్లూ వారి ద్వారానే లబ్ధిదారులను బెదిరించారు. ఇప్పుడు పోలింగ్ రోజున ఏకంగా పోలింగ్ కేంద్రాల్లోనే వారిని హెచ్చరించి ఓట్లు దండుకునే ఎత్తువేశారు. వలంటీర్లను వైసీపీ తరఫున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోబెట్టాలని నిర్ణయించారు. కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశించడం.. అధికార పార్టీతో అంటకాగుతున్న వారిని తొలగిస్తుండడం.. మరోవైపు పలు సర్వేలన్నీ జగన్ మళ్లీ అధికారంలోకి రారని తేల్చేస్తుండడం.. తన బస్సుయాత్రకు పెద్దగా ప్రజాస్పందన లేకపోవడం వంటి పరిణామాలతో తాజా పథకం వేశారు. అయితే, వలంటీర్లుగా సేవలందిస్తూ వైసీపీ తరఫున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోడానికి నిబంధనలు అంగీకరించవు. ఈ నేపథ్యంలో వారితో రాజీనామా చేయించి ఏజెంట్లుగా కూర్చోబెడితే అడిగేవారు ఉండరని ఆయన భావిస్తున్నారు. వాస్తవానికి.. వలంటీర్లకు విధులను అప్పగించినప్పుడే పోలింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్న ఆలోచన ఆయనకు ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. అందుకే సంక్షేమ పథకాలన్నీ ఉద్యోగులు, అధికారుల ద్వారా కాకుండా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు చేరేలా ప్రణాళిక రూపొందించారు. సామాజిక పింఛన్లు, ఇళ్లు, రేషన్ కార్డుల వంటి సేవలను వలంటీర్ల ద్వారా పంపిణీ చేసేలా భారీ స్కెచ్ వేశారు. విద్యాదీవెన, విద్యా కానుక, రైతు భరోసా, వాహన మిత్ర, మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ, కాపు నేస్తం వంటి నగదు బదిలీ పథకాలన్నీ ఎవరెవరికి అందుతున్నాయో డేటా మొత్తం వలంటీర్ల చేతుల్లో పెట్టారు. ఈ పథకాలన్నీ జగనన్న పంపాడంటూ వారు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ప్రచారం సాగిస్తున్నారు. ప్రతి 50 గడపలకు ఒక వలంటీర్‌ను నియమించారు. ఈ యాభై గడపల్లోని కుటుంబాల చరిత్రంతా వలంటీర్ల గుప్పిట్లో ఉండేలా భారీ వ్యూహాన్ని అమలు చేశారు. ప్రతి నెలా పింఛన్లు ఇవ్వడం సహా.. గ్రామంలో ఏ పనికావాలన్నా వారిదే బాధ్యత. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న గీతను దాదాపు చెరిపివేశారు.

జనం భయం భయం..

వలంటీర్ల వ్యవస్థ ఎంతగా చొచ్చుకుపోయిందంటే.. తాము ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టినా వారికి తెలిసిపోతుందని జనం భయపడేదాకా వచ్చింది. ఇప్పుడు వారినే పోలింగ్ ఏజెంట్లుగా పెడితే వైసీపీకి ఓటేసేవారెవరో.. ప్రత్యర్థి పార్టీకి మీట నొక్కేదెవరో వలంటీర్ గుర్తించేస్తారని జగన్ భావించారు. వలంటీర్ కనుసైగను దాటి గ్రామంలో ఎవరూ మరో పార్టీకి ఓటేసే పరిస్థితే ఉండదనుకున్నారు. కానీ విపక్షాలు ఫిర్యాదు చేయడంతో వలంటీర్లపై ఈసీ కొరడా ఝళిపించింది. వారి ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీని అడ్డుకుంది. అయితే వలంటీరు వ్యవస్థ లేకపోతే.. పింఛనుదారులకు అవస్థలుంటాయని.. ఒకటో తేదీనే పెన్షన్ అందదన్న అపోహలను సృష్టించేందుకు జగన్ పెద్ద వ్యూహాన్నే పన్నారు. సామాజిక పెన్షన్ల పంపిణీకి నిధులు విడుదల చేయలేదు. పింఛన్లను ఇంటికే తీసుకెళ్లి ఇవ్వాలని ఈసీ ఆదేశించినా.. జరుగనివ్వలేదు. సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలని ఆదేశాలిప్పించారు. ఖజానాలో నిధులు లేకపోవడంతో 4వ తేదీ వచ్చినా పింఛన్లు పంపిణీ చేయలేదు. దీంతో వృద్ధుల్లో ఆందోళన నెలకొంది. అనారోగ్యంగా ఉన్న వృద్ధులను మంచాలపై సచివాలయాలకు తరలిస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఇదంతా జగన్ ప్రభుత్వ దుర్మార్గంలో భాగమని ప్రజలకూ అర్థమైంది. దీంతో జగన్ రూటు మార్చారు. వారిని బెదిరించైనా ఓట్లు వేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. వలంటీర్లతో మాత్రమే అది సాధ్యమనుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారిని గుర్తించి అక్కడే భయపెట్టి ఓట్లు వేయించుకునేలా పథకం సిద్ధంచేశారు. వలంటీర్లతో రాజీనామా చేయించి.. బూత్ ఏజెంట్లుగా నియమించాలని నిర్ణయించారు. డేటా మొత్తం వారి చేతుల్లో ఉంటుంది కాబట్టి.. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లను బెదిరించడానికి ఆస్కారం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ కేడర్ కంటే సొంత సైన్యంపైనే నమ్మకం ఉంచారని అంటున్నాయి.

అవును.. నేనింతే!

జగన్ అడ్డగోలు మాటలు.. వైసీపీ బరితెగింపు రాతలు

- ఈసీ తప్పుబట్టిన అంశాలపైనే మళ్లీ పోస్టులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగనే కాదు ఆయన పార్టీ వైసీపీ సోషల్ మీడియా కూడా ఎన్నికల సంఘం ఆదేశాలను లెక్క చేయడం లేదు. ఈసీ ఆదేశాలను ధిక్కరిస్తూ మరింత రెచ్చిపోతున్నారు. ఈసీ చేయొద్దన్న పనినే మళ్లీ చేస్తున్నారు. సీఎం జగన్ హద్దులు మీరి ప్రతిపక్ష నేత చంద్రబాబు గురించి మాట్లాడుతున్నారని ఈసీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. వైసీపీ కూడా హద్దులు దాటి సోషల్‌మీడియాలో ప్రతిపక్ష నేతపై సామాజిక దాడికి తెగించిందని ఈసీ నిర్ధారించింది. సోషల్ మీడియాలో చంద్రబాబుపై పెట్టిన పోస్టింగ్‌లను 48 గంటల్లోగా తొలగించాలని వైసీపీని ఆదేశించింది. అలాగే తన మాటలపై వివరణ ఇవ్వాలని జగన్‌నూ ఆదేశించింది. ముఖ్యమంత్రి జగన్ ఈసీ నోటీసులను చాలా తేలికగా తీసుకున్నారు. అటు తన మాటలతో, ఇటు సోషల్ మీడియా పోస్టుల్లో మరింతగా చెలరేగిపోయారు. 'చంద్రబాబును శాడిస్ట్ అనకుండా ఇంకా ఏమంటారు? బాబు అండ్ గ్యాంగ్ మొత్తాన్ని శాడిస్టులు అనకుండా ఇంకా ఏమంటారు?' అంటూ సోషల్‌మీడియా వేదికగా ఈసీకి సవాల్ విసిరారు. వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతా (ట్విటర్) నుంచి ఈసీ తప్పుపట్టిన అంశాలను తొలగించకపోగా వాటినే మరింతగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఇంకా రెచ్చిపోయి చంద్రబాబును తీవ్రంగా విమర్శిస్తూ నేరుగా సీఎం పేరిటే పోస్టింగ్‌లు పెట్టారు. ఇది దేనికి సంకేతం? ఈసీ నోటీసులు ఇచ్చినా జగన్ స్పందన ఇలాగేనా? తానింతే మారేదే లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండని ఈసీకి సవాల్ చేసినట్లా? అని రాజకీయ, అధికారవర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

జగన్ మార్క్ రాజకీయం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత జగన్, ఆయన పార్టీతో పాటు ప్రతీ రాజకీయ పార్టీ ఈసీ మార్గదర్శకాలను పాటించి తీరాల్సిందే. కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే అధికారం రాజ్యాంగ వ్యవస్థ అయిన ఈసీకి ఉంటుంది. ఈసీ నుంచి నోటీసులు రాకూడదని నేతలు, పార్టీలు కోరుకుంటాయి. అయితే జగన్, ఆయన పార్టీ కోడ్ వచ్చిన తర్వాత ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘించారంటూ నోటీసులు అందుకున్నారు. ఏపీ చరిత్రలో కోడ్ ఉల్లంఘించారంటూ ఈసీ నుంచి నోటీసులు అందుకున్న తొలి ముఖ్యమంత్రి జగనే కావడం విశేషం. ఈసీ నోటీసులకు సమాధానం ఇచ్చి తాము హుందాగా ఉన్నామని నిరూపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదే. ఆ పనిచేయకుండా ఉదయం నోటీసు తీసుకొని, సాయంత్రానికే ఈసీ వద్దన్న పనులు చేయడం జగన్‌కే చెల్లింది. ఉద్దేశపూర్వకంగానే ఈసీని ఢీ కొట్టాలని, తద్వారా రాజ్యాంగ వ్యవస్థను కూడా తాను లెక్కచేయననే గట్టి సంకేతాలు పంపాలన్నది జగన్ ఉద్దేశంలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే వ్యక్తిగతంగా జగన్‌కు, పార్టీ పరంగా వైసీపీకి వచ్చిన కోడ్ ఉల్లంఘన నోటీసులను లైట్‌గా తీసుకున్నారని అంటున్నారు.

వ్యవస్థలపైనే దాడి... రాజ్యాంగ వ్యవస్థలు సైతం తన దారిలో నడవాల్సిందేనని జగన్ కోరుకుంటారు. అందుకు భిన్నంగా అవి వ్యవహరిస్తే వాటిని ఢీకొట్టడం ఆయనకు అలవాటే. మూడు రాజధానుల విషయంలో సానుకూల తీర్మానం చేయలేదని శాసన మండలిని రద్దు చేయాలని తీర్మానించిన సంగతి తెలిసిందే. తర్వాత ఆ తీర్మానాన్ని వెనక్కి తీసుకున్నారు. కరోనా సమయంలో ఎన్నికలు నిర్వహించాల్సిందేనంటూ నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను ఢీకొట్టారు. మాట వినడం లేదంటూ ఆయన్ను మధ్యలోనే ఇంటికి పంపాలని చూశారు. మూడు రాజధానులు వద్దని హైకోర్టు చెప్పిన తర్వాత న్యాయమూర్తులు, కోర్టులను దూషిస్తూ వైసీపీ నేతలు సామాజిక మాధ్యమాల్లో అడ్డగోలు పోస్టులు పెట్టారు. దీనిపై సీబీఐ విచారణ జరుపుతోంది. న్యాయమూర్తులకు కులాలు, రాజకీయాలు అంటగడుతూ వైసీపీ నేతలు అడ్డగోలు వ్యాఖ్యానాలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా వ్యవస్థలను భయపెట్టే ప్రయత్నం చేశారు. వివేకానంద రెడ్డి హత్యకేసును విచారిస్తున్న సీబీఐ ఎస్పీ రాంసింగ్ పైనే రాష్ట్ర పోలీసులతో కేసుపెట్టించిన ఘనత ఉంది. ఇప్పుడు ఎన్నికల కమిషన్ వంతు వచ్చింది. కోడ్ ఉల్లంఘించారని జగన్‌కు, వైసీపీకి నోటీసులు ఇచ్చినా మరింత రెచ్చిపోయి మాట్లాడుతున్నారు.

మళ్లీ అనుచిత పోస్టింగ్‌లు

ఎన్నికల విధులతో పాటు పింఛన్ల పంపిణీ బాధ్యతలు వలంటీర్లకు అప్పగించరాదని ఈసీ ఆదేశించిన సంగతి తెలిసిందే. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేసే బాధ్యత సర్కారు తీసుకోవాలి. అలాకాకుండా మండువేసవిలో లబ్ధిదారులు పంచాయతీ ఆఫీసులకే వచ్చి పింఛన్ తీసుకునేలా కార్యక్రమాన్ని రసాభాసగా మార్చేసింది. అందుకు తప్పుపడితే సర్కారును, సర్కారును ముందుకు నడిపిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని అనాలి. అందుకు భిన్నంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అవ్వాతాతల పింఛన్‌లు అడ్డుకున్నారని, దుర్మార్గులని, ఇంకా కుట్రదారులంటూ వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టులు పెట్టారు. వారిద్దరినీ శాడిస్టులుగా, పేదల రక్తం తాగే దుర్మార్గులుగా అభివర్ణిస్తూ కార్టూన్‌లు, మార్ఫింగ్ ఫొటోలు తయారు చేసి పోస్టులు పెట్టారు. ఈ పోస్టులపై టీడీపీ నుంచి ఈసీకి ఫిర్యాదులు వెళ్లాయి. కోడ్‌ను ఉల్లంఘించేలా వైసీపీ పోస్టులు ఉన్నాయని ఈసీ తేల్చింది. ఇలాంటి ఫొటోలు, వ్యాఖ్యానాలు, పోస్టులు తొలగించాలంటూ ఆదివారం ఉదయం వైసీపీకి నోటీసులు ఇచ్చింది. కానీ వైసీపీ ఆ పనిచేయలేదు. 48 గంటలయినా ఎలాంటి పోస్టులు తొలగించలేదు. పైగా ఈసీ తప్పుపట్టిన అంశాలనే మరింత ప్రచారంలోకి తీసుకొచ్చి, ఆ అంశాలపై ఇతరుల అభిప్రాయాలను పోగేసి మరింతగా లైవ్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. జగన్ మళ్లీ రెచ్చిపోయి ఈసీ తప్పుపట్టిన అంశాలనే పునరావృతం చేసేలా... 'అవ్వాతాతలకు పింఛన్‌ను జగనన్న ఇంటికి పంపిస్తే చంద్రబాబు అడ్డుపడి వారి నడ్డివిరిచాడు' అని వైసీపీ తన ఎక్స్ ఖాతాలో పోస్టుచేసింది. జగన్‌ను పేదల ప్రేమికుడుగా, చంద్రబాబును దుర్మార్గుడిగా చిత్రీకరించి ఓ కార్టూన్ వీడియోను రూపొందించి అప్‌లోడ్ చేశారు. ఆ వీడియోపై వైసీపీ నేతలు అడ్డగోలు వ్యాఖ్యానాలు చేశారు. కొందరు ఉచ్చారణకు వీలు కాని పదజాలంతో చంద్రబాబును దూషిస్తూ కామెంట్లు చేశారు. తర్వాత కొద్దిసేపటికే జగన్ పేరిట వైసీపీ ఎక్స్ ఖాతాలో మరో పోస్టు అప్‌లోడ్ చేశారు. 'వలంటీర్లను కించపరిచి, నీచంగా మాట్లాడిన చంద్రబాబు అండ్ గ్యాంగ్ మొత్తాన్ని శాడిస్టులు అనకుండా ఏం అంటారు?' అని వ్యాఖ్యానం చేశారు. ఇటు జగన్, అటు వైసీపీ తమ చర్యలను సమర్థించుకోవడంతో పాటు మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యానాలు, పోస్టులు పెట్టారు.

ఈసీకి సవాలే

సీఎం అయినా ఎన్నికల ప్రవర్తనా నియమావళి విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవు. పైగా సీఎం హోదాలో జగన్ ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాజ్యాంగ వ్యవస్థలను గౌరవించాలి. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు ఈసీకి సహకరించాలి. అయితే జగన్ తీరు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రతిపక్ష నేతను అడ్డగోలు మాటలని హద్దులు మీరారని ఈసీ జగన్‌ను తప్పు పట్టింది. అందుకు ఆయన సమాధానమిచ్చుకోవాలి. కానీ ఈసీ కూడా సవాల్ చేసేలా జగన్ తీరు ఉంది. ఈసీ తప్పుపట్టిన అంశాలనే పునరావృతం చేయించారు. తన పార్టీ సోషల్ మీడియాను అలాగే నడుపుతున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో జగన్ ఏం చేశారో అందరికీ తెలిసిందే. కరోనా సమయంలో ఎన్నికలు వద్దన్నందుకు నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డనే ఇంటికి పంపించాలని విఫల ప్రయత్నాలు చేశారు. ఇప్పుడూ అవే చర్యలు పునరావృతం కాబోతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈసీ సూచనలను పాటించకుండా, ధిక్కరించడం అందులో భాగమేనని రాజకీయ వర్గాలు అంచనా.



పవన్ కల్యాణ్‌కు చెక్కు అందజేస్తున్న చిరంజీవి. పక్కన నాగేంద్రబాబు

నీ వెనుక నేనున్నా

పవన్‌కు అన్న చిరంజీవి అభయం

- పార్టీ కోసం 5 కోట్లు విరాళం
- మెగాస్టార్ ఆశీర్వాదం తీసుకున్న జనసేనాని

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'నీ వెనుక నేనున్నా' అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఆయన అన్న, ప్రముఖ హీరో చిరంజీవి అభయం ఇచ్చారు. సోమవారం ఉదయం హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్లో విశ్వంభర షూటింగ్ లొకేషన్‌కు చిరంజీవి పిలుపు మేరకు పవన్ కల్యాణ్ వెళ్లారు. పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన చిన్న అన్నయ్య, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు కూడా ఉన్నారు. ఉదయం పదిగంటలకు లొకేషన్‌కు చేరుకున్న పవన్‌ను చిరంజీవి ఆలింగనం చేసుకుని, స్వాగతం పలికారు. అనంతరం జనసేన ఎన్నికల నిర్వహణ కోసం రూ.5 కోట్లు విరాళంగా అందించారు. పవన్ చెక్కు స్వీకరిస్తూనే చిరంజీవి పాదాలకు నమస్కరించారు. ఆ సమయంలో ఆయన కొంత ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం సోదరులు ముగ్గురూ చాలా సేపు మాట్లాడుకున్నారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన విజయ భేరి సభలో పవన్ నూకాలమ్మ దీవెనలను కోరుతున్న సమయంలో ఆ దృశ్యాన్ని చిరంజీవి టీవీలో చూశారు. ఆక్షణంలోనే తన తమ్ముడికి తన ఆశీర్వాదంతో పాటు ఆర్థికంగానూ అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. సోమవారం ఉదయం పవన్‌ను తన షూటింగ్ లొకేషన్‌కు పిలుపించుకున్నారు. ఆశీర్వాదంతో పాటు రూ.5 కోట్ల చెక్కునూ అందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "స్వార్జితాన్ని సమాజం కోసం ఖర్చుపెట్టే నిస్వార్థమైన మనసున్నవాడు కల్యాణ్. తన లక్ష్యాన్ని చేరుకోవడానికి తాను ఎంత తపన పడుతున్నాడో, ఎంత శ్రమపడుతున్నాడో నాకు తెలుసు. నేను ఇచ్చే ఈ విరాళం తన లక్ష్యాన్ని చేరుకోవడంలో కొంతైనా ఉపయోగపడుతుందని భావించాను. నా తమ్ముడు ఎలాంటి సత్కార్యం తలపెట్టినా నా ఆశీస్సులు ఉంటాయి. తను వేసే ప్రతి అడుగూ విజయం దిశగానే సాగాలని కోరుకుంటూ ఈ విరాళాన్ని అందించాను" అని చిరంజీవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శివ శంకర్, కోశాధికారి ఎంవీ రత్నం, ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

హవ్వ.. ఇంత అబద్ధమా?

- పింఛన్ కింద నెలకు బాబు ఇచ్చింది 400కోట్లేనట!
- ప్రకాశం జిల్లా దర్శి సభలో జగన్ అబద్ధం
- టీడీపీ హయాంలో నెలకు 1500 కోట్ల ఖర్చు



అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నోరు తెరిస్తే అబద్ధాల ప్రవాహం.. అమాయకుల్ని నమ్మించడానికి ఉన్నవి లేనట్టుగా.. లేనివి ఉన్నట్టుగా మాట్లాడుతుంటారు.. మూడు రాజధానులు కట్టేశామని ఇటీవలే చెప్పారు.. అదే కోవలో చంద్రబాబు హయాంలో సామాజిక పెన్షన్లు నెలకు రూ.400 కోట్లు మాత్రమే ఇచ్చారని దర్శి సభలో చెప్పారు. "అప్పుడు చంద్రబాబు పింఛన్ల కోసం నెలకు రూ. 400 కోట్లు ఖర్చు పెట్టారు. ఈ రోజున మీ బిడ్డ ప్రభుత్వం నెలకు రూ. 2000 కోట్లు అవ్వాతాతల కోసం ఖర్చు పెడుతోంది" అని అన్నారు. కానీ, ఇది పచ్చి అబద్ధం. చంద్రబాబు హయాంలో సామాజిక భద్రతా పెన్షన్ల కోసం నెలకు దాదాపు రూ.1500 కోట్లు ఖర్చయ్యేది. చంద్రబాబు అధికారంలోకి రాకముందు వృద్ధులకు నెలకు రూ. 200 పెన్షన్ అందేది. ఆయన ప్రభుత్వం ఒకేసారి రూ.1000కు పెంచింది. తర్వాత రూ.2000 చేసింది. కోతలు వేయకుండా, కొర్రీలు పెట్టకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ సాయం అప్పట్లో అందింది. తాను సీఎం అయితే పెన్షన్ రూ.3,000కు పెంచుతానని జగన్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కానీ, సీఎం అయిన మొదటి ఏడాది రూపాయి కూడా పెంచలేదు. ఆ తర్వాత నాలుగేళ్ల ఏడాదికి రూ.250 చొప్పున దశలవారీగా పెంచుతూ 2024 జనవరి నుంచి రూ.3,000 పెన్షన్ అందిస్తున్నారు. జగన్ నాలుగేళ్లలో అదనంగా ఇచ్చిన పెన్షన్ దశలవారీగా రూ.1,000 మాత్రమే. మరోవైపు అర్హుల జాబితాను కుదిస్తూ వచ్చారు. దీంతో జగన్ వ్యాఖ్యలు విని అవ్వాతాతలు విస్తుపోయారు. కాగా, సోమవారం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆద్యంతం అభివాదాలతోనే సాగింది. మధ్యాహ్నం ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలంపల్లి బస వద్ద నుంచి కురిచేడు మండలం బోదనంపాడు వద్దకు చేరుకున్నారు. అక్కడ మహిళలు బస్సు ఆపి మంచినీటి సమస్యను తీర్చాలని అడిగారు. అనంతరం కురిచేడు వద్దకు రాగానే బస్సు లోపలి నుంచి అందరికీ అభివాదం చేస్తూ కదిలారు. ప్రధాన కూడలిలో అయినా జగన్ మాట్లాడతారని ఆశించారు. కానీ ఎక్కడా ఒక్క మాటా మాట్లాడకుండా ముందుకు కదిలారు.

బిల్లులు ఎప్పుడిస్తారు..

- సీఎంకు షాక్ ఇచ్చిన వైసీపీ నాయకులు

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ప్రకాశం జిల్లా దర్శి వద్ద వింత పరిస్థితి ఎదురైంది. తనను కలిసేందుకు వచ్చిన నాయకులకు ఆయన అభివాదం చేయగా... వారు తిరిగి అభివాదం చేయటం మానేసి 'మేం పనులు చేశాం. మా బిల్లులు చెల్లించండి మహాప్రభో' అంటూ వేడుకున్నారు. దీంతో సీఎంతోపాటు ఆ నాయకులను ఆయన వద్దకు తీసుకెళ్లిన దర్శి అసెంబ్లీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి కూడా బిక్కముఖం వేయాల్సి వచ్చింది. ఆదివారంజగన్ దర్శికి సమీపంలోని చలివేంద్రం వద్ద బసచేశారు. సోమవారం ఉదయం శివప్రసాదరెడ్డి ఆ నియోజకవర్గ ముఖ్య నాయకులను జగన్‌తో కలిపారు. 'మేమంతా పార్టీ కోసం కష్టపడ్డాం. అటు ప్రభుత్వానికి పేరు రావటంతోపాటు అంతో ఇంతో ఆదాయం వస్తుందని గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేశాం. సచివాలయ భవనాల కోసం సొంత నిధులు వెచ్చించాం. సంవత్సరాలు గడుస్తున్నా మా బిల్లులు రాక ఆర్థికంగా కృంగిపోయాం. ఇప్పుడు ఎన్నికలకు పనిచేయలేని స్థితిలో పడ్డాం. మా బిల్లులు మాకిప్పించండి' అని వారిని వేడుకున్నారు. సీఎం తేరుకుని.... నోటిఫికేషన్ రావడానికి ముందు... ఈ నెల 17లోపు మీ బిల్లులు క్లియర్ చేయిస్తానని హామీ ఇచ్చారు.

'సిద్ధం' కాని వినుకొండ..

వినుకొండ, ఏప్రిల్ 8 : మేమంతా సిద్ధం...జగన్ బస్సుయాత్రకు సోమవారం పల్నాడు జిల్లా వినుకొండలో జనాదరణ కరువైంది. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పలు డివైడర్లతోపాటు తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వినుకొండలో హంగామా సృష్టించినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. పట్టణంలోకి సాయంత్రం 6గంటల సమయంలో జగన్ బస్సు ప్రవేశించింది. స్థూపం సెంటర్ మీదుగా నరసరావుపేట రోడ్డు ద్వారా పట్టణం దాటడానికి కేవలం 6.30 నిమిషాలు పట్టింది. దీన్నిబట్టి ప్రజల స్పందన ఎంత పలచగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బస్సు యాత్ర సందర్భంగా వినుకొండ నుంచి ప్రకాశం జిల్లా దర్శి, కురిచేడు వెళ్లే బస్సులను నిలిపివేశారు. ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

సీఎం పర్యటనలో అపశ్రుతి

- బద్దలైన బుల్లెట్‌ప్రూఫ్ కారు అద్దం
- తాగిన మత్తులో వైసీపీ కార్యకర్త దాడి

ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని బుల్లెట్ ప్రూఫ్ కారుపై దాడిజరిగింది. దాడికి పాల్పడింది కూడా వైసీపీ కార్యకర్తే.. ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలు లోక్‌సభ పరిధిలో జగన్ బస్సుయాత్ర నిర్వహించారు. మార్గమధ్యంలో దర్శి, మార్కాపురం నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న దొనకొండ అడ్డరోడ్డు వద్ద సిద్ధం సభ నిర్వహించారు. అనంతరం తిరిగి బస్సు యాత్ర కొనసాగించారు. అయితే సభాప్రాంగణం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైన సమయంలో సీఎం కాన్వాయ్‌లోని బుల్లెట్ ప్రూఫ్ కారు అద్దంపై ఒక కార్యకర్త బలంగా గుద్దాడు. దీంతో ఆ కారు అద్దం పగుల్లిచ్చింది. ఈ సంఘటనతో పోలీస్ యంత్రాంగం బిత్తరపోయింది. దాడి జరగడం సంచలనంగా మారింది. పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టిపెట్టి దాడిచేసిన కార్యకర్త కోసం గాలించినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు పొదిలి మండలంలోని కంభాలపాడుకు చెందిన కార్యకర్త దాడికి పాల్పడినట్లు గుర్తించారు. అయితే, కారు అద్దం పగులకొట్టిన వ్యక్తిని మానసిక రోగిగా చిత్రీకరించడానికి నానా తిప్పలు పడుతున్నారు.

అసంతుష్టులకు బాబు బుజ్జగింపు

- హైదరాబాద్ పిలిపించి నేరుగా చర్చలు

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో తలెత్తిన అసంతృప్తిని టీడీపీ అధినాయకత్వం చల్లార్చింది. ఆ నియోజకవర్గాల నేతలతో పార్టీ అధినేత చంద్రబాబు నేరుగా మాట్లాడి నచ్చజెప్పి సమస్యను పరిష్కరించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఈ చర్చలు జరిగాయి. ఆ పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. అనంతపురం, గుంతకల్లు, మంత్రాలయం స్థానాలకు ఇన్‌చార్జులుగా ఉన్న నేతలను చంద్రబాబు తన నివాసానికి పిలిపించారు. అనంతపురంలోమాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి బదులు ఆయన సమీప బంధువు దగ్గుబాటి ప్రసాద్‌కు ఈసారి టికెట్ ఇచ్చారు. ఎందుకు మార్చాల్సి వచ్చిందో ఆయనకు చంద్రబాబు వివరించారు. అదే జిల్లా గుంతకల్లులో కూడా అభ్యర్థి మార్పు అసమ్మతిని రాజేసింది. వైసీపీ నుంచి వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టికెట్ ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే జితేంద్రప్ప తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయనతోనూ చంద్రబాబు మాట్లాడి పార్టీ అభ్యర్థికి మద్దతిచ్చేందుకు అంగీకరింపజేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం సీటును బీసీ వర్గాలకు చెందిన రాఘవేందర్‌కు అధినాయకత్వం కేటాయించింది. ప్రస్తుత ఇన్‌చార్జి తిక్కారెడ్డి, ఆయన వర్గీయులు కొత్త అభ్యర్థికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. తిక్కారెడ్డితో చంద్రబాబు మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనకు తప్పనిసరిగా ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారు. సంతృప్తి చెందిన తిక్కారెడ్డి పార్టీ అభ్యర్థికి మద్దతివ్వడానికి అంగీకరించారు. కాగా.. అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ సర్పంచ్‌లు, నేతలు పెద్ద సంఖ్యలో పోలు సుబ్బారెడ్డి నాయకత్వంలో చంద్రబాబు హైదరాబాద్ నివాసానికి సోమవారం తరలివెళ్లారు. ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు.



పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ

పాస్టర్లకు మంత్రి మేరుగ తాయిలాలు

- ఆత్మీయ సమావేశంలో రూ.వెయ్యి చొప్పున పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 8: వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భావిస్తున్న వైసీపీ నేతలు యథేచ్ఛగా తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ కల్యాణ మండపంలో మంత్రి మేరుగ నాగార్జున సోమవారం ప్రలోభాల పర్వాన్ని కొనసాగించారు. తాను పోటీచేస్తున్న సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని చర్చి పాస్టర్లతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఓ గంటసేపు పాస్టర్లతో మాట్లాడిన మంత్రి మేరుగ అక్కడ నుంచి వెళ్లిపోగా, ఆయన అనుచరులు ఆ తర్వాతి తంతు పూర్తి చేశారు. 'జగన్మోహన్‌రెడ్డి దేవుని బిడ్డ, ఆయన బైబిల్‌ని నమ్ముకున్నారు. ఆయనను మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత పాస్టర్లపై ఉంది' అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి పాస్టర్ వైసీపీ గెలుపు కోసం పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారికి దుస్తులు, రూ.1000 బహుమతిగా అందించారు. అయితే దీనిపై కొందరు పాస్టర్లు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఒంగోలులో జరిగిన పంపిణీల్లో రూ.5వేలు, దుస్తులు ఇవ్వగా, తమకు మాత్రం వెయ్యి మాత్రమే ఇవ్వడాన్ని విమర్శించారు.

భారీగా నగదు, బంగారం పట్టివేత

- కలపర్రు టోల్‌ప్లాజా వద్ద 16 కి. బంగారం, 30 కి. వెండి స్వాధీనం

పెదపాడు/ఆకివీడు, ఏప్రిల్ 8: ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సోమవారం నిర్వహించిన పోలీసు తనిఖీల్లో భారీగా బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నుంచి వివిధ ప్రాంతాలకు బీవీసీ లాజిస్టిక్ వాహనంలో రూ.12 కోట్ల విలువైన 16 కేజీల 528 గ్రాముల బంగారం, 30 కేజీల వెండి తరలిస్తున్నారు. దీనికి సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో వీటిని భద్రత నడుమ జాయింట్ కలెక్టర్, దెందులూరు రిటర్నింగ్ ఆఫీసర్ లావణ్య వేణి పర్యవేక్షణలో ట్రెజరీకి పంపినట్లు పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ తెలిపారు. అలాగే హనుమాన్ జంక్షన్ నుంచి ఏలూరు వెళుతున్న మరో వాహనంలో రూ.15,52,300 నగదును గుర్తించారు. అలాగే, ఎలాంటి పత్రాలు లేకుండా స్కూటీలో తీసుకువెళుతున్న రూ.12 లక్షల నగదును ఆకివీడులో ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది సోమవారం సీజ్ చేశారు.

మేనిఫెస్టోకు సలహాలు పంపండి

- ప్రజలకు టీడీపీ, జనసేన, బీజేపీ విజ్ఞప్తి
- వాట్సాప్ నంబరు 83411 30393 కేటాయింపు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి త్వరలో విడుదల చేయబోతున్న ప్రజా మేనిఫెస్టోకు ప్రజలు తమ సలహాలు, సూచనలు పంపాలని టీడీపీ, జనసేన, బీజేపీ విజ్ఞప్తి చేశాయి. దీనికోసం 83411 30393 వాట్సాప్ నంబరు కేటాయించామని, ఆసక్తి ఉన్నవారు వాట్సాప్ ద్వారా సలహాలు, సూచనలు పంపాలని ఆ పార్టీలు కోరాయి. సోమవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, సీనియర్ నేత టీడీ జనార్ధనరావు, పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం, జనసేన పార్టీ నాయకుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు లంకా దినకర్ సమావేశమయ్యారు. అనంతరం సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రం నుంచి రాక్షసుడిని తరిమికొట్టి, రాక్షస పాలన అంతం చేయడానికి మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయి. కూటమి మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలు తీర్చేలా ఉండాలి. ఉంటుంది. ఈ దిశగా ప్రజల అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలని మేం ఆశిస్తున్నాం. ప్రజలు తమ అభిప్రాయాలు పంపిస్తే అందులో ప్రాధాన్యం ఉన్నవాటిని మేనిఫెస్టోలో పొందుపరుస్తాం. మేనిఫెస్టోపై ప్రజలు తమ అభిప్రాయాలు పంచుకోవాలి' అని వర్ల రామయ్య కోరారు. రాష్ట్ర భవిష్యత్తు, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి ఏర్పడిందని జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా మేనిఫెస్టో తేవాలని నిర్ణయించామని, అందుకే ప్రజల అభిప్రాయాలు కోరుతున్నామన్నారు. బీజేపీ నేత లంకా దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తిదాకా అందించడమే కూటమి లక్ష్యమన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని, అభివృద్ధి-సంక్షేమం రెండూ ఉండేలా తమ పాలన ఉంటుందన్నారు. బకాసురుడు, నరకాసురుడు, దుర్యోధనుడు కలగలసిన జగన్ రాక్షస పాలనకు ముగింపు పలకాలని కోరారు.

జగన్‌వి హత్యా రాజకీయాలు

- నమ్మి నడిస్తే నడిరోడ్డున వదిలేశాడు
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫైర్
- వివేకాను చంపి మమ్మల్ని రోడ్లపాల్జేశారు : సునీత ఆగ్రహం





మైదుకూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభకు వచ్చిన జనం, పీసీసీ చీఫ్ షర్మిల అభివాదం

కడప, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): "ప్రజలకు మేలు చేయాలని జగన్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే హత్యా రాజకీయాలు నడిపిస్తున్నాడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా శాండ్ మాఫియా ల్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా నడుస్తున్నాయి" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచార బస్సు యాత్రలో భాగంగా దివంగత వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతతో కలిసి సోమవారం ఆమె ఉమ్మడి కడప జిల్లాలోని బ్రహ్మంగారిమఠం, దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల ఏమన్నారంటే.. 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాడు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లు నిద్రపోయి చివరకు 6 వేల ఉద్యోగాల కోసం డీఎస్సీ విడుదల చేశారు. జగన్ వైఎస్సార్ వారసుడు కానేకాదు. సొంత బాబాయిని చంపిన వారిని కాపాడుతున్నాడు. అవినాశ్ నిందితుడని సీబీఐ తేల్చింది. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అవినాశ్‌పై నేను, సునీత కలిసి అభాండాలు వేశామన్నారు. ఆయన తెగ బాధగా ఉందట. అయ్యా ఎమ్మెల్యే గారూ.. మేం నిందలు వేయలేదు. సీబీఐ చెప్పిందే చెబుతున్నాం. హత్య జరిగినప్పుడు మాకు తెలియదు. దస్తగిరి లాంటి హంతకుడిని పట్టుకుని ఆధారాలు పెడితే తప్ప మాకు అర్థం కాలేదు. సీబీఐ చెబితే తప్ప మాకు తెలియలేదు. దారుణ హత్య వెనుక కుట్రను సీబీఐ ఛేదిస్తే కానీ దానివెనుక అవినాశ్ ఉన్నాడని తెలియలేదు. సీబీఐ వెల్లడించిన ఆధారాలతోనే మాట్లాడాం. ఐదేళ్లుగా హంతకుడు అవినాశ్‌రెడ్డిని కాపాడుతూ వచ్చారు. మళ్లీ హంతకుడికి ఎంపీ సీటు ఎందుకు ఇచ్చాడో జగనే చెప్పాలి. సీబీఐ విచారణ ఎందుకు వద్దన్నారు. ఒక పక్క న్యాయం, మరో పక్క అధర్మం. ప్రజలు ఎవరిని గెలిపిస్తారో చెప్పాలి. మీ బాధ్యత నాపై వేసుకుంటా. అని షర్మిల వ్యాఖ్యానించారు. వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ.. "వివేకాను హత్య చేసి మమ్మల్ని రోడ్డుపాలు చేశారు. ఈ దారుణ హత్య ఎవరు చేశారో అందరికీ తెలుసు" అని విమర్శించారు.

అభివృద్ధి ఏదంటే..

- లిక్కర్ షాపులు చూపుతున్న జగన్

దువ్వూరులో నిర్వహించిన ప్రచార సభలో ఓ వైసీపీ నేత 'జై జగన్' అంటూ కవ్వింపు చర్యలకు దిగడంతో వైఎస్ షర్మిల ఆయనకు దీటైన సమాధానం చెప్పారు. నినాదాలు చేస్తున్న నేతను దగ్గరకు పిలిచి.. "నీకు దమ్ముంటే జగన్ ఏం చేశాడో చెప్పు" అని మైకు ఇచ్చారు. దీంతో ఆయన మైకు తీసుకుని "మీకు వ్యక్తిగతంగా కుటుంబ సమస్యలు ఉన్నాయి., మీరు తెలంగాణలో ఉంటారు. జగన్ మాకు ఉన్నాడు. చాలు" అన్నాడు. దీనికి ప్రతిగా షర్మిల మాట్లాడుతూ.. "నేను కూడా నీమాదిరి జై జగనన్న అనుకున్నా. తర్వాత తెలిసింది. అదే జగన్ చెల్లెళ్లను రోడ్డున పడేశాడు. అదే జగన్ మడమ తిప్పాడు. జగనన్నకు ఓటు వేయండి, బీజేపీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెప్పిస్తా అని చెప్పా. వచ్చిందా హోదా? ఇదే జగన్.. మద్య నిషేధం చేస్తానని చెప్పమ్మా అంటే.. అదే మాట ప్రతి చెల్లికీ చెప్పా. ఈ రోజు అదే జగన్ మద్య నిషేధం చేయలేదు. అదే జగన్ ఈ రోజు మద్యం అమ్ముతున్నాడు. అయ్యా జగన్మోహన్‌రెడ్డిగారు వాగ్దానాలన్నీ ఎక్కడ నెరవేర్చారయ్యా.. అంటే 'అవిగోమ్మా లిక్కర్ షాపులు' అని చూపిస్తున్నారు. ఇందుకేనా గెలిపించింది" అని షర్మిల నిప్పులు చెరిగారు.

అవినీతిపరులు జైలుకే!

- ఇది మోదీ గ్యారెంటీ: ప్రధాని

రాయ్‌పూర్/జగ్‌దల్‌పూర్/చంద్రాపూర్, ఏప్రిల్ 8: అవినీతిపరులను రక్షించడానికి కాంగ్రెస్, ఇతర విపక్షాలు ర్యాలీలు నిర్వహిస్తున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. తనను ఎంత బెదిరించినా.. తప్పుచేసినవారు జైలుకు వెళ్లక తప్పదని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ప్రభావిత బస్తర్ జిల్లాలో సోమవారం నిర్వహించిన 'విజయ సంకల్ప్ శంఖనాద్' సభలో, మహారాష్ట్రలోని చంద్రాపూర్ సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యానంతరం అవినీతి కాంగ్రెస్.. పేదల అవసరాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. వారి బాధలు దానికి తెలియవని చెప్పారు. ఆ పార్టీ పాలనలో అవినీతి మన దేశానికి గుర్తింపుగా మారిందన్నారు. దోపిడీ చేయడానికి తనకు లైసెన్స్ ఉందని భావిస్తోందని.. తాను వచ్చాక దానిని రద్దుచేశానని.. ప్రజలే తనకీ అధికారం ఇచ్చారని.. దీంతో విపక్ష నేతలు తనను దూషిస్తున్నారని విమర్శించారు. అయితే దేశ ప్రజలు, తల్లులు, సోదరీమణులు తనకు రక్షణ కవచంలా నిలబడ్డారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ తెచ్చిన మేనిఫెస్టోపై ముస్లింలీగ్ ముద్ర కనిపిస్తోందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్‌ను ఆయన కాకరకాయతో పోల్చారు. నేతిలో వేపినా, చక్కెరలో కలిపినా దాని రుచి మారదని చెప్పారు. దేశంలోని అన్ని సమస్యలకూ ఆ పార్టీయే మూలమని ఆరోపించారు. మతప్రాతిపదికన దేశ విభజన, కశ్మీరు సమస్య, నక్సలిజానికి దానిదే బాధ్యతని దుయ్యబట్టారు. 'అవినీతి.. పేదల హక్కులను నాశనం చేస్తుంది. 2014కి ముందు లక్షల కోట్ల విలువచేసే కుంభకోణాలకు పాల్పడ్డారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.34 లక్షల కోట్లు జమచేసింది. నాకు నా దేశమే నా కుటుంబం. అవినీతిని నిర్మూలించాలని నేను పిలుపు ఇస్తుంటే.. అవినీతిపరులను కాపాడండని విపక్షాలు అంటున్నాయి' అని ధ్వజమెత్తారు. 'ఆలయ నిర్మాణంపై కాంగ్రెస్, ఇండీ కూటమి ఆగ్రహంగా ఉన్నాయి. శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించిన కాంగ్రెస్ రాజకుటుంబం ఆలయ ప్రతిష్ఠ ఆహ్వానాన్ని తిరస్కరించింది. ఇది తప్పని చెప్పిన కాంగ్రెస్ నేతలను పార్టీ నుంచి బహిష్కరించారు. అలాగే ఆలయ ప్రతిష్ఠాపనకు వచ్చినవారిపైనా ఆరేళ్ల వేటు వేశారు' అని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.









ఉగాది శోభ

లేత మామిడాకుల తోరణాలతో.. శ్రావ్యమైన సన్నాయి రాగాలతో.. ఇంటి ముందు పచ్చని పందిళ్లతో.. ఊరంతా పండగ వాతావరణంతో ఉగాది శోభ వెల్లివిరుస్తోంది. నగరంలో ఎక్కడ చూసినా మామిడాకులు, పూత, పిందెలు, కాయలతో పాటు ఉగాది షడ్రుచుల పచ్చడికి కావలసిన అన్ని వస్తువులు కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు బారులు తీరారు. దీంతో ఆయా కూడళ్లు కొనుగోలుదారుల తో కళకళలాడాయి. నగరంలోని పూల మార్కెట్ కొనుగోలుదారులతో నిండిపోయింది.



సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

విద్యాధరపురం: సంక్షేమ పథకాలకు ఆద్యుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి యర్లగడ్డ సుచిత్ర అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో యువత డ్రగ్స్‌కు బానిసైందని ఆఖరుకు కిరణా కొట్లలోనూ గంజాయి దొరికే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ ప్రభుత్వం రాగానే మంచి పరిపాలన అందించేందుకు చంద్రబాబు కృషి చేస్తారన్నారు. సంపద ఎలా సృష్టించాలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు, మైనార్టీలకు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయన్నారు.

నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: గద్దె

పటమట: నగర ప్రజలతో పాటు రాష్ట్రం, దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలియజేశారు. తెలుగువారి కొత్త సంవత్సరంలో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు సీఎం కావడం తథ్యమన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.

నరసం కవితల పోటీల విజేతలు వీరే

విజయవాడ: నవ్యాంధ్ర రయిత్రుల సంఘం (నరసం) ఓటరు చైతన్యంపై నిర్వహించిన కవితల పోటీల విజేతలను సోమవారం ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక రచయిత్రులు ఈ పోటీలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని హైదరాబాద్ కోకాపేటకు చెందిన రోహిణి వంజారి, ద్వితీయ బహుమతిని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వై.శ్రీదేవి, తృతీయ బహుమతిని నిజామాబాద్ బి.కళాగోపాల్, కన్సొలేషన్ బహుమతులను చిత్తూరుకు చెందిన వైకే సంధ్యాశర్మ, కర్నూలుకు చెందిన కె.కవితాదేవి సాధించారు. వారిని నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అభినందించారు.

టీడీపీ, బీజేపీ అభ్యర్థులపై కేసుల నమోదు

వన్‌టౌన్: పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం-2 సభ్యుడు వణుకూరు శ్రీనాథ్ ఇచ్చిన నివేదిక మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 6న 40, 41వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరికి 41వ డివిజన్‌లోని వేముల ఇందిర, కాట ధనలక్ష్మి హారతులిచ్చారు. ఇద్దరి హారతి పళ్లంలో రూ. 500 చొప్పున అభ్యర్థులు వేశారు. దీంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించినట్టు పేర్కొని అభ్యర్థులిద్దరిపై కేసు నమోదు చేశారు.

వేలంపాటను రద్దు చేస్తాం

● తక్కువ ధరకు ఆలయ భూములు కట్టబెట్టారు ● దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు



పోరంకిలో ఈవో సుబ్బారెడ్డి, గుమాస్తా రాఘవ నుంచి భూముల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

వన్‌టౌన్, ఏప్రిల్ 8: పోరంకి వసంత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన 7 ఎకరాలు 75 సెంట్ల మెట్టభూమి వేలంపాటలో దేవస్థానం ఈవో సుబ్బారెడ్డి తక్కువ ధరకు లీజుకిచ్చారని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ) విజయరాజు తెలిపారు. ఈ భూమికి నిర్వహించిన వేలంపాటను రద్దు చేస్తామన్నారు. దేవస్థానానికి చెందిన భూమి 7 ఎకరాల 75 సెంట్ల మెట్ట భూమి వేలంపాటలో అవకతవకలు జరిగాయని మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతి పత్రికలో శతగోపం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో డిప్యూటీ కమిషనర్ శనివారం ఆలయానికి వెళ్లి విచారించారు. 2వ రోజు ఆదివారం కూడా ఆయన పోరంకిలోని మెట్టభూమితో పాటు తూముల వద్ద జంగాల మాన్యం సుమారు 10 ఎకరాల 54 సెంట్లు, వేరే చోట ఉన్న 3 ఎకరాలు 35 సెంట్లు, తాడిగడప వంతెన సమీపంలోని 96 సెంట్లు భూములనూ పరిశీలించారు. ఆ భూములు ఎవరి సాగులో ఉన్నాయి? ఎంత కాలం నుంచి నిర్వహిస్తున్నారు? ఈ విషయాలను తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ఆయన ఈవో సుబ్బారెడ్డి, గుమాస్తాను అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇటీవల వేలంపాట నిర్వహించిన 7 ఎకరాల 75 సెంట్ల భూమిని చాలా తక్కువకు లీజుకిచ్చారని చెప్పారు. దీనిపై నివేదిక తయారు చేసి కమిషనర్‌కు పంపిస్తామన్నారు. 2, 3 రోజుల్లో వేలంపాటను కూడా రద్దు చేస్తామన్నారు.

పోతిన రాజీనామాతో దరిద్రం పోయింది

● జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ .

భవానీపురం, ఏప్రిల్ 8: జనసేనకు పోతిన మహేష్ రాజీనామాతో నగరంలో పార్టీకి పట్టిన దరిద్రం పోయిందని జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ అన్నారు. స్థానికంగా వీఎంసీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. తొలి నుంచి పోతిన మహేష్ వైసీపీ కోవర్టుగా వ్యవహరించారని బాడిత ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ డబ్బులకు అమ్ముడుపోయాడని మహేష్ ఆరోపించడం తగదన్నారు. 64వ డివిజన్లలో ఒక్క డివిజన్‌ను గెలిపించుకోలేని నువ్వు లీడర్‌వా అంటూ ఎద్దేవా చేశారు. నగరంలో జనసేన పార్టీని మహేశ్ నాశనం చేశాడన్నారు. ఆయన 10 రోజుల క్రితమే వైసీపీకి అమ్ముడుపోయాడన్నారు. జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత మహేష్‌కు లేదన్నా రు. నగరంలో జనసేనలోకి నేతలు రాకుండా మహేష్ వ్యవహరించాడన్నారు. పశ్చిమ మైనార్టీల సీటని, అయినా తాము ఒక్కమాట మాట్లాడలేదన్నారు. పవన్ కల్యాణ్‌పై ఆరోపణలు చేస్తే నాలుకు చీరేస్తామని హెచ్చరించారు. జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, ఆలమూరి సాంబశివరావు, మైలవరపు కొండలరావు, టి. మైనర్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు.

గన్నవరం, ఏప్రిల్ 8: యువతకు ఉద్యోగావకాశాలు రావాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో 2 నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, నిరుద్యోగ యువత సుమారు 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నారని తెలియజేశారు.

ఇండియా కూటమిని గెలిపించుకోవాలి

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 8: రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో ఇండియా కూటమిని గెలిపించుకోవల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, పౌరులు, పత్రికలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, రాష్ట్రాల హక్కులు, మత సామరస్యం రక్షించబడాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. అలాగే ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు సీ2+50శాతం చట్టబద్ధ ఎంఎస్‌పీ లభించి రైతుల ఆదాయం మెరుగుపడాలంటే కూటమి ద్వారానే సాధ్యమన్నారు. రాష్ట్రానికి తీరనిద్రోహం చేసిన బీజేపీతో జతకట్టిన పార్టీలు, బీజేపీ ప్రవేశపెట్టిన అన్ని బిల్లులకు మద్దతునిచ్చి తొత్తుగా వ్యవహరించిన వైసీపీని ఓడించాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలన్నారు. వై.కేశవరావు, కృష్ణయ్య, కేవీవీ ప్రసాద్, మరీదు ప్రసాద్ పాల్గొన్నారు.

బిల్లులు లేని నగదు స్వాధీనం

కంకిపాడు, ఏప్రిల్ 8: బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీన పరుచుకున్నట్లు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ కంకిపాడులోని ఆరోగ్యమాత ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో కోడూరు మండలం ఊటగుండం గ్రామానికి చెందిన బోయిన గోపీచంద్ రూ.2,94,650, గోసాల గ్రామానికి చెందిన కాటూరి వెంకట వరప్రసాద్ రూ.1,30,600 నగదు తరలిస్తుండగా కంకిపాడు ఎస్సై సందీప్, ఎస్సై-2 తాతాచార్యులు అదుపులోకి తీసుకున్నారు. నగదు వివరాలను వారిని అడగగా సరైన సమాచారం ఇవ్వలేదు. దీంతో నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారికి అందజేశామని సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సమావేశంలో కంకిపాడు ఎస్సై-2 తాతాచార్యులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంతో
ముస్లిం కుటుంబాలకు న్యాయం

● బందరు ఎంపీ బాలశౌరి

పెనమలూరు, ఏప్రిల్ 8: టీడీపీ జనసేన బీజేపీ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు న్యాయం చేస్తుందని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. సోమవారం కానూరు మక్కా మసీదు ఆవరణలో టీడీపీ నాయకులు షేక్ బుజ్జి, తనయుడు టీడీపీ రెహమాన్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా రాష్ట్ర ముస్లిం ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ గతంలో ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర వ్యాప్తంగా అమలయిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిం మైనారిటీలకు పాత పథకాలతో పాటు ఇంకనూ మరి కొన్ని పథకాలను అందించి న్యాయం చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులను దగా చేసిన ప్రభుత్వంగా వైసీపీ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. టీడీపీ నేతలు వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బాహుబలేంద్రపు కోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, యువనేత బోడె వెంకట్రాం, బోడె సురేష్, జనసేన నాయకులు తాతపూడి గణేష్, ఆసిఫ్‌పాషా, రియాజ్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ బాలశౌరి



ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

విజయవాడ కల్చరల్: ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, రామ్మోహనరావు కంచర్ల ఆర్గనైజేషన్ వారు నిర్వహించిన ఉగాది వేడుకల విశిష్ట రత్న పురస్కారాల సభ సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహించారు. కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి దంపతులు, ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు ఏవీ రమణ పాల్గొని కళాకారులను సత్కరించారు. అంబటి మధుమోహన్‌కృష్ణకు విశేష విశిష్ట సేవా రత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహితీవేత్త జంధ్యాల పరదేశి బాబు, హరికథ భాగవతారని మోపిదేవి దుర్గా మహాలక్ష్మి, మల్లెల త్రివేది, యోగానంద ఈశ్వర్‌రెడ్డి, రావి అరుణ, జొన్నలగడ్డ జగన్మోహనరావు, చుండూరు మాణిక్యరావు, మద్దాలి సత్యవాణి, దొంతల ప్రకాష్, ఎస్.జగన్మోహనరావు, డాక్టర్ దోమ మాధవి, కొండపల్లి అప్పారావు, ఓరుగంటి నీలిమ, లంక నాగసాయి సుస్మిత, ఉద్దంటి ఉజ్వల సాయిలకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. డాక్టర్ చింత రవిబాల కృష్ణ బృంద నృత్య ప్రదర్శనలు, హైమావతి వీణావాదనం ఆకట్టుకొన్నాయి. వీవీఎల్ నరసింహ పర్యవేక్షించారు.

ఫ్లై ఓవర్‌పై కారు రేస్



విద్యాధరపురం: భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపూడిలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌పై భవానీపురానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం అర్ధరాత్రి కారు రేస్ నిర్వహించారు. భవానీపురానికి చెందిన సోనూ, చైతన్య, శివారెడ్డి మరికొందరు ఫ్లై ఓవర్‌పై సుమారు 3, 4 కార్లతో రేస్ నిర్వహించి హల్‌చల్ చేశారు. ఫ్లై ఓవర్‌పై పోలీసులు నిఘా లేనందున తరచూ ఇక్కడ బైక్, కార్ల రేస్‌లను నిర్వహిస్తున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు. కారు రేస్ నిర్వహించిన సోనూ, చైతన్య, శివారెడ్డి గత ఏడాదిలో కనకదుర్గా ఫ్లై ఓవర్‌పై సుమారు 7, 8 కార్లతో ర్యాలీ నిర్వహించారు. కానీ పోలీసులు మాత్రం కొందరిపైనే కేసు నమోదు చేసి సూత్రదారులను తప్పించి తూతూమంత్రంగా కొన్ని కార్లను స్వాధీనం చేసుకున్నారు. సూత్రదారుల కార్లను స్వాధీనం చేసుకోలేదని ఆరోపణలు ఇప్పటికీ వినిపిస్తునే ఉన్నాయి. మరి ఈ ముగ్గురితో పాటు మరికొందరు నిర్వహించిన కారు రేస్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

టిప్పర్ లారీ ఢీకొని మహిళా కూలీకి తీవ్రగాయాలు

● రెండు కాళ్లు కోల్పోయిన మహిళా కూలీ
● మొరాయించిన 108 వాహనం



రెండు కాళ్లు కోల్పోయిన నాగేశ్వరమ్మ

గన్నవరం, ఏప్రిల్ 8: పొట్టకూటి కోసం వెళ్తూ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న ఓ మహిళా కూలి. ఇంటి నుంచి బయలుదేరిన కొద్ది సమయానికే ప్రమాదం టిప్పర్ లారీ రూపంలో వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం గన్నవరం మండలం సావరగూడెం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు కంకిపాడు మండలం తెన్నేరు గ్రామంలో మినుము తీత పనులకు వెళ్తున్నారు. రోజువారీ లాగానే సోమవారం ఉదయం చెరుకుతోలే ట్రాలీ ట్రాక్టర్‌లో మహిలా కూలీలు వెళ్తున్నారు. సావరగూడెం-కేసరపల్లి మధ్యలో మలుపువద్దకు రాగా ట్రాక్టర్‌ను టిప్పర్ లారీ ఓవర్ టేక్ చేస్తుండగా ట్రాక్టర్‌లో వెనుకాల కూర్చున్న నీలపాల నాగేశ్వరమ్మను లారీ వెనుక జాయింట్ బంపర్ తగలడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. లారీని అరకిలోమీటరు దూరంలో ఆపి డ్రైవర్ పారిపోయాడు. నాగేశ్వరమ్మను చూసి తోటి కూలీలు బోరున విలపించారు.

మొరాయించిన 108 వాహనం

ఉదయం 6.20 గంటలకు ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా సుమారు గంట తరువాత వచ్చింది. క్షతగాత్రురాలు నాగేశ్వరమ్మను అంబులెన్స్‌లో ఎక్కించుకుని కొద్ది దూరం వెళ్లగానే బ్రేక్‌డౌన్ అయింది. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం అవుతుంటే సరైన సమయానికి 108 వాహనం రాకపోగా వచ్చాక మొరాయించడంపై తీవ్ర అసహనానికి గురయ్యారు. తరువాత మరో 108 వాహనం వచ్చి చిన్నఅవుటపల్లి పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు.

స్పందించని పోలీసులు

ప్రమాదం జరిగిన కేసు నమోదు చేసేందుకు పోలీసులు స్పందించడం లేదని నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు. పిన్నమనేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా సాయంత్రం వరకు పోలీసులు రాలేదని, టిప్పర్ లారీ వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



ఉగాది సత్కారాలు అందుకున్న కోచ్‌లు, క్రీడాకారులతో ముఖ్య అతిథులు

ఘనంగా ఉగాది క్రీడా పురస్కారాలు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 8: గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, స్టార్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక నిడమానూరులో స్టార్ టెన్నిస్ అకాడమీలో ఉగాది క్రీడా పురస్కారాలు అందజేత సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ మెహర్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ (జీఎస్టీ) కిషోర్ రాయల్ హాజరై ఈ పురస్కారాలను అందించారు. క్రీడాకారులకు ఇలాంటి గుర్తింపు పొందినప్పుడే నిజమైన ఆనందాన్ని పొందుతారన్నారు. శాయ్ రిటైర్డు బాస్కెట్‌బాల్ కోచ్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డులను ప్రదానం చేసేలా ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. దాదాపు 30 మంది క్రీడాకారులకు, క్రీడాశిక్షకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఎస్‌డీ.కుమార్, మాజీ జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు పరిమి రామ్‌కుమార్, గమిడి సాంబ శివరావు, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్.ప్రసాద్, స్టార్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ కె. డోలా గోపాలరావు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న బాబూరావు

కార్మికుల ఉసురు పోసుకుంటున్న జగన్

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

సత్యనారాయణపురం, ఏప్రిల్ 8: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజల ఉసురు పోసుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో సోమవారం ఆ పార్టీ నేతలు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ రాజధాని అమరావతిని చిన్నా భిన్నం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి నగరాన్ని అధోగతి పాలు చేశాడని దుయ్యబట్టారు. భవన నిర్మాణ రంగం, రవాణా రంగం, ఇలా ప్రతి రంగంలో కార్మికులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



ఉపద్రష్ట లక్ష్మణ సూరి దంపతులను సత్కరిస్తున్న రామమోహన గ్రంథాలయ కమిటీ సభ్యులు

ఉగాది ప్రాశస్త్యంపై ప్రసంగం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 8: ఉగాది పండుగ సందర్భంగా ఎంజీ రోడ్డులోని రామమ్మోహన గ్రంథాలయంలో సోమవారం ఉగాది ఉత్సవ ప్రాశస్త్యం అనే విషయంపై ప్రసంగం జరిగింది. ప్రసంగకర్త ఉపద్రష్ట లక్ష్మణ సూరి ప్రసంగిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పండుగలను ప్రస్తావిస్తూ ఉగాది ఉత్సవ ప్రాశస్త్యాన్ని వివరించారు. గ్రంథాలయ ఉపకార్యదర్శి తంగిరాల రఘురామ్, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు కోట కృష్ణభగవాన్, రోటరీ క్లబ్ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణ సూరి దంపతులను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను ఇచ్చారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జడ్జి సత్యానంద్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, రాజా, బార్ కౌన్సిల్ మెంబర్ అజయ్‌కుమార్

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

● బార్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి

విజయవాడ లీగల్, ఏప్రిల్ 8: మతసామరస్యానికి ప్రతీక ముస్లిం సోదరులు జరుపుకొనే రంజాన్ పండుగ అని బార్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి అన్నారు. సోమవారం సాయంత్రం బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్ పాల్గొన్నారు. అనంతరం న్యాయవాదులందరూ ఇఫ్తార్ విందు స్వీకరించారు. బార్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరామ్‌ప్రసాద్ (రాజా), ఉపాధ్యక్షుడు జీవీ రామశర్మ, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతి కుమార్, కార్యవర్గసభ్యులు సిహెచ్.రవి కుమార్, ఎన్‌వీవీ సుబ్రమణ్యం, షేక్ అజ్గర్, ఎస్.రాజ్యలక్ష్మి, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, అబ్దుల్ మతీన్, బాషా పాల్గొన్నారు.

కవితకు బెయిలిస్తే మొదటికే మోసం

- సాక్ష్యాలు తారుమారు చేసి, సాక్ష్యులపై ఒత్తిడి తెచ్చే ముప్పు
- కుమారుడి పరీక్షలనేది బెయిల్‌కి పెద్ద కారణం కానే కాదు
- బెయిల్ నిరాకరిస్తూ ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ఈడీ ప్రత్యేక కోర్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ నిరాకరించింది. కవితకు బెయిల్ ఇస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, సాక్ష్యాధారాలను తారుమారు చేసి తప్పించుకునే ముప్పు ఉందని కోర్టు అభిప్రాయపడింది. కుమారుడి పరీక్షల కోసం కవితకు బెయిల్ ఇవ్వడం తప్పనిసరి కానేకాదని న్యాయమూర్తి కావేరి భవేజా వ్యాఖ్యానించారు. దర్యాప్తులో పాల్గొనకముందు, నోటీసులు అందుకున్న తర్వాత.. కవిత తన ఫోన్లలోని సమాచారాన్ని విధ్వంసం చేసినట్టు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని, ఆమె సాక్ష్యులను ప్రభావితం చేశారన్న విషయం కూడా స్పష్టమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇస్తే ఆమె సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. కవిత మహిళ అయినప్పటికీ ఆమెకు బెయిల్ ఇవ్వకపోవడానికి ఇవే ప్రధాన కారణాలని న్యాయమూర్తి కావేరి భవేజా వివరించారు. కవిత కుమారుడికి సగం పరీక్షలు ఇప్పటికే ముగిశాయని.. అతని వద్ద సోదరుడు, తండ్రి, పిన్ని తదితరులు ఉన్నారని న్యాయమూర్తి గుర్తుచేశారు. అసలు కవిత కుమారుడు ఏం చదువుతున్నాడు? ఎన్నిరోజులు బెయిల్ కావాలి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదని.. అతడి వద్ద ఉన్న సన్నిహిత బంధువులు అతనికి ఎందుకు మానసిక మద్దతు అందించలేరో వివరించలేదని పేర్కొన్నారు. కవిత 19 ఏళ్ల పెద్ద కుమారుడు స్పెయిన్‌లో తల్లిదండ్రులు తన పక్కన లేకుండానే చదువుకోగలుగుతున్నప్పుడు.. బంధువులు పక్కన ఉండగా చిన్న కుమారుడు పరీక్షలు ఎందుకు రాయలేడని ప్రశ్నించారు. టెక్నాలజీ యుగంలో తండ్రి ఇతర బంధువులు, సోదరుడు డిజిటల్ ఉపకరణాల ద్వారా కూడా కవిత కుమారుడితో సంబంధాలు ఏర్పరుచుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. చదువుకున్న, సంపన్నులైన మహిళలు ఈరోజుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అక్రమ కార్యకలాపాలకు కూడా పాల్పడుతున్నారని, అందువల్ల కోర్టు అలాంటి వారికి బెయిల్ ఇచ్చేముందు న్యాయ సమ్మతంగా వ్యవహరించాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

కాలువల్లో నీటి సరఫరాపై డ్రోన్లతో నిఘా: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు ప్రకాశం బ్యారేజీ, నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన నీరు సక్రమంగా శివారు ప్రాంతాలకు చేరేలా కాలువల వెంబటి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి తాగునీటి సమస్యపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వైసీపీ పెట్టే కేసులపై జాగ్రత్త

- బీజేపీ శ్రేణులతో సిద్ధార్థ్ నాథ్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేస్తోన్న ఎన్డీఏ అభ్యర్థులపై రాష్ట్రంలోని అధికార వైసీపీ పెడుతోన్న కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బీజేపీ సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ పార్టీ శ్రేణులకు సూచించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో సమావేశమై ఎన్నికల సమయంలో వారు చేయాల్సిన బాధ్యతలు వివరించారు. పది అసెంబ్లీ, ఆరు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తోన్న బీజేపీ అభ్యర్థులతోపాటు కూటమి తరఫున పోటీ చేసే ప్రతి అభ్యర్థి విజయానికి సమన్వయంతో కృషి చేయాలన్నారు. అధికార వైసీపీ చేసే తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు టీవీ డిబేట్లు, ప్రెస్ మీట్లతో తిప్పికొట్టాలని, అనవసరమైన వివాదాలకు తావు లేకుండా జాగ్రత్తగా ప్రజలకు వివరించాలన్నారు. చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాటా కూటమి అభ్యర్థులకు బలంతో పాటు ప్రత్యర్థిని బలహీన పరిచేలా ఉండాలని సూచించారు.

హామీ మీది.. పూలు మావి..!

- మాటతప్పిన జగన్‌కు అగ్రిగోల్డ్ బాధితుల వినూత్న నిరసన

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): "మరణించిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.10లక్షలు పూవుల్లో పెట్టి ఇంటికి పంపుతాం" అని సీఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పి ఐదేళ్లయింది. కానీ, ఇంతవరకూ ఆ హామీని నెరవేర్చలేదు. దీంతో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి భారీ పూల పార్శిల్ పంపి వినూత్నంగా నిరసన తెలిపారు. "అందుకోండి ఈ పూలు.. నిలబెట్టుకోండి మీ హామీ.." అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంటూరులో సంఘం నేతలు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

యువకుడి హత్య.. ఇన్‌స్టాలో షేరింగ్

- కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో ఘటన

నిజాంపేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వారంతా యువకులు.. పది మంది ఉంటారు..! బైక్‌లపై వచ్చారు. అక్కడే ఉన్న ఓ యువకుడిని కత్తితో పొడిచి, దారుణంగా హతమార్చారు. ఆ దృశ్యాలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "స్నేహితుడి హత్యకు ప్రతీకారం" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ దారుణ ఘటన కూకట్‌పల్లి ప్రగతినగర్‌లో చోటుచేసుకుంది. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన తేజస్(21) బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి, బోరబండలో ఉండేవాడు. 2023 అక్టోబరులో.. దసరా పండుగ రోజున తరుణ్ అనే యువకుడి హత్య జరిగింది. ఈ కేసులో తేజస్ ఏ3గా ఉన్నాడు. జైలుకు వెళ్లాడు. రెండు నెలల క్రితం బయటకు వచ్చి.. తన తల్లితో కలిసి ప్రగతినగర్ బతుకమ్మ కుంట వద్ద అద్దెకు ఉంటున్నాడు. అతని స్నేహితులు రోజూ తేజస్ ఇంటికి వచ్చి, మద్యం సేవించేవారు. ఆదివారం తేజస్ తల్లి ఊరెళ్లారు. ఆదివారం రాత్రి కూడా మహేశ్ అనే పేరున్న ఇద్దరు మిత్రులు, శివప్ప అనే స్నేహితుడితో కలిసి తేజస్ మద్యం సేవించాడు. తరుణ్ మిత్రులకు శివప్ప ఈ విషయాన్ని చేరవేశాడు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో సమీర్ అనే యువకుడితోపాటు.. మొత్తం 10 మంది ద్విచక్ర వాహనాలపై అక్కడికి చేరుకున్నారు. తేజస్‌ను చుట్టుముట్టిన దుండగులు.. కత్తితో 12 చోట్ల విచక్షణారహితంగా పొడిచారు. ఆ తర్వాత ఓ బండరాయితో తలపై మోదారు. దుండగుల్లో సగం మంది అక్కడి నుంచి పరారవ్వగా.. మిగతావారు హత్య దృశ్యాలను చిత్రీకరించారు. సిద్దిఖ్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ దృశ్యాలను పోస్ట్ చేశారు.

'పొగ'బట్టి చంపేసింది

- యువతి సిగరెట్ తాగుతుండగా వీడియో తీసిన యువకుడు
- స్నేహితులను పిలిచి.. యువకుడిని వెదికిపట్టుకుని మరీ దాడి

నాగపూర్, ఏప్రిల్ 8: సిగరెట్ తాగుతుండగా వీడియో తీస్తున్న యువకుడితో గొడవ పడిన యువతి.. అనంతరం అతడిని వెదికిపట్టుకుని మరీ దారుణంగా హత్య చేసింది. మహారాష్ట్ర నాగపూర్‌లో శనివారం అర్ధరాత్రి రంజిత్ రాథోడ్ (28) సిగరెట్ కోసం మహాలక్ష్మినగర్‌లోని షాప్‌నకు వెళ్లాడు. అక్కడ జయశ్రీ పంజాడే (30) స్నేహితురాలు సవితతో కలిసి సిగరెట్ తాగుతోంది. వీరిని రంజిత్ అదే పనిగా చూశాడు. వీడియో కూడా తీస్తుండడంతో వాగ్వాదం మొదలైంది. ఇది ముదరడంతో దుర్భాషలకు దిగిన జయశ్రీ.. రంజిత్ ముఖంపైకి పొగ ఊదింది. ఇదంతా రంజిత్ తీసిన వీడియోలో రికార్డయింది. అనంతరం అతడు వెళ్లిపోయాడు. కానీ, కోపం చల్లారని జయశ్రీ తన స్నేహితులు ఆకాశ్ రౌత్, జీతూ జాదవ్‌ను పిలిచింది. అందరూ కలిసి రంజిత్‌ను వెదికి పట్టుకున్నారు. ఒక్కసారిగా అతడిపై దాడిచేశారు. తొలుత ఆకాశ్, అనంతరం జయశ్రీ కత్తితో పలుసార్లు పొడిచారు.

బోట్ కంపెనీ డేటా చోరీ

- రిస్క్‌లో 75 లక్షల మంది కస్టమర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ప్రముఖ ఆడియో కంపెనీ 'బోట్'.. కస్టమర్ల డేటా చోరీకి గురయిందని, దాంతో ఆ కంపెనీకి చెందిన దాదాపు 75 లక్షల మంది కస్టమర్లు రిస్క్‌లో పడ్డారని ఫోర్బ్స్ ఇండియా సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'షాపిఫైగయ్' అనే హ్యాకర్ ఈ నెల 5వ తేదీన బోట్ కంపెనీ కస్టమర్ల డేటాను దొంగిలించి డార్క్ వెబ్‌లో పెట్టాడని పేర్కొంది. కస్టమర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లతో పాటు వారి ఈ మెయిల్ అడ్రస్‌లు అందులో ఉన్నాయని వెల్లడించింది. కస్టమర్ల డేటాను హ్యాకర్ కేవలం 2 యూరోలకే విక్రయానికి పెట్టాడని, దాంతో బోట్ కంపెనీ కస్టమర్లకు ఏ క్షణమైన స్కామర్ల నుంచి ఫోన్లు, ఫిషింగ్ మెయిల్స్ వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించుకుని స్కామర్లు ఏ తరహా మోసాలకైనా పాల్పడే వీలుందని, బోట్ కంపెనీ కస్టమర్లు కొన్ని వారాల పాటు అప్రమత్తంగా ఉండాలని ఫోర్బ్స్ హెచ్చరించింది.

మోదీ ప్రసంగాల్లో 'ఆర్ఎస్ఎస్ కంపు'

- ఎవరెవరి పక్షమో అందరికీ తెలుసు
- బీజేపీ గ్రాఫ్ దిగజారుతోంది
- అందుకే మా మేనిఫెస్టోపై నిందలు
- కాంగ్రెస్ న్యాయపత్రలో ముస్లింలీగ్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన ఖర్గే
- ప్రధానిపై ఈసీకి ఫిర్యాదు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో 'న్యాయపత్ర'లో ముస్లిం లీగ్ ముద్ర ఉందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయని దుయ్యబట్టారు. మరోవైపు ప్రధాని చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వరుస పోస్టులు పెట్టిన ఖర్గే ప్రధాని సహా బీజేపీ సైద్ధాంతిక వాది, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీపై నిప్పులు చెరిగారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు ముఖర్జీ మద్దతు పలికారని విమర్శలు గుప్పించారు. "మోదీ-అమిత్‌షాలు తమ రాజకీయ సైద్ధాంతికులుగా పేర్కొంటున్న వారు స్వాతంత్ర్యోద్యమకాలంలో భారతీయులకు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు, ముస్లింలీగ్‌కు మద్దతు పలికారు. ఆఖరుకు ఈ రోజు కూడా కాంగ్రెస్ న్యాయపత్రకు వ్యతిరేకంగా ముస్లింలీగ్‌ను ప్రయోగిస్తున్నారు. కానీ, మా న్యాయపత్ర.. దేశంలోని సాధారణ పౌరుల అవసరాలు, ఆకాంక్షలు, వారి డిమాండ్లకు అద్దం పడుతోంది" అని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ ప్రసంగాలు ఆర్ఎస్ఎస్ కంపు కొడుతున్నాయి. బీజేపీ ఎన్నికల గ్రాఫ్ రోజు రోజు పడిపోతోంది. అందుకే ఆర్ఎస్ఎస్ తమ ప్రియమిత్రుడు ముస్లింలీగ్‌ను గుర్తు చేసుకుంటోంది" అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ప్రధాని మోదీపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నట్టు చెప్పారు. మరోనేత పవన్ ఖేరా మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ముస్లింలీగ్‌ను ఎందుకు ఆపాదిస్తున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్, ఎన్సీ సీట్ల ఒప్పందం ఖరారు

జమ్ము కశ్మీర్‌లోని ఐదు, లడక్‌లోని ఒక లోక్‌సభ స్థానానికి సంబంధించి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరింది. చెరో మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉధంపూర్, జమ్ము, లడక్ సీట్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు, అనంత్‌నాగ్, బారాముల్లా, శ్రీనగర్‌ల నుంచి తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని వెల్లడించారు. కాగా, అనంత్‌నాగ్ నుంచి పీడీపీ అధినాయకురాలు మెహబూబా ముఫ్తీ స్వయంగా పోటీ పడుతున్నారు. దీంతో ఇక్కడ ఎన్సీ, పీడీపీ, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ అధినేత గులాం నబీ ఆజాద్ మధ్య త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉంది. అయితే, బరిలోఉండాలా? వద్దా? అన్నదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆజాద్ చెప్పారు.

వచ్చేది మేమే!: రాహుల్

శివనీ, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ సారి విప్లవాత్మక నిర్ణయాలు చేర్చామన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలతోపాటు పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో ఏటా రూ.లక్ష చొప్పున జమ చేస్తామని తెలిపారు. సోమవారం మధ్యప్రదేశ్ శివనీ జిల్లా మాండ్లా లోక్‌సభ స్థానం పరిధిలోని ధనోరాలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. 'ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పుడిస్తున్న వేతనాలను రెట్టింపు చేస్తాం. దేశంలోని ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ ఇచ్చేలా కొత్త చట్టం తెస్తాం. కాంట్రాక్టు ఉద్యోగాల విధానానికి స్వస్తి చెబుతాం. పంటలకు కనీస మద్దతు కోసం చట్టం రూపొందిస్తాం.' అని రాహుల్ పేర్కొన్నారు

'డిజైన్ టెక్' సొమ్ము జప్తు ఉత్తర్వులు సబబే!

- ఈడీ, సీఐడీ జప్తు ఉత్తర్వులు మాత్రం విభిన్నం
- ఈడీ ఉత్తర్వులపై అడ్జుడికేటింగ్ వద్దే తేల్చుకోండి
- స్కిల్ డెవలప్‌మెంట్ పార్టనర్‌కు హైకోర్టు ఆదేశం
- టెక్ సంస్థ వ్యాజ్యాలు కొట్టేసిన న్యాయమూర్తి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డిజైన్ టెక్ సంస్థకు చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జారీ చేసిన ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ ఉత్తర్వులను(పీఏవో) హైకోర్టు సమర్థించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ టెక్ సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యాలను కొట్టివేసింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేస్తూ ఈడీ ఇచ్చిన పీఏవో సరైందేనని పేర్కొంది. అయితే, సీఆర్పీసీ-102ని అనుసరించి సీఐడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు, మనీ లాండరింగ్ చట్టం కింద ఈడీ జారీ చేసిన పీఏవో ఉత్తర్వులు పరస్పరం భిన్నమైనవని పేర్కొంది. సీఐడీ జప్తు ఉత్తర్వులపై ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు ముందు దాఖలైన వ్యాజ్యాలలో ఈడీ ప్రతివాదిగా లేదని గుర్తు చేసింది. ఈడీ జారీ చేసిన పీఏవో ఉత్తర్వులను రెండో జప్తు ఉత్తర్వులుగా పేర్కొనలేమని తెలిపింది. ఈడీ పీఏవోపై అడ్జుడికేటింగ్ అథారిటీ వద్దే తేల్చుకోవాలని డిజైన్ టెక్ సంస్థకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల తీర్పు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకి సంబంధించి నిధులు మళ్లింపు ఆరోపణలతో ఏపీ సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసింది. ప్రాజెక్ట్‌లో భాగస్వామిగా ఉన్న డిజైన్ టెక్ సంస్థ నిధులు పక్కదారి పట్టించిందని ఈడీకి సమాచారం ఇచ్చింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసిన ఈడీ.. డిజైన్ టెక్ సంస్థకు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేస్తూ గత ఏడాది ఏప్రిల్ 21 పీఏవో జారీ చేసింది. డిజైన్ టెక్ సంస్థకు గత ఏడాది జులై 13న అడ్జుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పీఏవో ఉత్తర్వులతో పాటు అడ్జుడికేటింగ్ అథారిటీ షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ డిజైన్ టెక్ సంస్థ ఎండీ వికాస్ వినయ్ ఖన్వేల్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్పీసీ సెక్షన్ 102ను అనుసరించి సీఐడీ ఇప్పటికే తమ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తాము ట్రయల్ కోర్టును ఆశ్రయించగా బ్యాంక్ ఖాతా నిర్వహణకు అనుమతిస్తూ అందులోని సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చాలని ఆదేశించినట్టు తెలిపింది. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేస్తూ ఈడీ పీఏవో ఉత్తర్వులు ఇచ్చిందని డిజైన్ టెక్ పేర్కొంది. ఒకే ఆస్తికి సంబంధించి రెండు జప్తు ఉత్తర్వులు చెల్లుబాటు కావని తెలిపింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈడీ జప్తు చేసిన సొమ్ము.. కేసుకి సంబంధించిన సొమ్ముకాదని అడ్జుడికేటింగ్ అథారిటీ వద్ద నిరూపించుకోవాల్సిన బాధ్యత పిటిషనర్‌పై ఉందన్నారు. అడ్జుడికేటింగ్ అథారిటీ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాలన్నారు. పీఏవో ఉత్తర్వులపై నేరుగా హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదని తెలిపారు. సీఆర్పీసీ 102ని అనుసరించి సీఐడీ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు, మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ జారీ చేసిన జప్తు చేసిన ఉత్తర్వులు వేర్వేరని వివరించారు. ఈడీ జప్తు ఉత్తర్వులు రెండో జప్తు కిందికి రావన్నారు. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి ఇటీవల నిర్ణయాన్ని వెల్లడించారు.

ఈ ఉగాది సుఖసంతోషాలు పంచాలి

- రాష్ట్ర ప్రజలకు గవర్నర్, చంద్రబాబు శుభాకాంక్షలు
- ఉగాది తర్వాత రాష్ట్రానికి మంచి రోజులే: పవన్

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది తెలుగు వారంతా సంతోషంగా, ఆనందంగా జరుపుకునే పండుగని, కొత్త సంవత్సరం మన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని గవర్నర్ ఆకాంక్షించారు. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ మన సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లో శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాలను పంచాలని కోరుకున్నారు. 'ఈ ఎన్నికల సమయంలో మనందరం తెలుగు నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్నాం. క్రోధి అంటే కోపంతో ఉన్న వారు అని అర్థం. అయితే నేడు మీ ఆగ్రహం.. ధర్మాగ్రహం కావాలి. ఆ ఆగ్రహంలో చెడు అంతా దహనమై, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే చల్లని పాలన మొదలవ్వాలని కోరుకుందాం. ఈ ఉగాది మీ ఇంటిల్లిపాదికీ శుభాలు కలిగించాలి. మీ కుటుంబ సభ్యులకు ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, అభివృద్ధిని అందించాలి' అని చంద్రబాబు ఆకాంక్షించారు. కాగా, తెలుగు సంవత్సరం ప్రారంభమయ్యే ఉగాది మనందరికీ ఎంతో ప్రత్యేకమైనదని, తెలుగుదనం నిండిన ఈ వేడుకను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. కొత్త చిగురులు వేసే వసంత రుతువు మొదలయ్యేదీ ఈ పర్వదినం నుంచేనని, ఈ ఉగాది తర్వాత నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చేవన్నీ మంచి రోజులే అని ఆకాంక్షించారు. రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త చిగురులు మొదలయ్యాయని, రాక్షస పీడ నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభిస్తుందని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నేడు టీడీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం

- హాజరు కానున్న చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీక్రోధి నామ ఉగాది సందర్భంగా మంగళ వారం ఉదయం 10 గంటలకు ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దీనికి హాజరుకానున్నారు. అమరావతికి చెందిన పండిత ప్రముఖుడు, అంతర్జాతీయ జ్యోతిష్య సదస్సులో గౌరవ డాక్టరేట్ పొందిన మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణకర్తగా వ్యవహరించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ ఇక్బాల్, ఎమ్మెల్యే బాబూరావు రాజీనామాలు ఆమోదం

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పార్టీని వీడిన వైసీపీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తన పదవికి కూడా రాజీనామా చేశారు. ఆమేరకు తన రాజీనామా లేఖను ఫాక్స్‌లో శాసన మండలి చైర్మన్ కార్యాలయానికి పంపారు. లేఖ ను అందుకున్న వెంటనే మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు దానిని ఆమోదించారు. అలాగే పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను సోమవారం సభాపతి తమ్మినేని సీతారాం ఆమోదించారు. ఆమేరకు అసెంబ్లీ సెక్రటేరియెట్ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

వైసీపీ ఏజెంట్‌గా ధర్మారెడ్డి

- టీటీడీ ఈవో పదవి నుంచి ఆయన్ను తొలగించండి
- సీఈవో మీనాకు టీడీపీ, జనసేన, బీజేపీ ఫిర్యాదు



సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న కొమ్మారెడ్డి పట్టాభి, భానుప్రకాష్‌రెడ్డి

అమరావతి, తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో ధర్మారెడ్డి వైసీపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని, టీటీడీ పవిత్రతకు భంగం కలిగిస్తున్న ఆయన్ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ ప్రచారం, అక్రమాలు, నిధుల మళ్లింపు తదితర అంశాలపై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి, బీజేపీ అధికార ప్రతినిధులు భానుప్రకాశ్ రెడ్డి, సాదినేని యామినీ శర్మ.. సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ధర్మారెడ్డి.. సీఎం జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని, ఆయన వైసీపీ నాయకులకు, నియోజకవర్గాల ఇంచార్జులకు ప్రత్యేక దర్శన కోటా కూడా కేటాయించారని ఆరోపించారు. ఇలా టీటీడీలో గతంలో ఎపుడూ జరగలేదని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ కుమారుడికి మద్దతుగా రూ.1500 కోట్ల పనులకు టెండర్లు పిలిచిందని, టీటీడీ చైర్మన్ కోట్లు కొల్లగొట్టి ఆ నిధులను తన కొడుకు పోటీ చేస్తున్న ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ ఏడాది కాలంలో రూ. 1500 కోట్లు సివిల్ వర్కులకు కేటాయించలేదని పేర్కొన్నారు. ధర్మారెడ్డి తరచూ ప్రత్యేక విమానాల్లో ప్రయాణిస్తుంటారని, సంపన్నులతో, పారిశ్రామికవేత్తలతో పరిచయాలు పెంచుకుని వారు వైసీపీకి సహకరించేలా ప్రభావితం చేస్తూ టీటీడీ ఈవో ఉద్యోగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ కోసం ఈవో ధర్మారెడ్డి వందల కోట్లు నిధులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కోడ్ కారణంగా మూడేళ్లకు మించి పనిచేస్తున్న అధికారులంతా బదిలీ కాగా ధర్మారెడ్డి మాత్రం బదిలీ కాలేదని పేర్కొన్నారు. ఆయన ఈవోగా కొనసాగితే అధికార పార్టీకి సహకరిస్తూ ఈ ఎన్నికల్లో తన స్థాయిని దుర్వినియోగం చేస్తారని ఆరోపించారు. ధర్మారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా తిరుమలను వైసీపీ కార్యాలయంగా మార్చారని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి మాట్లాడుతూ.. ధర్మారెడ్డి వైసీపీ ఏజెంట్‌గా మారారని, జగన్ కోసం బడా పారిశ్రామిక వేత్తల నుంచి నిధులు సమీకరించే పనిలో పడ్డారని విమర్శించారు. టీటీడీ నుంచి నిధుల కేటాయింపుపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేస్తే అన్ని విషయాలూ బయటకు వస్తాయన్నారు. ధర్మారెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈవోకి వైసీపీ మీద ప్రేమ ఉంటే వైసీపీ కార్యాలయంలో కకూర్చోవాలన్నారు. అంతేకానీ వారి ప్రయోజనాల కోసం టీటీడీ ఖజానాను ఖాళీ చేయడం తగదన్నారు.

చెట్లు నరికివేతపై చర్యలు తీసుకోండి

- టీడీపీ లీగల్ సెల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా కనిగిరి, తిరుపతి జిల్లా రేణిగుంట పర్యటనల సందర్భంగా పచ్చని చెట్లను నరికి వేశారని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాగులూరి హరిబాబు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావుతో కలిసి సోమవారం ఆయన అమరావతి సచివాలయంలో సీఈవో మీనాకు ఫిర్యాదు చేశారు. అనంతరం మన్నవ సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ.. కనిగిరి, రేణిగుంటల్లో జరిగిన మేమంతా సిద్ధం సభల ఏర్పాట్లలో భాగంగా వైసీపీ నాయకుల పర్యవేక్షణలో పోలీసులు, అధికారుల సమక్షంలో జగన్ పర్యటన ప్రాంతాల్లోని చెట్లను నరికివేసి పర్యావరణానికి హాని చేశారన్నారు. దీన్ని నిలువరించకుండా సహకరించిన పోలీసులు, అధికారులపై కేసులు పెట్టి వారి నుంచి నష్టపరిహారాన్ని రాబట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రచారానికి వర్సిటీలను వాడుకుంటూ జగన్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.

అంబేడ్కర్, పూలే విగ్రహాలకు ముసుగులు తొలగించండి

- సీఈవోను కోరిన ఏపీ బీసీ సంక్షేమ సంఘం

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్ కోడ్ పేరిట బీఆర్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అమలుచేసే క్రమంలో కొన్నిచోట్ల భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, సంఘం సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు కూడా ముసుగులు వేశారని పేర్కొన్నారు. ఈనెల 11న పూలే జయంతి, 14న అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో ఆ వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆ విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించేలా ఆదేశాలివ్వాలని సీఈవో మీనాను కోరామని చెప్పారు.

సీఎఫ్ఎంఎస్ పోర్టల్ ఆగడం వల్లే జీతాలు ఆలస్యం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై దేవదాయ శాఖ కమిషనర్ వివరణ

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఉద్యోగులకు జీతాలు నిలిచిన విషయంలో తమ తప్పేమీ లేదని దేవదాయ శాఖ కమిషనర్ వివరణ ఇచ్చారు. 'దేవదాయ శాఖలో నిలిచిన జీతాలు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. మార్చి నెల జీతాలకు సంబంధించిన బిల్లులు మార్చి 25వ తేదీనే పీఏవోకు సమర్పించామని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన ఇంక్రిమెంట్లు ఎఫ్.ఆర్ 24కు సంబంధించి 26కు మార్పు చేయాలని ట్రెజరీ అధికారులు సూచించగా, అలా మార్పులు చేసి మరోసారి 28వ తేదీన బిల్లులు సమర్పించామన్నారు. మార్చి 29, 30,31 తేదీల్లో సెలవులు కావడం, ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో సీఎఫ్ఎంఎస్ పోర్టల్ పని చేయలేదని తెలిపారు. ఏప్రిల్ 6న సీఎఫ్ఎంఎస్ పోర్టల్ తెరవగానే, కొన్ని శాఖల వారికి జీతాలు చెల్లించారన్నారు. దేవదాయ శాఖకు కూడా ఒకటి, రెండు రోజుల్లో జీతాలు వస్తాయని తెలిపారు.

కూటమి విజయం ఖాయం

- తెలంగాణ నేత గోనె ప్రకాశరావు వ్యాఖ్యలు



విజయవాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని తెలంగాణ నేత గోనె ప్రకాశరావు జోస్యం చెప్పారు. సెంట్రల్ ఇంటిలిజెన్స్‌తో పాటు ఆరేడు సంస్థలు చేసిన సర్వే నివేదికలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయన్నారు. విజయవాడలోని కేశినేని చిన్ని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమికి 130కి పైగా అసెంబ్లీ సీట్లు, 19 నుంచి 23 వరకు ఎంపీ సీట్లు వస్తాయని వెల్లడించారు. జగన్ ప్రజారంజకంగా కాకుండా తనకు ఇష్టమొచ్చినట్టుగా పాలన సాగించారని విమర్శించారు. వేసవిలో సన్‌స్ట్రోక్ మాదిరిగానే సీఎంకు వైఫ్ స్ట్రోక్ ఉందన్నారు. వైసీపీని కాపాడుకోవడంలో విజయమ్మ, షర్మిల ఎంతో కీలకంగా వ్యవహరించారని, తీరా అవసరం తీరాక వారిని గెంటేశాడని మండిపడ్డారు. జగన్ జైలుకు వెళ్తే భారతిని సీఎం చేసేలా ప్లాన్ సిద్ధం చేశారన్నారు. భార్య కోసం జగన్ బంధాలు తెంచుకున్నాడన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఊసు లేకుండా పోయిందన్నారు. ప్రజలకు కనీస అవసరమైన రహదారులను నిర్మించలేదన్నారు. 30 మందికి పైగా ఎంపీలు ఉన్న జగన్ ఏనాడూ కేంద్రాన్ని ప్రత్యేక హోదా, ప్రాజెక్టుల గురించి అడగలేదని ఆరోపించారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ తన కేసుల గురించే మాట్లాడుకున్నాడని ధ్వజమెత్తారు. మూడు రాజధానుల అంశం జగన్ చేసిన అతిపెద్ద తప్పిదమని వ్యాఖ్యానించారు. సీఎం హోదాలో జగన్ మద్యం వ్యాపారిగా మారిపోయాడన్నారు. జగన్ చేతకానితనంతో యువతకు ఉపాధి, ఉద్యోగం లేకుండా చేశాడన్నారు. ఈ కారణాలన్నీ జగన్ ఓటమికి మూలకారణమవుతాయని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లో కూటమికి అద్భుత ఫలితాలొస్తాయని, అక్కడి ప్రజలిచ్చే తీర్పు రాష్ట్రం మొత్తం ఉంటుందని గోనె వ్యాఖ్యానించారు.

సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్-సీపీఎం చర్చల్లో ప్రతిష్టంభన

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పది రోజులకుపైగా చర్చలు జరుగుతున్నా.. సీపీఎం, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. అరకు (ఎస్టీ) లోక్‌సభ, 5 అసెంబ్లీ స్థానాలు రంపచోడవరం (ఎస్టీ), కురుపాం(ఎస్టీ), గన్నవరం, మంగళగిరి, నెల్లూరు సిటీపైనే అవగాహన కుదిరింది. మరో 5 స్థానాలపై చర్చలు సాగుతున్నాయి. అయితే ఈలోపే వాటికి కూడా సీపీఎం తన అభ్యర్థులను ప్రకటించింది. పొత్తులో భాగంగా తమ పార్టీకి అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు 16 అసెంబ్లీ సీట్లను కేటాయించాలని కోరుతూ తొలుత సీపీఎం రాష్ట్రశాఖ కాంగ్రెస్‌కు జాబితా అందజేసింది. పలు దఫాల చర్చల్లో.. ఒక లోక్‌సభ, 6 అసెంబ్లీ స్థానాలను వదులుకునేందుకు సీపీఎం నేతలు అంగీకరించారు. కానీ అరకు లోక్‌సభ సీటుతోపాటు తమ పార్టీకి బలమున్న కురుపాం, అరకు, రంపచోడవరం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు సిటీ, కర్నూలు, సంతనూతలపాడు అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని స్పష్టం చేశారు. అయితే విజయవాడ సెంట్రల్, గాజువాక స్థానాలను తమకు వదిలిపెట్టి.. వాటి బదులు వేరే రెండు స్థానాలను తీసుకోవాలని కాంగ్రెస్ సూచించింది. దీనికి సీపీఎం అంగీకరించడం లేదు. దీంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. మరోవైపు ఎంపిక చేసుకున్న 10 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి తమ అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించేసింది.

ఎన్నికలవేళ ఎంతమందిని జైల్లో పెడతారు?:సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: సోషల్ మీడియాలో ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరినీ జైల్లో పెట్టలేరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌పై 2021లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మురుగన్ సత్తై అనే యూట్యూబర్‌కు సోమవారం బెయిల్‌ను పునరుద్ధరించింది. 'ఎన్నికల ముందు యూట్యూబ్‌లో ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరినీ మనం జైల్లో పెట్టడం ప్రారంభిస్తే గనుక.. ఎంతమంది జైల్లో ఉంటారో ఊహించండి!' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడు తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

కేంద్ర ఏజెన్సీల చీఫ్‌ల్ని మార్చండి:తృణమూల్ ధర్నా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: రాజకీయ కారణాలతో ప్రతిపక్ష సభ్యులను వేధిస్తున్న నాలుగు కేంద్ర సంస్థల అధిపతులను వెంటనే మార్చాలని డిమాండు చేస్తూ సోమవారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఇక్కడి ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. వారిని పోలీసులు వచ్చి అక్కడి నుంచి నుంచి వెళ్లిపోవాలంటూ పలుమార్లు కోరారు. అయితే వినకపోవడంతో ఈడ్చిపారేశారు.

భిలాయ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ముందుగా సీఓఏపీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. సంబంధిత నెంబర్‌ను దరఖాస్తు ఫారంలో సూచించాలి.

ఐఐటీ భిలాయ్‌లో ఎంటెక్



స్పెషలైజేషన్‌లు: బయో ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(పవర్ సిస్టమ్స్ అండ్ పవర్ ఎలక్ట్రానిక్స్/కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్/థర్మల్ అండ్ ఫ్లూయిడ్స్ ఇంజనీరింగ్), మెకట్రానిక్స్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. బయో ఇంజనీరింగ్ విభాగానికి బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీడీఎస్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విభాగానికి నిర్దేశించిన మేరకు జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైనవారికి గేట్ స్కోర్ అవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 17
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ/పీజీ సర్టిఫికెట్స్, మార్కుల పత్రాలు; కులం, ఆదాయం, అనుభవం ధ్రువీకరణ పత్రాలు
- **అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్, సెలెక్షన్ ప్రాసెస్:** ఏప్రిల్ 18 నుంచి
- **వెబ్‌సైట్:** www.iitbhilai.ac.in



కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కోల్‌కతాలో నిర్వహిస్తున్న ఇండియన్ అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్(ఐఏసీఎస్)-ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సైన్స్ స్పెషలైజేషన్‌లతో ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్-మాస్టర్స్, మాస్టర్స్/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లను అందిస్తున్న స్కూళ్లు

- స్కూల్ ఆఫ్ అప్లయిడ్ అండ్ ఇంటర్‌డిసిప్లినరీ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ బయలాజికల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ మెటీరియల్స్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్
- స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్

ఐఏసీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్-మాస్టర్స్ ప్రోగ్రామ్ ఇన్ సైన్స్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. మొదటి మూడు సెమిస్టర్లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టులకు సంబంధించిన ఫౌండేషనల్ కోర్సులు ఉంటాయి. నాలుగో సెమిస్టర్ నుంచి పై సబ్జెక్టులలో ఒకదాన్ని మేజర్ సబ్జెక్టుగా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఏడో సెమిస్టర్ నుంచి రీసెర్చ్ కోర్సులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్ స్ట్రీమ్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: యూజీ ప్రీ ఇంటర్వ్యూ స్క్రీనింగ్ టెస్ట్(యూపీఎస్‌టీ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి 20 ప్రశ్నలు; కంప్యూటర్ సైన్స్/బయలాజికల్ సైన్సెస్ సబ్జెక్టు నుంచి మరో 20 ప్రశ్నలు అటెమ్ట్ చేయాల్సి ఉంటుంది. ప్రశ్నకు 2 మార్కులు నిర్దేశించారు. మూడు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 80 మందిని ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులందరికీ సంస్థ నిబంధనల ప్రకారం నాలుగో సెమిస్టర్ నుంచి ప్రతినెలా స్టయిపెండ్ ఇస్తారు.

మాస్టర్స్/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ సైన్స్

- మొదట మాస్టర్స్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. తరవాత పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. దీనినే ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్-పీహెచ్‌డీగా పరిగణిస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) కూడా ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మెటీరియల్స్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్, అప్లయిడ్ అండ్ ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటికల్ అండ్ కంప్యూటేషనల్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ఎంపిక: అభ్యర్థులను మాస్టర్స్ ప్రీ ఇంటర్వ్యూ స్క్రీనింగ్ టెస్ట్(ఎంపీఎస్‌టీ) ద్వారా ఎంపిక చేస్తారు. దీనిని కూడా సీబీటీ విధానంలోనే నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత స్పెషలైజేషన్‌నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అర్హత పొందినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. స్పెషలైజేషన్‌కు 20 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులందరికీ మొదటి రెండేళ్లు నెలకు రూ.12,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 13
- **ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్ తేదీలు:** జూన్ 16 నుంచి
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 8 నుంచి
- **వెబ్‌సైట్:** www.iacs.res.in

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్)- 'స్టూడెంట్ ఇంటర్న్‌షిప్ స్కీమ్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇంటర్న్‌షిప్ వ్యవధి కనిష్ఠంగా ఎనిమిది వారాల నుంచి గరిష్ఠంగా పన్నెండు వారాల వరకు ఉంటుంది. నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయాల్లో 35 సీట్లు, ముంబై హెడ్ ఆఫీస్‌లో 5 సీట్లు చొప్పున మొత్తం 40 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు రెండు సీట్లు ప్రత్యేకించారు. ముంబైలోని సీట్లకు దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు పోటీపడవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా అభ్యర్థులు నాబార్డ్‌కు సంబంధించిన ప్రాజెక్ట్‌లు, ప్రోగ్రామ్‌లు, స్కీమ్‌లు, యాక్టివిటీస్, సక్సెస్ స్టోరీస్‌పై డాక్యుమెంటేషన్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

నాబార్డ్ స్టూడెంట్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంటర్న్‌షిప్ అంశాలు: కేసీసీ కవరేజ్/ఇష్యూస్ & స్ట్రాటజీ టూ ఇంప్రూవ్ లెండింగ్ త్రూ కేసీసీ

- బిజినెస్ డైవర్సిఫికేషన్ ఆఫ్ పీఏసీఎస్-ఇంప్రూవింగ్ దైర్ ప్రాఫిటబిలిటీ
- స్మార్ట్ అగ్రికల్చర్-ఐఓటీ, డ్రోన్ డివైజెస్, ఇంప్లిమెంటేషన్, యాక్సెప్టబిలిటీ అండ్ ఛాలెంజెస్

అర్హత: వ్యవసాయం, అనుబంధ విభాగాలు (వెటర్నరీ, ఫిషరీస్ తదితరాలు), అగ్రీ బిజినెస్, ఎకనామిక్స్, సోషల్ సైన్సెస్(సోషియాలజీ, జాగ్రఫీ తదితరాలు), మేనేజ్‌మెంట్ విభాగాల్లో పీజీ మొదటి సంవత్సరం పూర్తిచేసినవారు/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో('లా' సహా) నాలుగో సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: పదోతరగతి, ఇంటర్/పన్నెండోతరగతి, డిగ్రీ స్థాయుల్లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో సాధించిన మెరిట్ ప్రకారం సంస్థ నిబంధనల మేరకు అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూ.18,000ల నగదు ఇస్తారు. ఫీల్డ్ విజిట్ అలవెన్స్ కింద 30 రోజులకుగాను రోజుకి రూ.2,000/- రూ.1500 (నిబంధనల ప్రకారం) చెల్లిస్తారు. అలాగే ట్రావెల్ అలవెన్స్ కింద రూ.6,000; అదనపు ఖర్చుల కింద రూ.2,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఇంటర్న్‌షిప్ సమయం:** మే 1 నుంచి ఆగస్టు 30 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 23
- **ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.nabard.org

జాబ్ కార్నర్

నైపర్ మొహాలీలో టీచింగ్ ఖాళీలు

ఖాళీలు 32

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రొఫెసర్: 13
2. అసోసియేట్ ప్రొఫెసర్: 12
3. అసిస్టెంట్ ప్రొఫెసర్: 7

విభాగాలు: ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ- ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.

అర్హత: పీహెచ్‌డీతో పాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

జీతం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100- రూ.2,20,200. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600- రూ.2,11,300. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 - రూ.1,67,400.

వయోపరిమితి: 50 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: ద రిజిస్ట్రార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెక్టార్-67, ఎస్.ఏ.ఎస్. నగర్(మొహాలీ), పంజాబ్.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 6

వెబ్‌సైట్: https://niper.gov.in/

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్స్



మొత్తం ఖాళీలు: 4660

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబై, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. **కానిస్టేబుల్: 4,208 పోస్టులు**
2. **సబ్ ఇన్‌స్పెక్టర్: 452 పోస్టులు**

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయ్‌మెంట్ న్యూస్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు18-28 ఏళ్ల మధ్య, ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 15

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్‌లో అప్రెంటిస్

ఖాళీలు 492

చిత్తరంజన్(పశ్చిమబెంగాల్)లోని చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్...2024-25 సంవత్సరానికి గాను కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, పెయింటర్

అర్హత: అభ్యర్థులు పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 27 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలో సాధించిన మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: clw.indianrailways.gov.in/

రైట్స్‌లో ఇంజనీర్, టీమ్ లీడర్ ఖాళీలు

ఖాళీలు 31

గురుగావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్)...కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ లీడర్(సివిల్): **1 పోస్టు**
2. టీమ్ లీడర్(సివిల్): **5 పోస్టులు**
3. డిజైన్ ఎక్స్‌పర్ట్(సివిల్): **6 పోస్టులు**
4. రెసిడెంట్ ఇంజనీర్(బ్రిడ్జ్/ట్రాక్/సివిల్/ఎస్ అండ్ టి/ఎలక్ట్రికల్): **18 పోస్టులు**
5. ఇంజనీర్(డిజైన్): **1 పోస్టు**

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 16 నాటికి 55 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: లేదు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 12, 15, 16

వేదిక: రైట్స్ భవన్(గురుగావ్), రైట్స్ ఆఫీస్(అహ్మదాబాద్), రైట్స్ ఆఫీస్(ముంబయి)

వెబ్‌సైట్: www.rites.com/Career

సీబీఎస్ఈలో గ్రూప్- ఎ, బి, సి పోస్టులు

ఖాళీలు 118

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్): **18 పోస్టులు**
2. అసిస్టెంట్ సెక్రటరీ(అడకమిక్): **16 పోస్టులు**
3. అసిస్టెంట్ సెక్రటరీ(స్కిల్ ఎడ్యుకేషన్): **8 పోస్టులు**
4. అసిస్టెంట్ సెక్రటరీ(ట్రెయినింగ్): **22 పోస్టులు**
5. అకౌంట్స్ ఆఫీసర్: **3 పోస్టులు**
6. జూనియర్ ఇంజనీర్: **17 పోస్టులు**
7. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: **7 పోస్టులు**
8. అకౌంటెంట్: **7 పోస్టులు**
9. జూనియర్ అకౌంటెంట్: **20 పోస్టులు**

అర్హతలు: పోస్టును అనుసరించి విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి సమాచారం మార్చి 12న సంస్థ వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 12

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

లిటిల్స్



కోతుల మూర్ఖత్వం

ఒక అడవిలో రెండు కోతులు ఉండేవి. అవి రెండూ తెలివవైనవి. రెండూ మూర్ఖంగా ఉండేవి. ఇతర కోతులు కూడా ఇవి చెప్పినట్లు నడుచుకుండేవి. ఇవి తెలివైనవని అవి భావించేవి.

ఒకసారి రెండు కోతులు అడవిని విడిచి దగ్గరగా ఉండే ఓ గ్రామానికి వెళ్లాయి. అది చలికాలం సమయం కావటం వల్ల ఊరిలోని జనాలు పుల్లలు అంటించి ఆ శాకానికి చేతులు కాపుతూ ఉన్నారు. ఆ మంటను చూసి ఈ రెండు కోతులూ అలానే చేయాలని నిర్ణయించుకున్నాయి. అసలే కోతులు అనుకరించటంలో ముందుంటాయి. కాబట్టి వారి స్వస్థలానికి వెళ్లి అలా మంటను కాచుకోవాలనుకున్నాయి.

ఒకవారం తర్వాత మరింత చలి పెరిగింది. దీంతో తట్టుకోలేక కచ్చితంగా అగ్గివేయాలని నిర్ణయించుకున్నాయి ఆ రెండు కోతులు. అదే సమయంలో కోతుల రారాజు 'ఈ చలిని తట్టుకోవటానికి ఉపాయం ఉందా?' అని అడిగింది. ఈ రెండు కోతులు విషయాన్ని చెప్పాయి. ఆ బాధ్యత మీదే అనటంతో.. ఈ రెండు కోతులు అప్రమత్తమయ్యాయి. విషయాన్ని రాజుకు చెప్పాయి. ఆ రెండు కోతులకు నిప్పు ఎలా పుట్టించాలో తెలీదు. అడవంతా అగ్గి కోసం తిరిగాయి. నిప్పు కనిపించలేదని చెప్పాయి. రాజుగారు కోపంతో గద్దించారు. దీంతో మళ్లీ వెళ్లిపోయాయి నిప్పుకోసం.




అడవిలో తిరుగుతుంటే ఒక మిణుగురు పురుగు కనపడింది. అది మెరుస్తూ ఉంది. రెండు కోతులూ ఆ పురుగును వెంబడించనా దొరకలేదు. దూరంగా వందల మిణుగురు పురుగులు. వీటన్నింటినీ ఒకేచోటకు తీసుకొచ్చి వెచ్చదనం పొందవచ్చునని ఈ రెండు కోతులు ఆలోచించాయి. దీంతో కోతులు ఆ మిణుగురు పురుగుల వెంట పడ్డాయి. కొన్ని దొరికాయి. రాజుగారిని అడిగి మరిన్ని వానరాల్ని వీటి వెంట తెచ్చుకున్నాయి. కోతులన్నీ ఎగురుతూ కొన్ని మిణుగురు పురుగులను తెచ్చి ఒక చోట కుప్పగా పోశాయి. మంచి వెలుతురు వస్తోంది. అయితే వెచ్చదనం రాలేదు. అదే సమయంలో రాత్రి మేలుకున్న ఓ గుడ్లగూడ ఇలా అన్నది.. 'మీకు తెలివే లేదు. ఈ మిణుగురు పురుగులు స్వయంగా మెరిసేవి. వీటి వల్ల అగ్గిపుట్టదు. మీ మూర్ఖత్వం అందరికీ అంటిస్తే ఎలా? ' అన్నది. 'ముసలి గుడ్లగూడ నీకేం తెలుసు?' అంటూ కోతులు గద్దించాయి. మిణుగురు పురుగులు పెడుతూనే అవి పైకి ఎగిరిపోతున్నాయి. వాటిని చంపితే వెలుగు రాదని ఆ రెండు కోతులకు తెలుసు. అందుకే వాటిని చంపొద్దన్నాయి. అలా కోతులన్నీ అలసిపోయి మిణుగురులను కొన్నింటని తెచ్చాయి. వెలుగు అయితే వచ్చింది. మంట రాలేదు. వెచ్చదనం రాలేదు. కోతులు అలసిపోయి రాత్రికి నిద్రపోయాయి. మిణుగురులు ఎగిరిపోయాయి. కొమ్మ మీద ఉండే గుడ్ల గూబ అరుస్తూ 'మూర్ఖం కోతులు' అంటూ తిట్టింది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 276

2		6			4		7	
	9		8	1				
		3					9	
		2			9			
7		9				5		8
			2			1		
	5					9		
				3	8		1	
	7		9			4		2

సుడోకు - 275 సమాధానం

6	8	2	4	7	9	1	5	3
4	5	7	3	1	8	6	9	2
3	9	1	6	5	2	7	4	8
5	3	4	1	2	6	8	7	9
2	6	8	7	9	5	3	1	4
1	7	9	8	3	4	5	2	6
7	4	3	2	6	1	9	8	5
8	1	5	9	4	3	2	6	7
9	2	6	5	8	7	4	3	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.